ఆధునిక చిత్రకళా రీతులు
రూ|| 150/-
పేజీలు: 150


నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

‘బస్ కా పయ్యా నహీ చలేగా’ 06

అమెరికాలో మంచు తుఫాను ముప్పు 02

సంపుటి 09, సంచిక: 86 | మంగళవారం | 24-02-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ప్రభుత్వ ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్



- మొత్తం 17.07 లక్షల మందికి పథకం వర్తింపు
- ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 652 ఎంప్యానెల్ ప్రైవేట్ హాస్పిటల్స్‌లోనూ వర్తించనున్న ఇహెచ్‌ఎస్
- పథకం కింద మొత్తం 1998 వైద్య చికిత్సలు
- ప్రతి ఉద్యోగికీ డిజిటల్ హెల్త్ ఎంప్లాయి కార్డ్
- ప్రమాదంలో ఉద్యోగి మరణిస్తే రూ.1.2 కోట్ల ప్రమాద బీమా
- టివివిపిని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మార్పు
- హెచ్‌ఎండిఎ పరిధిలోకి మరికొన్ని గ్రామాలు
- మెట్రోరైల్ స్వాధీనం
- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం




ప్రజాపక్షం/హైదరాబాద్

దీర్ఘకాలికంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) కోరికకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. మొత్తం 3 లక్షల 56 వేల మంది ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులతో పాటు 2.88 లక్షల మంది పెన్షనర్లు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు మొత్తం 17.07 లక్షల మందికి ఈహెచ్‌ఎస్ పథకం వర్తింపజేయాలని నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలోజరిగిన మంత్రివర్గ సమావేశం తీసుకున్న నిర్ణయాలను అనంతరం వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ “ఇకపై ప్రభుత్వ ఉద్యోగులు ఆసుపత్రుల్లో ఒక్క రూపాయి చెల్లించకుండానే వైద్య చికిత్సలు అందుతాయి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 652 ఎంప్యానెల్ ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఈహెచ్‌ఎస్ పథకం వర్తిస్తుంది. దీనిపై మొత్తం 1998 రకాల వైద్య చికిత్సలు అందిస్తారు ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ ఎంప్లాయీ కార్డ్ అందిస్తారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఈ ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ పథకానికి ప్రభుత్వ ఉద్యోగులు తమ బేసిక్ పే నుంచి 1.5 శాతం తమ వాటాగా చెల్లిస్తారు. అంతే సమాన వాటాను ప్రభుత్వం మ్యాచింగ్ వాటా చెల్లిస్తుంది. ఏడాదికి ఉద్యోగులు రూ. 528 కోట్లు తమ వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం కూడా రూ. 528 కోట్లు వాటా చెల్లిస్తుంది. మొత్తం తరువాయి 2లో

# 16 నుంచి అసెంబ్లీ



## మార్చి 20న రాష్ట్ర బడ్జెట్

- తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 2026–27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ శాసనసభ 2026–2027 వార్షిక బడ్జెట్ సమావేశాలు మార్చి 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ 16వ తేదీన శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క 20వ తేదీన 2026–2027 వార్షిక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెడతారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఇదిలా ఉండగా ఈ నెల 26వ తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తొలుత భావించింది. అయితే పలు ప్రభుత్వ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశాలు ఇంకా పూర్తి కాకపోవడం, కేంద్రం నుంచి వచ్చే నిధులు, తదితర అంశాలపై స్పష్టత రాకపోవడంతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను మార్చి 16వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బడ్జెట్ రూపకల్పనకు అత్యంత ముఖ్యమైన అన్ని శాఖల వారీగా ప్రీ బడ్జెట్ సమావేశాలు ఇంకా పూర్తి కాలేదు. ముఖ్యమంత్రి తరువాయి 2లో

నేడు ఆర్‌టిసి కార్మికుల

# ‘చలో సెక్రటేరియట్’

- ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్
- ఇందిరాపార్కు నుంచి సెక్రటేరియట్ వరకు నిరసన ర్యాలీ
- పెద్ద ఎత్తున హాజరయ్యేందుకు కార్మికుల సన్నద్ధం

03

# మే 11 నుంచి ఇళ్ల గణన

జూన్ 9 వరకు తొలివిడత సెన్సెస్ నిర్వహణ
హౌస్ లిస్టింగ్‌కు 34 ప్రశ్నల నమూనా
మంత్రివర్గానికి వివరించిన సిఎస్ రామకృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జనగణనలో తొలి విడత జరిగే ఇండ్ల గణన (హౌస్ లిస్టింగ్ ఆపరేషన్) తెలంగాణ రాష్ట్రంలో మే 11వ తేదీన ప్రారంభించి జూన్ 9 వరకు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జన గణన – 2027ను చేపట్టేందుకు రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లను సోమవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గం చర్చించింది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తొలి విడత జరిగే ఇళ్ల గణన (హౌస్ లిస్టింగ్ ఆపరేషన్) చేపట్టేందుకు ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంత్రివర్గానికి వివరించారు. హౌస్ లిస్టింగ్‌కు కేంద్రం నిర్దేశించిన 34 ప్రశ్నల నమూనాను ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు కలిపి మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జన గణన ప్రక్రియలో పాలుపంచుకుంటారని, రెండో దశ జన గణన ప్రక్రియ వచ్చే ఏడాది 2027 ఫిబ్రవరి లో చేపడుతారని ఆయన వెల్లడించారు.

# గచ్చిబౌలిలో గజం రూ.1.76 లక్షలు



- కూకట్‌పల్లిలో గజానికి రూ.1.64 లక్షలు పలికిన భూముల ధరలు
- 14 ప్లాట్లు విక్రయించిన ప్రభుత్వం
- సర్కార్‌కు రూ.34.24 కోట్ల ఆదాయం

ప్రజాపక్షం/హైదరాబాద్

నగరంలోని స్థిరాస్తి విపణిలో ప్రభుత్వ భూములకు మరోసారి భారీ డిమాండ్ వచ్చింది. తాజాగా తెలంగాణ హౌసింగ్ బోర్డు నిర్వహించిన బహిరంగ వేలంలో ప్లాట్లు రికార్డు ధరలకు అమ్ముడయ్యాయి. గచ్చిబౌలి, కూకట్‌పల్లి ప్రాంతాల్లోని స్థలాలు పోటీపడి మరీ కొనుగోలుదారులు దక్కించుకున్నారు. నగరంలోని గచ్చిబౌలి, బౌరంపేట్, బాలాజీ నగర్, చింతల్ వంటి ప్రాంతాల్లోని 14 ప్లాట్ల విక్రయానికి ఈ నెల 9న నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. కెపిహెచ్‌బి కమ్యూనిటీ హాల్లో సోమవారం నిర్వహించిన ఈ వేలం పాటలో సుమారు 50 మంది బిడ్డర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేలం ద్వారా మొత్తం రూ.34.27 కోట్ల ఆదాయం తరువాయి 2లో

గౌరెల్లి ప్రాజెక్ట్ భూసేకరణ

# జూన్ 2కు ముందే నిధులు విడుదల

- రెండురోజుల్లో విచారణకు రానున్న ప్రాజెక్టు కేసు
- న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు సిద్ధమవ్వాలి
- పనుల పురోగతిపై సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

గౌరెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణకు అవసరమైన నిధులను జూన్ 2వ తేదీకి ముందే విడుదల చేస్తామని, దీనికి సంబంధించిన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయలని కరీంనగర్, జనగామ, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లను నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కేసు మరో రెండు రోజుల్లో విచారణకు రానున్న నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులను అధిగమించెందుకు అవసరమైన వ్యూహంతో సిద్ధంగా ఉండాలని అడ్వకేట్ జనరల్‌కు సూచించారు. సిద్దిపేట జిల్లా అక్కనపెట మండలంలోనీ గౌరెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పురోగతిపై అంశంపైన హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్య దాస్‌నాథ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్, ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇఎన్‌సి జనరల్ రమేష్ బాబులతో పాటు కరీంనగర్ జనగామ, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తరువాయి 12లో



# రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- హాజరుకానున్న పదిలక్షల మంది విద్యార్థులు
- రాష్ట్ర వ్యాప్తంగా 1495 పరీక్షా కేంద్రాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇంటర్ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నెల 25 తేదీ నుంచి మార్చి 18 వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఈ ఏడాది మొత్తం తరువాయి 2లో

## నాగులమ్మ చెరువు

# నీళ్లు కలుషితం

ప్రజారోగ్యానికి ముప్పు..
భయాందోళనలో స్థానిక ప్రజలు
నాంపల్లిలో పట్టణ కేంద్రంలో చెరువు దుస్థితి



ప్రజాపక్షం/నాంపల్లి

నల్లగొండ జిల్లా నాంపల్లి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రాచీన నాగులమ్మ చెరువు పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత ఈ చెరువు నిండుకుండలా నిండినా, ప్రజల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెరువు నీరు పూర్తిగా కలుషితమవుతోంది. చెరువులోకి ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయనిక పదార్థాలు, మృత కళేబరాలు నిర్లక్ష్యంగా పారవేస్తుండటంతో నీటి నాణ్యత దారుణంగా పడిపోయింది.ఒకప్పుడు ప్రాంత ప్రజలకు ఉపయోగపడిన ఈచెరువు ఇప్పుడు అసహనకరమైన దుర్వాసనకు కేంద్రంగా మారింది. బస్టాండ్ నుంచి చౌరస్తా వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని చెరువు ఉండటంతో, రోజూ వందలాది తరువాయి 12లో



ఉత్తర కొరియా అధికార వర్కర్స్ పార్టీ

# ప్రధాన కార్యదర్శిగా కిమ్ తిరిగి ఎన్నిక

**ప్యాంగ్‌యాంగ్ :** ఉత్తర కొరియా అధికార వర్కర్స్‌పార్టీ (డబ్ల్యుపికె) ప్రధాన కార్యదర్శిగా ఆ దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ తిరిగి ఎన్నికయ్యారు. పార్టీ కేంద్ర కమిటీలో పలువురు కొత్త నాయకులు ఎన్నికయ్యారు. పార్టీ తొమ్మిదో కాంగ్రెస్ మహాసభలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీ సభ్యులు, పౌరులు, తరువాయి 12లో

# ఇక డిజిటల్‌గా సాగు లెక్క



- పంటల సర్వేకు సాంకేతిక వలంటీర్లు
- యాసంగికి ప్రత్యేక కార్యాచరణ
- సుమారు 2 లక్షల ఎకరాలల్లో డిజిటల్ సర్వే
- జిల్లాలో 255 మంది ప్రైవేటు యువత నియామకం
- పంటల సర్వేకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

పంటల సాగు లెక్క ఇక డిజిటల్ మయం కానుంది. ఇందు కోసం కేంద్రప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్త ఈ సర్వేలో భాగంగా జిల్లాలో సాగు యోగ్యమైన భూములు, వాటిలో వేసే పంటలు క్రడిష్టల్ మ్యాప్ ఆధారంగా డిజిటల్ సర్వేచేసి లెక్క తేల్చనున్నారు. ఈ యాసంగి సాగు నుండి ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నారు. ఈ డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 255 మంది ప్రైవేటు వలంటీర్లను ఆయా గ్రామాల వారీగా ఎఇఒలు నియామకం చేస్తారు. మొన్నటి వరకు సాగు మొత్తాన్ని విస్తీర్ణాధికారులు అంచనాలు వేసి నివేదికలు సమర్పించే వారు. కాగా ఈ యాసంగి నుండి మాత్రం కేంద్రప్రభుత్వం ఇందు కోసం ప్రత్యేక పద్ధతిని తీసుకొచ్చి సాగు విస్తీర్ణాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆధునిక సంకేతిక సహాయంతో పంటల వివరాలు సమగ్రంగా, తరువాయి 2లో



## వెనిజులా జైలులో 214 మంది
# ఖైదీలు నిరాహార దీక్ష

**కారకస్:** వెనిజులా జైళ్ళ నుండి 16 మంది ఖైదీలు బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. జైలు బయట ఎదురుచూస్తున్న వారి కుటుంబ సభ్యులను కలుసుకోవడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్వేగభరిత వాతావరణం ఏర్పడింది. ఇదిలా ఉండగా జైలులో ఉన్న మరో 200 మంది ఖైదీలు అమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ప్రభుత్వం చట్టసభలో ఆమోదించిన అమ్నెస్టీ బిల్లును తమకు కూడా వర్తింపజేయాలని కోరుతూ రాజధాని కారకస్‌కు 40కి.మీ దూరంలో ఉన్న రోడియో ప్రిజన్–1లో వారు నిరాహార దీక్ష ప్రారంభించారు. కాగా రెడ్‌క్రాస్ అంతర్జాతీయ కమిటీని ఈ జైలును సందర్శించేందుకు ప్రభుత్వం మొదటిసారి అనుమతించింది. రెడ్‌క్రాస్ సభ్యులు ఆదివారం ఈ జైలును సందర్శించారు.
రాజకీయ ఖైదీలను విడుదల చేసేందుకు అమ్నెస్టీ బిల్లును వెనిజులా చట్టసభలో ప్రవేశపెట్టి ఆమోదించారు. మొత్తం 1557 మంది ఖైదీల నుండి విడుదల చేయాలని కోరుతూ విజ్ఞాపన పత్రాలు వచ్చాయని ప్రభుత్వం తొలుత తెలియజేసింది. వారిని విడుదల చేయాలంటూ ట్రంప్ ప్రభుత్వం వారిపై తీవ్ర ఒత్తిడి చేసింది. వారి విడుదల ప్రక్రియ కొనసాగుతోంది. వెనిజులాలో 11,000 మంది హక్కుల నాయకులు,జర్నలిస్టులు, ప్రతిపక్ష నాయకులు జైళ్లల్లో ఉన్నారని అమెరికా చెబుతున్నది. ఐతే అమ్నెస్టీ బిల్లు తీసుకురాక ముందే వెనిజులా అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ఇప్పటికే వందలమంది ఖైదీలను విడుదల చేశారు.

# ఇరాన్‌కు మరో అవకాశం!



## 27న చర్చలకు అమెరికా సిద్ధం

**మాస్కో:** తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో ఇరాన్‌తో ఈనెల 27వ తేదీన జెనీవాలో మరోసారి అమెరికా చర్చలు జరిపేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఐతే ఇరాన్‌కు ఒక షరతు విధించింది. ఇరాన్ సర్వాధినేత అలీ ఖమేనీ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు, నేరుగా ఆయననే లక్ష్యంగా చేసుకుని భారీ సైనికచర్య చేపట్టేముందుగా అమెరికా ఇస్తున్న చివరి అవకాశం ఇదేకావచ్చునని 'యాగ్జియస్' వెబ్‌సైటు పేర్కొన్నట్లు టాస్‌వార్తాసంస్థ తెలియజేసింది. కాగా, ఇరాన్ రిపబ్లిక్ నిర్వహిస్తున్న అణు కార్యక్రమానికి సంబంధించి తమ ప్రతిపాదనలకు సవిరంగా 48 గంటల్లో సమాధానం చెబితే చర్చలకు సిద్ధంగా ఉన్నామని అమెరికా తెలియజేసిందని వెబ్‌సైటు పేర్కొంది. తాము అడిగిన అణు కార్యక్రమం వివరాలను తెలియజేస్తే చర్చలకు సిద్ధమని, ఆ మేరకు అణు ఒప్పందం చేసుకోవచ్చునని అమెరికా అధికారి చెప్పారు. ఇరాన్ గనుక ఈ విషయంలో ఒక స్పష్టత ఇచ్చి స్పందిస్తే అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్ వచ్చే శుక్రవారంనాటికి జెనీవాలో ఉండేందుకు షెడ్యూలు సిద్ధం చేసుకుంటారని తెలిపింది. రెండు దేశాలూ పూర్తి అణు ఒప్పందం చేసుకునేముందు ఒక మధ్యంతర ఒప్పందం కూడా చర్చించవచ్చునని పేర్కొంది. మరోవైపు అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు యుద్ధ హెచ్చరిక చేశారు. ఇరాన్ కూడా అదేస్థాయిలో స్పందించింది. దాడిచేసే ఆత్మరక్షణ చేసుకుంటామని, ఎదురుదాడి చేయడం తమ హక్కు అని ప్రకటించింది. యురేనియంను శుద్ధిచేస్తామని, అణ్వాయుధాలు తమ లక్ష్యం కాదని, శాంతియుత ప్రయోజనాలకే యురేనియం శుద్ధి చేస్తామని మరోసారి పేర్కొంది. అణుకార్యక్రమం చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల ఆరో తేదీన ఒమన్‌లో ఇరాన్–అమెరికా మధ్య మొదటి రౌండ్ చర్చలు జరిగాయి. ఒమన్ మధ్యవర్తిత్వంలో ఈనెల 17వ తేదీన జెనీవాలో రెండో రౌండ్ చర్చలు జరిగాయి. ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి చెప్పిన ప్రకారం భవిష్యత్ అణు కార్యక్రమ ఒప్పంద ముసాయిదాలో చేర్చగల అంశాలపై ఒక అంగీకారం కుదిరింది.

**26న జెనీవాలో విట్‌కాఫ్‌ను కలుస్తా : ఇరాన్ మంత్రి అబ్బాస్ అరాఘ్చి**

జెనీవాలో ఈ నెల 26వ తేదీన అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్‌ను కలుస్తానని ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి చెప్పారు. ఐతే ఈనెల 27న జెనీవాలో ఇరాన్‌తో సమావేశానికి సిద్ధంగా ఉన్నట్లు అమెరికా నుండి కూడా ఒక వార్త వెలువడింది. ఒకరోజు తేదీ అటూ ఇటూగా ఉన్నప్పటికీ అమెరికా–ఇరాన్ మధ్య ఖాయంగా ఈ నెల 26, 27 తేదీలలో మరోసారి సమావేశం జరిగే అవకాశాలు ఉన్నాయని స్పష్టమైంది. 'మేం ఇంకా దానిపై కసరత్తు చేస్తున్నాం, ఇరువైపులా ప్రతినిధులకు అనుగుణంగా ఉండే ఆలోచనలు చేస్తున్నాం' అని అబ్బాస్ ఆరాఘ్చి చెప్పారు. ఈసారి కలిసినప్పుడు అమెరికాతో ఒక ఒప్పందానికి రావచ్చునని నేను నమ్ముతున్నాను, ఇది నాకున్న అవగాహన లేదా వేగవంతంగా ప్రక్రియ ముందుకు వెళ్ళవచ్చు అన్నారు.

## నేపాల్‌లో ఘోర ప్రమాదం 19 మంది మృతి

### ఘాట్‌రోడ్డులోంచి జారి, నది ఒడ్డున పడిన బస్సు



**కాఠ్మండు :** నేపాల్‌లో ఎత్తైన పర్వతప్రాంత పృథ్వి రహదారిపై ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురికావడంతో అందులో ప్రయాణిస్తున్న 19 మంది దుర్మరణం చెందారు. మృతుల్లో బ్రిటన్, చైనా, న్యూజిలాండ్ దేశాల పౌరులు కూడా ఉన్నారు. బస్సు ప్రమాదానికి గురైన సమయంలో 44 మందితో కిటకిటలాడుతోంది. సోమవారం తెల్లారుజామున ఈ ప్రమాదం జరిగింది. బస్సు దొర్లుకుంటూ దొర్లుకుంటూ 650 అడుగుల లోతున ఉన్న త్రిసూలీ నది ఒడ్డుకువెళ్ళి పడింది. దీంతో బస్సు నుజ్జు నుజ్జయింది. ప్రమాదం ఎలా జరిగిందనే పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. పశ్చిమ నేపాల్‌లో బాగా ఎత్తుగా ఉన్న ఒక పర్వతప్రాంతంవైపు పైకి ఎక్కుతున్న సమయంలో బస్సు ప్రమాదానికి గురైంది. సోమవారం ఈ దుర్ఘటన జరిగినట్లు స్థానిక పోలీసులు చెప్పారు. ధాడింగ్ జిల్లా బెహిఘాట్ రోడ్డులో ప్రయాణించి వెళుతుండగా రాజధాని కాఠ్మండుకు 80 కి.మీ దూరంలో ఈ ప్రమాదం సంభవించింది. గాయపడిన 25 మంది ప్రయాణికులను కాఠ్మండులోని ట్రామా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. మరణించినవారిలో సాయంత్రం వరకూ తొమ్మిది మృతదేహాలను గుర్తించారు. సహాయబృందాలు పూర్తిగా బద్దలైపోయిన బస్సు విడిభాగాలను ఊడదీసి అందరినీ బయటకు తీశారు. విడిభాగాలను పరిశీలన నిమిత్తం సాంకేతిక ప్రదేశానికి తరలిస్తున్నారు. 2024లో కూడా ఇదే ప్రాంతంలో 65 మంది ప్రయాణికులతో కూడిన రెండు బస్సు ప్రమాదాలు జరిగాయి. ఈ బస్సుల శిథిలాలు నదిలోని ఇసుకలో మునిగిపోయాయి. ఈ ఏడాది లోనే ఒక బస్సు శకలాలు లభించాయి. ఇందులోని ప్రయాణికులు మరణించడమో, జాడ తెలియకుండా పోవడమో జరిగింది. నేపాల్ ఆసియాలో పర్వతారోహకులకు ప్రముఖ సందర్శనకేంద్రంగా మారింది. ఈ దేశంలో పర్యాటకులు ఎక్కువమంది ఉంటారు.

# అమెరికాలో మంచు తుఫాను ముప్పు

### 5 వేల విమానాలు రద్దు : 4కోట్ల మందికి హెచ్చరిక



**న్యూయార్క్:** ఈశాన్య అమెరికాకు మంచు తుఫాను ముప్పు ముంచుకువచ్చింది. దాదాపు నాలుగు కోట్లమంది ప్రజలు ఈ మంచు తుఫాను ముప్పు హెచ్చరికలో ఉన్నారు. దీంతో అనేక ప్రాంతాలలో అత్యవసర పరిస్థితి విధించారు. 5,000 విమానాలను రద్దు చేశారు. ప్రజలను వీధుల్లో తిరగవద్దని ప్రభుత్వాలు హెచ్చరికలు చేశాయి. లాంగ్ ఐలాండ్‌లో గంటకు మూడు అంగుళాల మందాన మంచు రాత్రంగా పేరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ తనపరిధిలోని ప్రాంతం అంతటా అత్యవసర పరిస్థితి విధించారు. స్కూలు,విద్యాలయాలకు సెలవులు ప్రకటించారు. గడచిన తొమ్మిది సంవత్సరాలలో న్యూయార్క్ సిటీలో ఇలాంటి తీవ్రమైన మంచు తుఫాను పరిస్థితి రాలేదు. న్యూయార్క్ సిటీలోని కొన్ని ప్రాంతాలలో 15 అంగుళాల మందాన మంచు పేరుకుపోయిందని వాతావరణశాఖ తెలిపింది. వీధుల్లో రెండు అడుగుల మందాన మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. టైమ్‌స్క్వేర్ వద్ద మంచు భారీగా పేరుకుపోతోంది. ఈ రాత్రంతా వీధుల్లో భయంకరమైన మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని నార్త్ కరోలినా నుండి నార్త్ మైన్ వరకూ హెచ్చరికలు జారీ అయ్యాయి.కెనడాలోని కొన్ని ప్రాంతాలలో కూడా మంచు తుఫాను హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా తూర్పు తీరంలో ఏటా ఇలాంటి సమస్య వస్తుంది. దీనిని నోర్ ఏస్టర్ అని పిలుస్తారు. ఒక్కోసారి ఇది చాలా ఉద్ధృతస్థాయిలో వస్తుంది. మంచు ఊహించనిరీతిలో పేరుకుపోతుంది. జాన్ ఎఫ్ కెన్నడీ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో 1,086 విమానాలు రద్దుచేశారు. బోస్టన్‌లో 968, న్యూయార్క్‌లో 861,ఫిలడెల్ఫియాలో 602 విమానాలు,లాగుయార్డియాలో 1,025 విమానాలు రద్దుచేశారు.

# ఉక్రేన్‌పై 26న త్రైపాక్షిక చర్చలు



**మాస్కో:** ఉక్రేన్‌లో యుద్ధ సమస్యపై ఫిబ్రవరి 26న అంటే నేటికి మూడోరోజున గురువారం జెనీవాలో త్రైపాక్షిక చర్చలు జరిగే అవకాశం ఉందని టాస్ వార్తాసంస్థ సోమవారం తెలియజేసింది. ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య జెనీవాలో ఫిబ్రవరి 17,18 తేదీలలో ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌లో జరిగిన త్రైపాక్షిక చర్చలు ఎలాంటి పురోగతి లేకుండా ముగిశాయి. మొదటిరోజు దాదాపు ఆరు గంటలు, రెండోరోజున మూడుగంటలసేపు ఈ చర్చలు జరిగాయి. చర్చలు చాలా కఠినంగా ఉన్నప్పటికీ అవన్నీ వ్యాపారపరంగా ఉన్నాయని చర్చల్లో పాల్గొన్న రష్యా తరపు ప్రధాన అధికార ప్రతినిధి, అధ్యక్షుడు పుతిన్ సహాయకుడు వ్లాదిమిర్ మిడిన్స్కీ ఆనాడు జెనీవాలో పాత్రికేయులకు చెప్పారు. ఐతే మరోసారి చర్చలు జరిగే అవకాశాలు ఉన్నాయని కూడా ఆయన చెప్పారు. అమెరికా తరపు ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ ఉక్రేన్–రష్యా ప్రతినిధులు మాత్రం ''చర్చలు కష్టంగా ఉన్నాయి(డిఫికల్ట్)''అని పెదవి విరిచారు. చర్చలు జరుగుతన్న సమయంలోనే యుద్ధ దాడులు, పరస్పర విమర్శలు కొనసాగాయి. ఈ ఏడాది జనవరి 23,24 తేదీలలో అబుధాబిలో మొదటి రౌండ్ చర్చలు, ఫిబ్రవరి 4,5 తేదీలలో రెండో రౌండ్ చర్చలు జరిగాయి.

## 16 నుంచి అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి కూడా వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఇటీవల ముంబాయి, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో పర్యటించారు. మొత్తం శాఖలలో ఇప్పటివరకు 5 శాఖలకు సంబంధించిన ప్రీబడ్జెట్ సమావేశాలు మాత్రమే జరిగాయి. ముఖ్యమంత్రి వద్ద ఉన్న విద్య, మున్సిపల్ పరిపాలన, హోమ్ తదితర శాఖలతో సహా ఇంకా పది శాఖల ప్రీ బడ్జెట్ సమావేశాలు జరగాల్సి ఉందని ఆర్థిక శాఖ అధికారుల సమాచారం. ఈ కారణాలతో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క మార్చి 5వ తేదీన జరగనున్న తన కుమారుని వివాహ ఏర్పాట్లలో బిజీగా ఉండడం, ఇతర ఆర్థిక, పరిపాలనా కారణాలతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను మార్చి 16వ తేదీ తరువాత నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## మెట్రో రైల్

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు. గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్అండ్‌టికి చెల్లించేలా రూ.13వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన ప్రక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడిబిఐ క్యాపిటల్, రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డిఎంఆర్‌సి మదింపు చేసి ప్రాథమిక నివేదికలు ఇచ్చాయి.

# ప్రభుత్వ ఉద్యోగులకు ఇహెచ్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

రూ.1056 కోట్లతో క్యాష్ లెస్ ఎంప్లాయి హెల్త్ స్కీమ్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమం. కుటుంబ భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి స్థాయిలో భరోసా, నమ్మకం కల్పిస్తుందనడానికి ఈ పథకాలు నిదర్శనమని కేబినెట్ మొత్తం హర్షం వ్యక్తం చేసింది'' అని వివరించారు.

**మంత్రివర్గం నిర్ణయాలు**

ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి భద్రత, భరోసా కల్పించేందుకు రెండు కొత్త పథకాలను ప్రారంభిస్తుంది. మొదటిది ఉద్యోగుల ప్రమాద బీమా పథకం. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు అందరికి, పెన్షనర్లకు ప్రమాద బీమా పథకం అమలు చేస్తుంది. ఉద్యోగులు ఒక్క రూపాయి ప్రీమియం కూడా చెల్లించకుండా ఈ పథకాన్ని అమలు చేస్తుంది. ప్రభుత్వం తొలిసారిగా సింగరేణిలో, ట్రాన్స్‌కోలో ఉద్యోగ వర్గాలకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అక్కడ విజయవంతంగా అమలు చేసింది. ఇప్పుడు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు అందరికి ఈ పథకాన్ని ప్రారంభిస్తుంది. ఈ ప్రమాద బీమా అమలుతో ఒకవేళ ఎవరైనా ప్రమాదంలో మరణిస్తే రూ.1.2 కోట్లు ప్రమాద బీమా పరిహారం అందుతుంది. సహజ మరణానికి 60 ఏళ్ల వరకు ఉద్యోగులకు రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. అటు ఉద్యోగులు, ఇటు ప్రభుత్వంపై ఎలాంటి భారం లేకుండా బ్యాంకర్ల ద్వారా బీమా అమలు చేయాలని రాష్ట్ర కేబినేట్ నిర్ణయించింది.
రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ హాస్పిటళ్లలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ వైద్య విధాన పరిషత్తు (టివివిపి) డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్గా (డిఎస్‌హెచ్) మార్చాలని నిర్ణయించింది. డిఎస్‌హెచ్ బిల్లు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటివరకు స్వతంత్ర వ్యవస్థగా ఉన్న టివివిపికి పూర్తిస్థాయి ప్రభుత్వ విభాగ హోదా లభిస్తుంది. నిధుల కేటాయింపులో ప్రాధాన్యం పెరుగుతుంది. సర్జికల్స్, మెడిసిన్స్ కొనుగోలు వేగంగా జరుగుతుంది. డాక్టర్లు, సిబ్బందికి సకాలంలో వేతనాలు అందడంతో వైద్య సేవలు మెరుగుపడుతాయి.

**కొత్త విధానాలపై అధ్యయనం చేసేందుకు కమిటీ**

వైద్య ఆరోగ్య శాఖలో కీలక సంస్కరణలు చేపట్టాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో వివిధ విభాగాల పరిధిలో ఉన్న అన్ని ఆసుపత్రుల నిర్వహణ సమర్థవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని చర్చించింది. అవసరమైన కొత్త విధానాలపై అధ్యయనం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయ, డాక్టర్ శ్రీనాథ్ రెడ్డిని కమిటీలో నియమించి వారి సలహాలు సూచనలు తీసుకుంటారు. ఆసుపత్రుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు హాస్పిటళ్లలో మెడికల్ సర్వీసెస్‌ను, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ వేరుగా విభజించే ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.

**హెచ్ఎండిఏ పరిధిలోకి గ్రామాలు**

హెచ్ఎండిఏ విస్తరణలో భాగంగా మరో నాలుగు గ్రామాలను హెచ్ఎండిఏ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వికారాబాద్ జిల్లాలోని నవాబ్ పేట్ మండలంలోని చిట్టిగూడ, యావపూర్, మోమిన్ పేట మండలం, ఎంకతాల గ్రామాలను హెచ్ఎండిఏ పరిధిలో చేర్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాంప్రెహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (సిఆర్ఎంపి ఫేజ్–2) చేపట్టేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ఫేస్ 1 లో ఉన్న 744 కిలోమీటర్లకు అదనంగా 300 కిలోమీటర్ల రోడ్లను ఫేస్ 2లో అభివృద్ధి. మెయింటెనెన్సు చేస్తారు. రూ. 3145 కోట్ల జిహెచ్ఎంసి నిధులతో ఈ ప్రాజెక్ట్ చేపట్టేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోమంజీరా వాటర్ సప్లై స్కీమ్ ఫేస్ 1, ఫేస్ 2 ఆధునీకరణ ప్రాజెక్ట్ కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ జల మండలి ప్రతిపాదనల మేరకు రూ. 722 కోట్ల తో ఈ ప్రాజెక్ట్ పనులకు నిర్ణయం తీసుకుంది. రూ. 282 కోట్లతో ఉస్మాన్ సాగర్ మంచినీటి పైప్ లైన్ ఆధునీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కాలం చెల్లిన పైపులు. పంప్ హౌస్ల కారణంగా దాదాపు 30 శాతం నీటి సరఫరాలో నష్టం వాటిల్లుతోంది. ఇప్పుడున్న ప్రాజెక్టు ఆధునీకరిస్తే ఈ పరిస్థితి అధిగమించటంతో పాటు హైదరాబాద్ సిటీలో నీటి సరఫరా మెరుగు పడుతుంది.

**మెట్రో రైల్ స్వాధీనం.. వేగంగా మెట్రో ఫేజ్ 2 విస్తరణ పనులు**

హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతమున్న 69 కిలోమీటర్ల మెట్రో వ్యవస్థను ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని మంతివర్గం నిర్ణయించింది. వెంటనే అందుకు అవసరమైన చర్యలు ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైల్ స్వాధీనం, సాధ్యాసాధ్యాలపై ఇప్పటికే ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. కేబినేట్ సబ్ కమిటీ ఇచ్చిన నివేదికపై కేబినేట్ సుదీర్ఘంగా చర్చించింది. అవసరమైతే రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ అంశంపై చర్చించాలని నిర్ణయం తీసుకుంది. మెట్రో ఫేజ్ 2 విస్తరణ పనులను వేగంగా ప్రారంభించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఫేజ్II ఎలో భాగంగా 5 కొత్త కారిడార్లలో 76.4 కిలోమీటర్లు, ఫేజ్II బిలో 3 కారిడార్లలో 86.1 కి.మీ.ల మెట్రో విస్తరణ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి పంపించింది. ఈ నిర్ణయంతో మెట్రో విస్తరణ వేగవంతమవనుంది.

**కోహెడలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్**

రంగారెడ్డి జిల్లా కోహెడలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్, ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అందుకు అవసరమైన 223.09 ఎకరాల భూమిని టిజిఐఐసి బదలాయించాలని నిర్ణయం తీసుకుంది. టిజి హౌసింగ్ బోర్డు ఆధీనంలో ఉన్న 239 ఎకరాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన పండ్ల మార్కెట్ ఏర్పాటుకు వ్యవసాయ మార్కెటింగ్ విభాగానికి రాష్ట్ర క్యాబినెట్ కేటాయించింది.

**జెఎన్‌టియుకు 70 ఎకరాలు**

మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం గుమ్మడూరులో జెఎన్‌టియుకు అధ్వర్యంలోని ఇంజనీరింగ్ కాలేజీకి 70 ఎకరాలు, శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణానికి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్లో 36 ఎకరాలను కేటాయించింది. నల్గొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, మెదక్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ జిల్లాల్లో 21 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్ల నిర్మాణానికి భూములు కేటాయించింది. హైదరాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలకు అవసరమైన 42 ఎకరాలను రక్షణ శాఖ (ఢిఫెన్స్ ల్యాండ్) నుంచి తీసుకున్నందున సమాన విలువైన భూములు కింద రక్షణ శాఖకు కాప్రా మండలంలో 153 ఎకరాలు కేటాయించేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
భద్రాచలంలో గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియం నిర్మాణానికి 5 ఎకరాల భూమిని రాష్ట్ర క్యాబినెట్ కేటాయించింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రం నిర్మాణానికి ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురం గ్రామంలో 20 ఎకరాలు కేటాయించింది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణానికి 3 ఎకరాల 12 గుంటలను దేవాదాయ శాఖకు కేటాయించింది.
హెచ్ఎండిఏ పరిధిలోని నియోపోలీస్ పరిసర ప్రాంతాల్లో నీటి సరఫరాకు సంబంధించి మౌలిక వసతుల కల్పనకు గండిపేట మండలం కోకాపేటలో శారద పీఠానికి చెందిన స్థలాన్ని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ అండ్ సీవరేజీ బోర్డుకు కేటాయించడంతో పాటు శారద పీఠానికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
క్యూర్ ఏరియాలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల దగ్గర నిర్మించిన షాప్స్ వేలం వేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులను రాబట్టుకోవడానికి ప్రయత్నించాలని చర్చించింది.
క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా 300 మెగావాట్ల విద్యుత్తు వినియోగించే డేటా సెంటర్లకు రెన్యువబుల్ ఎనర్జీ డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ ఇచ్చేందుకు కేబినేట్ ఆమోదించింది.

# రూ.1.76 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

సమకూరినట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతం వెల్లడించారు.

**ప్రాంతాల వారీగా పలికిన ధరలు..**

* **గచ్చిబౌలి :** ఇక్కడ 263 చదరపు గజాల ప్లాట్‌కు ప్రభుత్వం రూ.50 వేల కనీస ధర నిర్ణయించగా, వేలంలో అది ఏకంగా రూ.1.76 లక్షలు పలికింది. మరో ప్లాట్ గజానికి లక్ష రూపాయల ధర పలికింది.
* **కూకట్‌పల్లి (బాలాజీ నగర్) :** 266 చదరపు గజాల ప్లాట్ గజానికి రూ.1.64 లక్షల చొప్పున విక్రయమైంది.
* **చింతల్ :** ఇక్కడి ఓపెన్ ప్లాట్లు గజానికి రూ.84 వేలు, రూ.74 వేల ధరలు పలికాయి.
* **బౌరంపేట్ :** ఇక్కడి 2600 చదరపు గజాల భూమి గజానికి రూ.61 వేల చొప్పున అమ్ముడుపోయింది.
* **ఫ్లాట్లు :** నిజాంపేటలోని సిద్ధి ఫ్లాట్‌కు రూ.15 లక్షల కనీస ధర నిర్ణయించగా, వేలంలో అది రూ.17.70 లక్షలకు విక్రయమైంది.

విక్రయించిన వాటిలో మెజారిటీ ప్లాట్లు అధిక ఆదాయ గ్రూప్, మధ్య ఆదాయ గ్రూప్‌లకు కేటగిరీకి చెందినవి కావడంతో కొనుగోలుదారులు వీటిపై ఎక్కువ ఆసక్తి చూపారు. ఈ వేలం ప్రక్రియ ద్వారా హౌసింగ్ బోర్డుకు మొత్తం రూ.34.27 కోట్ల ఆదాయం సమకూరిందని బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతమ్ తెలిపారు. హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాల్లో సొంత ఇంటి స్థలం కోసం ఉన్న విపరీతమైన పోటీకి ఈ వేలం నిదర్శనంగా నిలిచింది. రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో భూములపై ఆసక్తి ఇంకా కొనసాగుతుందనడానికి ఈ వేలం ఫలితాలు నిదర్శనంగా నిలిచాయి.

# ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

9,97,075మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. ఇందులో మొదటి సంవత్సరం నుంచి 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,949మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. ఈ పరీక్షలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 404 ప్రభుత్వ కళాశాలలు, 221 ఎయిడెడ్ కాలేజీలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటు 7 ఇతర విద్యా సంస్థలు ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్ కాలేజీల్లో అధికంగా సెంటర్లు ఉండగా, మిగిలిన జిల్లాల్లో ఎక్కువగా ప్రభుత్వకళాశాలలనే ప్రాధాన్యతలోకి తీసుకున్నారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు ఏమాత్రం అవకాశం లేకుండా పరీక్షా కేంద్రాల్లో దాదాపు 30వేల సిసికెమెరాల ఏర్పాటు చేశారు. ప్రతి సెంటర్‌పై ప్రత్యేక పర్యవేక్షణ ఉండనుంది.

**అర గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి : ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణాదిత్య**

విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణాదిత్య సూచించారు. 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తారని అయితే ఆందోళన వల్ల విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని, అందుకే నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు. పరీక్ష సమయం మధ్యాహ్నం 12 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను బయటకు పంపరని వెల్లడించారు. ఏదైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా మాల్ ప్రాక్టీస్ జరిగితే నిర్ణయం తీసుకోవడానికి ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా, అందరికీ హాల్ టికెట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోర్టుకు వెళ్లిన విద్యార్థులకు కూడా ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య వెల్లడించారు.

# సాగు లెక్క

(మొదటి పేజీ తరువాయి)

పారదర్శకంగా జరిగేఅవకాశం ఉందని అటు ప్రభుత్వంతో పాటు ఇటు అధికారులు కూడా ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.
**ప్రత్యేక యాప్ :** పంటల సాగు విస్తీర్ణాన్ని డిజిటల్ పద్ధతిలో కచ్చితంగా లెక్కలు కట్టి నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఆయా గ్రామాల వారీగా ఏర్పాటు చేసు కున్న వలంటీర్లు 45 రోజుల పాటు సర్వే చేసి ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క సర్వే నెంబర్ భౌగోళిక స్థితి, అక్షాంశ, రేఖాంశ వివరాలతో పాటు ఏఏ పంటలు వేశారు అనే వివరాలను ఫొటోతో సహా యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ పద్ధతిలో జిల్లా వ్యాప్తంగా క్రడిస్టల్ మ్యాప్‌ల ఆధారంగా సుమారు 2లక్షల ఎకరాల వ్యవసాయ భూముల ను సర్వేనెంబర్ల ప్రకారం డిజిటల్ విధానంలో నమోదు చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఈ యాప్‌లో నమోదు చేసే ప్రతీ దానిని ఎఒలు, ఎడిఎలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. డేటా నమోదు కచ్చితంగా సాగేలా నియమించుకున్న డిజిటల్ వలంటీర్లకు జిల్లా వ్యాప్తంగా ఒక్క రోజు శిక్షణను అందిస్తారు.
**స్థానిక అర్హులకే అవకాశం :** ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉండే అర్హులైన యువతకే డిజిటల్ సర్వే చేసే అవకాశాన్ని కల్పించారు. డిజిటల్ సర్వే చేసే ప్రైవేటు వాలంటీర్లకు ఒక్కొక్క సర్వే నెంబర్‌కు రూ.7 లను చెల్లించనున్నారు. కాగా ఈ సర్వే చేసేందుకు యువత పెద్ద ఆసక్తి చూపడం లేదు. దీంతో పాటు అర్హులనే నియమించాల్సి ఉండటంతో గ్రామాల వారీగా బిఎస్‌సి అగ్రికల్చర్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ చేసిన వారు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు అందుబాటులో లేరు. ఇది ఎఇఒలకు తొలనొప్పిగా మారింది. ఇదిలా ఉండగా ఎదో ఒకరకంగా జిల్లా వ్యాప్తంగా 255 మంది వలంటీర్లను ఏఇఓలు నియామకం చేశారు.
**45 రోజుల్లో పూర్తి :** కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సంచాలకులు, జిల్లా అగ్రికల్చర్ ఏడి ఆదేశాలతో ఈ డిజిటల్ సర్వే మొత్తాన్ని 45 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంది. డిజిటల్ సర్వే ద్వారా మండలంలో ఏ రకమైన పంటలు సాగు చేస్తున్నారనే విషయం స్పష్టంగా తేలనుంది. పంటల అంచనాల్లో ఖచ్చిత్తవం పెరగనుంది. భవిష్యత్ ప్రణాళికలకు ఇది ఎంతో దోహద పడనుంది.

**నిర్ణీత గడువులో పూర్తి : బాబూరావు ఏడి అగ్రికల్చర్**

రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా గడువులోగా డిజిటల్ సర్వే పూర్తి చేస్తాం. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతోపాటు వాలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కూడా ఇచ్చాం. ఈ సర్వే ద్వారా వ్యవసాయ డేటా సమగ్రంగా అందుబాటులోనికి రానుంది.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

# దేశ ప్రయోజనాలకు విరుద్ధం

- ప్రధాని వైఖరిపై సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి తీవ్ర విమర్శలు
- స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధం కావాలి
- యూరియా యాప్‌ను తొలగించి పాత విధానంలోనే సరఫరా చేయాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ:** భారత్–అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న వైఖరి దేశ ప్రయోజనాలకు విరుద్ధమని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. అమెరికా విధించిన సుంకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం గట్టి వైఖరి అవలంబించలేదని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపిందన్నారు. సోమవారం నల్లగొండలోని పార్టీ జిల్లా కార్యాలయం మాఖ్దూం భవన్‌లో జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని ధోరణి, లొంగుబాటు రాజకీయాల వల్ల వాణిజ్య ఒప్పందం దేశానికి అగ్నిపరీక్షగా మారిందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కారణంగా దేశీయ పరిశ్రమలు దెబ్బతినే ప్రమాదం ఉందని, ముఖ్యంగా రైతులు, చిన్న వ్యాపారులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దిగుమతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీ చేసి విజయాలు సాధించే దిశగా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ మంచి విజయాలు సాధించిందని,అదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో కూడా అధిక స్థానాలు కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో వ్యవసాయ సాగు కోసం రైతులకు సబ్సిడీపై అందించే యూరియా యాప్ విధానం అమలు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. యూరియా యాప్‌పై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో ఎరువు పొందడంలో రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులు ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని పాత విధానంలోనే పారదర్శకంగా, అక్రమాలకు తావు లేకుండా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశానికి పబ్బు వీరాస్వామి అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి,రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రావణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు ఉజ్జిని యాదగిరిరావు, బొల్లురి నర్సింహా, బంటు వెంకటేశ్వర్లు, తీర్పారి వెంకటేశ్వర్లు, నల్పరాజు రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను కనుమరుగు చేయాలని

# బిజెపి కుట్రలు

- అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం
- తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశానికి స్వాతంత్రం సాధించడంతో పాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బిజెపి కుట్రలు చేస్తుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బిజెపి కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుందన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. 'కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్‌వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలి' అనే అంశంపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు, బి.మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి నాయకులు డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవమని, తాను కూడా కుల వివక్షణ ఎదుర్కొన్నానన్నారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుందనే వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమంలో వివక్ష ఎదురైనా అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. కాంగ్రెస్ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాకుండా దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందన్నారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని టి.కె. మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని డిప్యూటీ సిఎం గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ చేపట్టిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ (నిరోధక) చట్టాన్ని తీసుకురావడం, ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైందన్నారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకుని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదన్నారు. అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదనేది రాహుల్‌గాంధీ ఆలోచన అని వివరించారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని, తద్వారా రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపి స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సిఎం పిలుపునిచ్చారు.



## రేడియో గ్రాఫర్స్, టెక్నీషియన్‌ల

# సమస్యలు పరిష్కరిస్తాం

### మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**రేడియో గ్రాఫర్స్, టెక్నీషియన్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియోగ్రాఫర్స్ అండ్ టెక్నాలజిస్ట్ తెలంగాణ స్టేట్ చాప్టర్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్, నేషనల్ కాన్ఫరెన్స్ వాల్ పోస్టర్‌లను సోమవారం మంత్రి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ రోగ నిర్ధారణలో రేడియోగ్రాఫర్స్ పాత్ర ఎంతో కీలకమన్నారు. వైద్య రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రేడియోగ్రాఫర్స్‌కు మంత్రి సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ చాప్టర్ అధ్యక్షులు ఎం.ఎ.హన్నారీ, ప్రధాన కార్యదర్శి జి.గంగాధర్, ఫైనాన్స్ సెక్రటరీ బండి లింగరాజు, సొసైటీ కార్యవర్గ సభ్యులు టోనీ అంటోనీ, రహిమా, మానస, మోత్కూరు శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్ బి.సురేష్, విద్యాసాగర్, గణేష్, ప్రకాష్ సాయి చందు, నాగరాజు, అర్జున్, భావన, నాగార్జున ,శ్రీనివాస్ నాయక్ ఎం. రాజేష్, కిరణ్ నాయక్, ప్రభాకర్ గౌడ్ తరితరులు పాల్గొన్నారు.

## జీవ వైవిధ్య పరిరక్షణ-యువత సాధికారతే లక్ష్యం

- అంతర్జాతీయ యువ జీవ వైవిధ్య సదస్సు ముగింపు వేడుకల్లో మంత్రి కొండా సురేఖ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో జీవ వైవిధ్య పరిరక్షణతో పాటు యువత సాధికారతను లక్ష్యంగా పెట్టుకుని నిర్వహించిన అంతర్జాతీయ యువ జీవ వైవిధ్య సదస్సు2026 ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి యువత, పర్యావరణ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విధాన రూపకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.సదస్సులో జీవ వైవిధ్య సంరక్షణ, పర్యావరణ అనుకూల జీవనశైలి (పర్యావరణం కోసం జీవనశైలి (లైఫ్), యువత నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై సాంకేతిక సదస్సులు, చర్చలు నిర్వహించారని, యువతలో పర్యావరణ అవగాహన పెంపొందించడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన ఆవిష్కరణలు, పరిశోధనలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు.జీవ వైవిధ్య సంరక్షణ రంగంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అంతర్జాతీయ వేదికపై ప్రతిష్ఠాత్మకంగా నిలుస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.
భవిష్యత్ తరాల కోసం ప్రకృతి సంపదను కాపాడే దిశగా యువత ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత, డా.ఎపిజె. అబ్దుల్ కలాం కేంద్రం సహస్థాపకులు, సిఇఒ సృజన్ పాల్ సింగ్, అలాగే తెలంగాణ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సభ్య కార్యదర్శి కాళీచరణ్ పాల్గొన్నారు.

## రెండు నెలల చిన్నారి మృతిపై

# బిసి కమిషన్ ఆగ్రహం

### మూడు రోజుల్లో నివేదిక అందించాలని కలెక్టర్‌కు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ నెల 19న జరిగిన కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి అనుమానస్పద మృతిపై రాష్ట్ర బిసి కమిషన్ అగ్రహం వ్యక్తపరిచింది. ఈ ఘటనపై వివిధ దినపత్రికలలో ప్రచురితమైన కథనాల ఆధారంగా బిసిలకు ఆలయ సం దర్శన నిరాకరణ సంఘటనకు సంబంధించి స్పందిస్తూ, సంబంధిత నా గర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌తో పాటు ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి నివేదికను మూ డు రోజులలో ఇవ్వవలసిందిగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఓ ప్రకటనలో తెలిపారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు.

## కుమ్మెర ఘటన నిందితులపై

# తక్షణం చర్యలు చేపట్టాలి

### బిసి కమిషన్ చైర్మన్‌ను కలిసిన విక్రమ్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర ఘటన నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలని బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్, జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు కనకాల శ్యామ్ కుర్మా సోమవారం రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌తో పాటు సభ్యులకు వినతి పత్రం అందించారు. కుమ్మెర గ్రామంలో జరిగిన మల్లన్న జాతరలో రజక సామాజిక వర్గానికి చెందిన గణేష్, దళిత సామాజిక వర్గానికి చెందిన చంద్రకళ, మౌనికలపై కుల అహంకారంతో సర్పంచ్ తుకామ్ తుకారాం రెడ్డి, సతీష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఇతర సభ్యులతో కలిసి ఇష్టానుసారంగా మహిళలను కొట్టడంతో పాటు తాకరాని చోట తాకి, రెండు నెలల పసికందు అని కూడా చూడకుండా అమానుషంగా చంపేసిన ఇలాంటి నరరూప రాక్షసులను ఉరి తీయాలని, కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కుల దురంకార హత్యలు జరగకుండా బిసి, ఎస్‌సి, ఎస్‌టిలపై భౌతిక దాడులు భవిష్యత్తులో జరగకుండా నివారించాలంటే, ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు తలగకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి, కుమ్మెర ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబమైన గణేష్, చంద్రకళలకు ప్రభుత్వపరంగా రూ. పది లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలన్నారు. బాధితుల కుటుంబానికి న్యాయం చేస్తామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని బిసి కమిషన్ హామీ ఇచ్చారు. వీరి వెంట బిసి జెఎసి కన్వీనర్ జాజుల లింగం, బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.



## శాఖల మధ్య సమన్వయంతోనే

# మహిళల సమగ్ర సంక్షేమం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళల అభివృద్ధి, సాధికారత, సమాన అవకాశాలు, భద్రత అంశాలపై పలు కీలక శాఖలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, పోలీస్, అటవీ, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు తమ సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిజి చారు సిన్హా, పిసిసిఎఫ్ డా. సి. సువర్ణ, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, పంచాయతీరాజ్ గ్రామీణా భివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టరేట్‌కు చెందిన సంగీతా సత్యనారాయణ, విద్యాశాఖ స్పెషల్ సెక్రటరీ వెంకటేశ్ దోత్రే, మున్సిపల్ శాఖ కమిషనర్లు పాల్గొన్నారు.ఈ సమావేశంలో మహిళా భద్రత అంశంపై విస్తృత చర్చ జరిగింది. మహిళా శిశు సంక్షేమ, పోలీస్ శాఖల సమన్వయంతో మహిళా భద్రత విషయంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, డేటింగ్ యాప్స్, మ్యాట్రి మోనియల్ సైట్ల ద్వారా జరుగుతున్న మోసాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. పొక్సో కేసులు, మానవ అక్రమ రవాణా బాధితుల కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమావేశంలో వచ్చిన ప్రతి సూచనను కార్యాచరణ ప్రణాళికగా మార్చి వేగవంతంగా అమలు చేస్తామన్నారు. మహిళల సమగ్ర సంక్షేమం కోసం శాఖ ల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అభివృద్ధి, సమాన అవకాశాలు, రక్షణ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల అభిప్రాయాలు తెలుసుకుని, అంశాల వారీగా సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

#### అనాథ పిల్లలకు మంచి భవిష్యతు లక్ష్యం

అనాథ పిల్లల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత అని, వారికి కేవలం ఆశ్రయం కల్పించడమే కాదని, మంచి భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి, వారిని స్వతహాగా ఎదిగేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ కర్తవ్యం పెట్టుకున్నామన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో తెలంగాణ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అనాథ పిల్లల నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనతో పాటు అంగన్‌వాడీ టీచర్ల వృత్తి నైపుణ్యాభివృద్ధి దిశగా పలు కీలక అవగాహన ఒప్పందాలను (ఎంఒయు) కుదుర్చుకుందని, అనాథ పిల్లలకు భరోసా కల్పిస్తూ వారికి ఆశ్రయాన్ని కల్పించడంతో పాటు వారి మంచి భవిష్యత్తు అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీతక్కత తెలిపారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందన్నారు. మూడేళ్ల లోపు చిన్నారుల కోసం క్రష్ సెంటర్లు ఏర్పాటు చేసి, అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ అందించేందుకు జిఎంఆర్ ఏరో అకాడమితో ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమం మార్చి నెల నుంచి శంషాబాద్‌లో ప్రారంభం కానుందని, మొదటి విడతలో 20 మంది అనాథ యువతకు శిక్షణ అందించనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ బాలికలకు ఇండస్ట్రీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్, డిజిటల్ లిటరసీ శిక్షణ అందించేందుకు ఎఫ్ఐసిసిఐ లేడీస్ అర్గనైజేషన్‌తో మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు చేసుకుంది.

## నేడు ఆర్‌టిసి కార్మికుల 'చలో సెక్రటేరియట్'

- ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్
- ఇందిరాపార్కు నుంచి సెక్రటేరియట్ వరకు నిరసన ర్యాలీ
- భారీగా పాల్గొననున్న కార్మికులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిఎస్‌ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, సంస్థలో కార్మిక సంఘాలను పునరుద్ధరించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి మంగళవారం 'చలో సెక్రటేరియట్' నిర్వహించనుంది. హైదరాబాద్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఇందిరా పార్కు నుంచి ప్రదర్శన, అనంతరం సభ జరుగుతుందని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్‌టిసి సిబ్బంది భారీ స్థాయిలో పాల్గొంటారని జెఎసి నేతలు వెల్లడించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తమ డిమాండ్లను నేరవేర్చాలని, లేకపోతే తమ హక్కులను సాధించే వరకు ఉద్యమిస్తామని జెఎసి నేతలు స్పష్టం చేశారు. టిజిఎస్‌ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందినా అది పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం, దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ఆర్‌టిసి కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా 'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం, దానికి తగిన మౌలిక సదుపాయాలు లేకపోవడం సిబ్బందికి శాపంగా మారిందని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ తెలిపారు. బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ఉన్న సిబ్బంది పైనే అదనపు భారం పడుతోందని, సిబ్బంది రోజుకు 16 నుంచి 18 గంటల పాటు విధులు నిర్వర్తించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా డ్రైవర్లు, కండక్టర్లు గుండెపోటు వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ పేరుతో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తీసుకోవడం, పర్మినెంట్ ఉద్యోగాల నియామకాలు చేపట్టకపోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా రద్దు చేసిన కార్మిక సంఘాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి ఆస్తులను, రూట్లను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్రలు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

#### యథావిధిగా కొనసాగనున్న బస్సులు

చలో సెక్రటేరియట్ నేపథ్యంలో ఆర్‌టిసి బస్సులకు ఏలాంటి బంద్ లేదని, ఆయా రూట్లలో బస్సులు యదావిధిగా కొనసాగుతాయని జెఎసి నేతలు తెలిపారు. ప్రయాణికులను గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చడమే తమ ప్రథమ కర్తవ్యమని, అందుబాటులో ఉన్న కార్మికులు ప్రదర్శనలో పాల్గొంటారని వారు స్పష్టం చేశారు.

# నడిగడ్డను నట్టేట ముంచిన బిఆర్‌ఎస్

### కాంగ్రెస్ గద్వాల గడ్డపై కల్వకుంట్ల కవిత నిప్పులు



**ప్రజాపక్షం/గద్వాల్ :** జోగులాంబ గద్వాల్ తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాసుకుంది. రైతు సంఘర్షణ సభలో నడిగడ్డ (గద్వాల) ప్రాంతాన్ని బిఆర్‌ఎస్ పార్టీ దారుణంగా మోసం చేసిందని, ఇక్కడ గెలిచిన నాయకులకు నైతిక విలువలు లేవని మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గద్వాలలో నిర్వహించిన రైతు దీక్షలో పాల్గొన్న ఆమె, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రభుత్వంపై విమర్శల జడివాన కురిపించారు. రాజీనామా చెయ్ అప్పుడే నీ సత్తా ఏంటో తెలుస్తుంది. గద్వాల ఎమ్మెల్యే లక్ష్యంగా కవిత ఘా టైన వ్యాఖ్యలు చేశారు. బిఆర్‌ఎస్ గుర్తుపై గెలిచి, పార్టీ మారిన ఎమ్మెల్యేకు నైతికత ఉంటే వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఎన్నికలు రాగానే మూటలు ముల్లెలు సర్దుకుని వచ్చే నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, రైతు రుణమాఫీ హామీ అటకెక్కిందని కవిత ఆరోపించారు. రాష్ట్రం టలో దాదాపు 15 లక్షల మంది రైతులకు రుణమాఫీ అందలేదని ఆమె లెక్కలతో సహా వివరించారు. యూరియా కోసం రైతులు యాప్‌లో బుక్ చేసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని, రైతుల దగ్గర ఐఫోన్లు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తుందా అని ప్రశ్నించారు. రైతులకు ఐఫోన్లు ఇవ్వలేని ప్రభుత్వం వారిని డిజిటల్ సాకులు చూపి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చే గిఫ్ట్‌ల మాదిరిగా రైతు భరోసా మారిందని, ఓట్ల కోసమే సిఎంకు రైతులు గుర్తుకోస్తారని ఎద్దేవా చేశారు. నడిగడ్డ గడ్డపై కొత్త రాజకీయ శక్తి ఉద్భవించబోతుంది. ఆ శక్తే జాగృతి ఇక్కడి నుంచి మార్పు మొదలవుతుంది. మన నీళ్లు, మన నిధుల కోసం జాగృతి పోరాటం కొనసాగుతుందన్నారు. నారాయణపేట జిల్లాలో ఇప్పటికే సర్పంచ్ పదవులను, వడ్డేపల్లి మున్సిపాలిటీని జాగృతి కైవసం చేసుకున్న విషయాన్ని ఆమె గుర్తు చేస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహం నింపా రు. కృష్ణ, తుంగభద్ర నీళ్లు మన పొలాలకు చేరాలనే ఏకైక లక్ష్యంతో జాగృతి పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు. రాబోయే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నిక ల్లో జాగృతి అభ్యర్థులు బరిలోకి దిగుతున్నారని కవిత ప్రకటించారు. ఎన్నికలు రాగానే డబ్బు మూటలతో అత్తా అల్లుళ్లు దిగుతారు. మీ రక్తాన్ని పీల్చి సంపాదించిన ఆడబ్బుకు లొంగకండి. నిబద్ధత ఉన్న వ్యక్తులకే ఓటు వేయండని ప్రజలకు పిలుపునిచ్చారు. కృష్ణా, తుంగభద్ర నీళ్లు నడిగడ్డ పొలాలకు చేరే వరకు తమ పోరాటం ఆగదని, ఇప్పటికే సర్పంచు, మున్సిపాలిటీ ఎన్నికల్లో జాగృతి జెండా ఎగురవేసి తమ సత్తా చాటామని ఆమె గుర్తు చేశారు.

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-30, జిహెచ్‌ఎంసి**

**NIT NO. 03 Electrical :** NIT No.03/E.E.(Elec.)30/GHMC/2025-26, తేది: 21.02.2026, **పని పేరు:** ఎలక్ట్రికల్ వర్క్స్, **అంచనా విలువ:** రూ.5.95 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:* 23.02.2026న ఉ.11.00గం.లకు మరియు *బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:* 24.02.2026న ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్‌ఎంసి, 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 15823-PP/CL/ADVT/1/2025-26, Date: 23-02-2026

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**

**Tender Notice No.P-05/2025-26 of DEE/OP/HUZURNAGAR**

హుజూర్‌నగర్ ఆపరేషన్ డివిజన్‌లో వివిధ ఎలక్ట్రికల్ పనుల కొరకు అర్హత కలిగిన విక్రయదారుల నుండి టెండర్లకు ఆహ్వానించడమైనది. వివరాలు www.tgsouthernpower.com వద్ద లభించును.

ఫోన్ నెం. **8712472899**

ఆఖరి తేది: **05.03.2026**

సం/- డివిజనల్ ఇంజనీర్, ఆపరేషన్, హుజూర్‌నగర్.

DIPR R.O. No. : 15871-PP/CL/ADVT/1/2025-26, Date: 23-02-2026

# గురుకుల విద్యాసంస్థల బలోపేతానికి కృషి

● మెరుగైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం ● ప్రతి సంస్థకు రూ.50 కోట్లు కేటాయించే ప్రతిపాదన! ● టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి ఎస్. కృష్ణ ఆదిత్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా గురుకుల విద్యాసంస్థల బలోపేతం కోసం కీలక మౌలిక వసతులు, విద్యా, పరిపాలనా సంస్కరణలను తెలంగాణ సోషల్ వెల్ఫే ర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సొసైటీ( టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్) కార్యదర్శి ఎస్. కృష్ణ ఆదిత్య ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం 268 గురుకులాలు ఉండగా, 150 పాఠశాలలకు స్వంత భవనాలు ఉన్నాయని, 79 పాఠశాలలు అద్దె భవనా ల్లో ఉన్నాయని తెలిపారు. విద్యా సంస్థల అభివృద్ధి, మౌలిక వసతుల బలోపేతం కోసం ప్రతి సంస్థకు రూ.50 కోట్లు కేటాయించే ప్రతిపాదన ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ పాఠశాలలో హాస్టల్ వంటగదుల ఆధునీకరణను జిల్లా కలెక్టర్లతో సంప్రదింపుల ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే షేక్‌పేట్‌లోని పాఠశాలలో ప్రారంభించామని, పరిశుభ్రత, భద్రత ప్రమాణాలు, ఆహార నాణ్యత మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు.

**పాఠశాలలు ప్రారంభానికి ముందే పుస్తకాలు పంపిణీ**

వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాల కొనుగోలు ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని, పాఠశాలలు ప్రారంభానికి ముందే పుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 37 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఓఇ), 28 క్రీడా అకాడమీలతో పాటు 3 ప్రత్యేక పాఠశాలలను మరింత బలోపేతం చేసి విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, ప్రత్యేక శిక్షణ సదుపాయాలను మెరుగు పరచనున్నట్లు తెలిపారు. అలాగే బిఇడి, ఫార్మసీ వంటి కోర్సులతో ఐదు ప్రొఫెషనల్ కళాశాలలను స్థాపించే ప్రతిపాదన ఉందని తెలిపారు. అట్టడుగు వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలను విస్తరించడమే లక్ష్యమని పేర్కొన్నారు. టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ సిబ్బందితో పాటు విద్యార్థుల హాజరు పర్యవేక్షణ, పారదర్శకత, పరిపాలనా సామర్థ్యా న్ని పెంపొందించేందుకు ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేసినట్లు తెలిపారు.

**మార్చి 9 న టిజిసెట్2026 ఫలితాలు..**

టిజిసెట్2026 ఫలితాలను మార్చి 9 న విడుదల చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలోని అన్ని సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కోసం టిజి ఆన్‌లైన్ అనే సమగ్ర డిజిటల్ వేదికను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ పోర్టల్‌లో 24 సమగ్ర మాడ్యూల్స్ ఉంటాయనీ, రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షలకు పైగా విద్యార్థుల విద్యా, అకాడమిక్, ఆరోగ్య సంబంధిత పూర్తి వివరాలు ఇందులో సమగ్రపరచబడతాయని వివరించారు. దీని ద్వారా కేంద్రీకృత పర్యవేక్షణ, డేటా ఆధారిత పాలన, మెరుగైన సేవల అందజేత సాధ్యమవుతుందని తెలిపారు. టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ మౌలిక వసతుల బలోపేతం, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమంతో పాటు సాంకేతికత ఆధారిత పారదర్శక పరిపాలనకు కట్టుబడి ఉందని కార్యదర్శి క్రిష్ణ ఆదిత్య పునరుద్ఘాటించారు.

## ఆర్‌టిసి ఉద్యోగులు నిరసనలు విరమించుకోవాలి

**రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా పాలన ప్రభుత్వంలో ఆర్‌టిసి సంస్థ పరిరక్షణ ,ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, ఉద్యోగుల డిమాండ్స్ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని, కార్మికులు ఎవరు ఎలాంటి నిరసనలు తెలపవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం హాయంలో ఆర్‌టిసిని నిర్వీర్యం చేసిందని, తీవ్ర నష్టాల్లో ఉన్న ఆర్‌టిసిని మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత లాభాల బాటలోకి తెచ్చామన్నారు. ఉద్యోగ నియమాకాలు, పెండింగ్ బకాయిల చెల్లింపులు, బస్సుల కొనుగోలు వంటివి ఒక్కొక్కటిగా చెస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య సోదరుడికి సర్కారీ కొలువు

సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో అమరురాలైన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని, ఆమె సోదరుడు జి. శ్రవణ్‌కు ఎక్సైజ్ శాఖలోనే జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వం నియామక పత్రం అందజేసిందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే సౌమ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా అందజేశారని గుర్తు చేశారు. 'నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల వాహనాన్ని అడ్డుకునే క్రమంలో సౌమ్య చూపిన సాహసం వెలకట్టలేనిది. నిందితులు కారుతో ఢీకొట్టి ఆమె ప్రాణాలను బలిగొన్న తీరు అత్యంత పాశవికం. కర్తవ్య నిర్వహణలో ఆమె చేసిన త్యాగం ఎక్సైజ్ శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులకు పూర్తి భద్రత కల్పిస్తాం' అని మంత్రి స్పష్టం చేశారు.

# టిజిఎస్ ఆర్‌టిసికి 1,085 ఎలక్ట్రిక్ బస్సులు

పిఎం ఈ-డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సరఫరా చేయనున్న ఒలెక్ట్రా

విద్యుత్ రవాణా వ్యవస్థ దిశగా హైదరాబాద్ నగరం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్‌టిసి)కు ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ (ఓజిఎల్ ) 1,085 బస్సులను సరఫరా చేయనుంది. ఈ మేరకు ఒలెక్ట్రా సంస్థకు టిజిఎస్‌ఆర్‌టిసికి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) జారీ చేసింది. పిఎం ఈడ్రైవ్ పథకంలో భాగంగా పర్యావరణ అనుకూల ఇంధన, విద్యుత్ వాహనాలను ప్రోత్సహించే కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్ (సిఇఎస్ఎల్) ఆధ్వర్యంలో ఈ లేఖను జారీ చేసింది. ఎంఇఐఎల్ అనుబంధ సంస్థ ఓజిఎల్ దేశంలోనే అతిపెద్ద విద్యుత్ వాణిజ్య వాహన తయారీ సంస్థగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఈ సంస్థ తయారు చేసే బస్సులను ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తుంది. ఓజిఎల్ సరఫరా చేసే బస్సుల ద్వారా హైదరాబాద్ నగర ప్రజలకు సుస్థిర, పర్యావరణ హితమైన, సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థను టిజిఎస్‌ఆర్‌టిసి అందించనుంది. పట్టణాలలో ఎలక్ట్రిక్ ప్రజా రవాణాను వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న పిఎం ఈడ్రైవ్ పథకం హైదరాబాద్ నగరాన్ని విద్యుత్ రవాణా వ్యవస్థ దిశగా మరింత ముందుకు తీసుకెళ్ళనుంది. టిజిఎస్‌ఆర్‌టిసికి ఓలెక్ట్రా 12 మీటర్ల పొడవు ఉన్న లో ఫ్లోర్ బస్సులను సరఫరా చేస్తుంది. ఇందులో ఎసి, నాన్‌ఎసి బస్సులున్నాయి. స్థానిక రోడ్ల పరిస్థితులకు అనుగుణంగా వీటిని రూపొందించారు. బస్సు ముందు, వెనుక భాగంలో ఆధునిక ఎయిర్ సస్పెన్షన్ వ్యవస్థతో ఒక్కసారి ఛార్జ్ చేస్తే 250 కిలోమీటర్లకు పైగా ప్రయాణ చేస్తాయి. సుమారు 45 నిమిషాల్లో ఆపర్చునిటీ ఛార్జింగ్ సౌకర్యం ఈ బస్సుల్లో ఉంది. బస్సులో వీల్‌చైర్ వినియోగదారులకు ప్రత్యేక స్థలం కేటాయించారు. ఈ సందర్భంగా ఒలెక్ట్రా ఎండి మహేష్ బాబు మాట్లాడుతూ 'ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. దేశ విద్యుత్ వాహన రంగంలో మా ప్రయాణానికి ఇది ఒక కీలక మైలురాయి. 'మేక్ ఇన్ ఇండియా' దృష్టితో ప్రపంచ స్థాయి ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేయాలనే మా కట్టుబాటుకు పిఎం ఈడ్రైవ్ కార్యక్రమం కింద వచ్చిన ఈ ప్రతిష్టాత్మక ఆర్డర్ మరింత బలం చేకూర్చింది. హైదరాబాద్ మా సంస్థ స్వస్థలం మాత్రమే కాదు, ఆవిష్కరణలకు ప్రతీక. టిజిఎస్ ఆర్‌టిసితో కలిసి సమర్థవంతమైన, సౌకర్యవంతమైన సుస్థిర ప్రజా రవాణా సేవలను అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాము. ఇది దేశం పర్యావరణ హితంగా ఉండేందుకుఉపయోగపడుతుంది' అని అన్నారు.

## 'కెటిఆర్ సేవా సమితి, సేన' కార్యక్రమాలు ఆపండి

**ఆ సంస్థలకు అనుమతి లేదు : కెటిఆర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తన పేరుతో ఎటువంటి సంస్థను కూడా ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వలేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు స్పష్టం చేశారు. కొంత మంది 'కెటిఆర్ సేవా సమితి', 'కెటిఆర్ సేన' పేరుతో కొన్ని కార్యకలాపాలు చేపడుతున్నట్టు కొందరు కెటిఆర్ దృష్టికి తీసుకురాగా, ఆయన పైవిధంగా స్పందిస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన పేరుతో ఎలాంటి సంస్థలకూ అనుమతి లేదని, అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని కెటిఆర్ అన్నారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను ఆపేయాలని, తనపై అభిమానం ఉన్నవాళ్లు బిఆర్ఎస్‌తో కలిసి పనిచేయవచ్చని విజ్ఞప్తి చేశారు.

## లక్షమందికి అన్నదానం చేసే వంటశాలకు మార్చి 8న శంకుస్థాపన

మంత్రి కొండసురేఖను ఆహ్వానించిన ఇస్కాన్ ప్రతినిధులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబరాబాద్‌లోని నలగండ్లలో ఇస్కాన్ దేవాలయంలో లక్షమందికి అన్నదానం చేసే మహా వంటశాల నిర్మాణం కోసం మార్చి 8న శకుస్థాపన నిర్వహించనున్నారు. ఈ కార్యాక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండ ఆసురేఖను సోమవారం ఇస్కాన్ ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆహ్వానించారు. శ్రీకృష్ణుడికి అంకితమై నిర్మించనున్న ఈ దేవాలయానికి సంబంధించిన స్థల కేటాయింపులో మంత్రి కీలక పాత్ర పోషించారని నిర్వాహకులు తెలిపారు. ఆమె సహకారంతోనే భూమిపూజ కార్యక్రమం త్వరితగతిన నిర్వహించే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక వికాసంతో పాటు సమాజ సేవలో ఇస్కాన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా పేదలకు అన్నదానం అందించడం గొప్ప కార్యక్రమమని కొనియాడారు. రాష్ట్రంలో నిర్మించనున్న ఈ విస్తృత దేవాలయ శంకుస్థాపనకు ఆహ్వానించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి సహా ఇతర మంత్రులను కూడా ఆహ్వానించాలని సూచించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య సంప్రదాయబద్ధంగా జరగనున్న ఈ కార్యక్రమంలో భక్తులు, ఆధ్యాత్మిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువల పరిరక్షణకు ఈ ఆలయం కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎఐ బయోమెట్రిక్ మోసాల పట్ల జాగ్రత్త

హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ డిసిపి వి.అరవింద్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు కేవలం మీ డబ్బు నే కాకుండా, మీ వ్యక్తిత్వాన్ని కూడా దొంగిలిస్తున్నారని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత బయోమెట్రిక్ మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తం గా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ డిసిపి వి.అరవింద్ బాబు హెచ్చరించారు.

**మోసం చేస్తారు ఇలా..**

మాల్స్, మెట్రో స్టేషన్లు, మార్కెట్లు వంటి రద్దీ ప్రాంతాల్లో నేరగాళ్లు వృద్ధులుగా లేదా ఏమీ తెలియని మధ్యతరగతి వ్యక్తులుగా నటిస్తూ బాధితులను సమీపిస్తారు. తమకు సాంకేతికత తెలియదని, పెన్షన్ స్టేటస్ చూడమని లేదా ఫోన్‌లోని ఏదైనా యాప్‌ను సరిచేయమని 'చిన్న సహాయం' కోరుతారు. వారు ఇచ్చే ఫోన్‌లో అప్పటికే వీడియో కాల్ లేదా స్క్రీన్ రికార్డింగ్ ఆన్ చేసి ఉంటుంది. మీరు ఆ ఫోన్ వైపు చూడగానే మీ ముఖం, గొంతు (వాయిస్) రికార్డ్ అవుతాయి. కేవలం కొద్ది సెకన్లలోనే మీ బయోమెట్రిక్ డేటాను సేకరించి, ఎఐ సాయంతో మీలాగే నటించే డీప్ ఫేక్ వీడియోలను లేదా ఆడియోలను సృష్టిస్తారు.

**అప్రమత్తంగా ఉండండి..**

అపరిచితుల మొబైల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకండి. తెలియని వీడియో కాల్స్ వైపు చూడటం లేదా గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే సూచనలు పాటించడం మానుకోండి. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఎవరైనా 'త్వరిత సహాయం' అని అడిగితే జాగ్రత్తగా ఉండండి.

**ఫిర్యాదు చేయండి:** ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైనట్లు భావిస్తే, వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయండి, లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని అరవింద్ బాబు సూచించారు.



## బిఐఎసిహెచ్‌ఆర్ఐలో నవీకరించిన సౌకర్యాలు ప్రారంభించిన బాలకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (బిఐఎసిహెచ్‌ఆర్ఐ)లోని ఆరోగ్యశ్రీ వార్డులో నవీకరించిన పేషెంట్ రూములు, అధునాతన గ్యాస్ట్రో, కోలోనో వీడియోస్కోప్ సౌకర్యాలను బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ సోమవారం ప్రారంభించారు. నవీకరణ పునరుద్ధరణకు కెఐఎ ఇండియా, అధునాతన గ్యాస్ట్రో,కొలొనో వీడియోస్కోప్ సౌకర్యాలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ఆర్థిక సహాయం చేసింది. కాగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్ ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (వాణిజ్య) పియూష్ మిట్టల్, డిజిఎం కైలాష్ కాంత్‌లు ఆసుపత్రి సీనియర్ వైద్యుల సమక్షంలో ఎండోస్కోపీ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కెఐఎ ఇండియా సిఇఒ డాక్టర్ కె కృష్ణయ్య, బిఐఎసిహెచ్‌ఆర్ఐ వైద్యులు డాక్టర్ ఫణి కోటేశ్వరరావు,డాక్టర్ కల్పన రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## 'హైదరాబాద్ యూత్ డిక్లరేషన్'పై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన 'హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ హామీల' ను అమలు చేయలేదని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త బక్క జడ్సన్ తెలిపారు. ఒక సంవత్సరంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతి నెలా రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని, పారదర్శక జాబ్ క్యాలండర్‌ను ప్రకటిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీనిచ్చారని, ఇప్పటి వరకు సుమారు 13,943 ఉద్యోగాలను మాత్రమే ప్రకటించారని, మిగిలిన 1.86 లక్షల పోస్టులు ఖాళీగానే ఉన్నాయని బక్క జడ్సన్‌ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 'ఎంప్లాయిూ ఆఫ్ ది మంత్' సేఫ్టీ అవార్డుల ప్రదానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వేలో రైలు కార్యకలాపాల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ 'ఎంప్లాయిూ ఆఫ్ ది మంత్' సేఫ్టీ అవార్డులను ప్రదానం చేశారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధ్యక్షతన సికింద్రాబాద్ రైల్ నిలయంలో సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో అసురక్షిత పరిస్థితులను నివారించడంలో అంకితభావం, అప్రమత్తత కనబర్చిన 15 మంది ఉద్యోగులను సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు అన్ని విభాగాధిపతులు హాజరయ్యారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్ల డిఆర్ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.అగ్నిమాపక ఏర్పాట్ల బలోపేతం, పాయింట్లుక్రాసింగ్ల తనిఖీ, పనులు పూర్తయ్యాక ట్రాక్ల వద్ద సామగ్రి తొలగింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిఎం సూచించారు.



# ఘనంగా ముగిసిన 2వ విడత సిఎం కప్ పోటీలు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ గ్రామీణ క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలైన ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయిలకు తీసుకెళ్లడం లక్ష్యంగా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ విడత పిఎం కప్2025 పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఘనంగా ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా ఉత్సాహాన్ని రెట్టింపు చేసిన ఈ పోటీలు యువతలో స్ఫూర్తిని నింపాయి. గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు గత నెల 17 నుండి ప్రారంభమైన గ్రామీణ స్థాయి పోటీలు అనంతరం మండల, అసెంబ్లీ, జిల్లా స్థాయిల్లో విజయవంతంగా కొనసాగి, ఈ నెల 19 నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీకారం చుట్టారు. మొత్తం 44 క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో భాగంగా గచ్చిబౌలి స్టేడియంలో 17 క్రీడాంశాలు, ఎల్‌బి స్టేడియంలో 6 క్రీడాంశాలు, సరూర్‌నగర్ స్టేడియంలో 3 క్రీడాంశాలు, మిగిలిన పోటీలు రాష్ట్రంలోని 11 జిల్లాల్లో విస్తరించాయి. యువ క్రీడాకారుల కేరింతలు, ప్రేక్షకుల ఉత్సాహం మధ్య పోటీలు అత్యంత ఉత్సాహభరితంగా సాగాయి. ఈ సంవత్సరం సిఎం కప్ పోటీలకు అపూర్వ స్పందన లభించింది. దాదాపు 5,40,000 మంది క్రీడాకారులు ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోగా, రాష్ట్ర స్థాయి పోటీలకు 22,000 మంది అర్హత సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. గ్రామీణ యువతలో క్రీడల పట్ల పెరుగుతున్న ఆసక్తికి ఇది నిదర్శనంగా నిలిచింది. పోటీలలో విజేతలైన క్రీడాకారులకు ఆయా ప్రాంగణాల్లోనే మెడల్స్, బహుమతులు అందజేశారు. మక్తల్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీల ముగింపు వేడుకలకు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచి క్రీడామైదానాల వైపు మళ్లించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దృఢ త్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు. సిఎం కప్ పోటీలు ప్రతి సంవత్సరం నిరంతరంగా నిర్వహించబడతాయని వెల్లడించారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ముగింపు వేడుకలకు ప్రముఖ సినీ నటుడు రాహుల్ బోస్ హాజరై క్రీడాకారులకు ప్రోత్సాహం అందించారు. గచ్చిబౌలిలో స్టేడియం అడ్మినిస్టేటర్ కన్నం మధు, ఎల్‌బి స్టేడియంలో డిప్యూటీ డైరెక్టర్ రవీందర్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ రవికుమార్ పిఆర్ఓ కాలేరు సురేష్, నందకిషోర్ గోకుల్, సరూర్‌నగర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనిత, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ వెంకటేశ్వరరావు తదితరులు విజేతలను సన్మానించారు. వివిధ జిల్లాల్లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ముందున్న కార్యక్రమాలు**

మార్చి 4 నుండి 6 వరకు పారా క్రీడాంశాల్లో సిఎం కప్ పోటీలు నిర్వహించబడనున్నాయి. మార్చి 7న సిఎం కప్ లో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన జట్లతో పాటు వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఘన స న్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. సిఎం కప్2025 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా క్రీడా వాతావరణం మరింత బలపడిందని, గ్రామీణ యువతలో అపార ప్రతిభ దాగి ఉందని ఈ పోటీలు స్పష్టంచేశాయి. క్రీడా రంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సిఎం కప్ ఒక ముఖ్య మైలురాయిగా నిలిచింది.

## ఈనెల 25న దేశవ్యాప్తంగా బిఎంఎస్ 'ఆందోళన దినం'

కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిరసనలు

బిఎంఎస్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి తూర్పు రామి రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం బిఎంఎస్ ఈనెల 25ను దేశవ్యాప్తంగా ఆందోళన దినంగా పాటించాలని పిలుపునిచ్చింది. ఒడిశాలోని పూరీలో జరిగిన 21వ అఖిల భారతీయ మహాసభల నిర్ణయం మేరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బిఎంఎస్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి తూర్పు రామి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దేశంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు, గేట్ మీటింగులు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు సమస్యలను తీసుకెళ్లినప్పటికీ, ప్రభుత్వ స్పందన తగిన రీతిలో లేదని బిఎంఎస్ ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం, ఆశా వర్కర్లు అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నారన్నారు. ఐదు దశాబ్దాలుగా సేవలందిస్తున్న అంగన్‌వాడీలను ఇప్పటికీ 'స్కీమ్ కార్మికులు'గానే పరిగణించడం సరైందికాదన్నారు. నేషనల్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ (ఎన్‌టిసి) మిల్లుల కార్మికులకు గత 10 నెలలుగా జీతాలు అందడం లేదన్నారు. రాంచీలోని హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ ఉద్యోగులకు గత 32 నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, ఆక్యుపేషనల్ సేఫ్టీ కోడ్ 2020లలో కార్మికులకు అనుకూలంగా సవరణలు చేయాలన్నారు. ఈపిఎస్ 95 కనీస పెన్షన్‌ను రూ.1,000 నుండి రూ.7,500కు పెంచి, ద్రవ్యోల్బణ భత్యం (డిఏ) కల్పించాలన్నారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను తక్షణమే నిర్వహించి, త్రైపాక్షిక కమిటీలను పునర్వ్యవస్థీకరించాలన్నారు. నియామకాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి, కాంట్రాక్ట్, స్కీమ్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. దేశాభివృద్ధిని, కార్మిక సంక్షేమాన్ని కాంక్షించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ డిమాండ్‌లపై సానుకూలంగా స్పందించాలని బిఎంఎస్ డిమాండ్ చేస్తుందని రామి రెడ్డి అన్నారు.



# ఇరాన్ వీడండి...

## భారత పౌరులకు రాయబార కార్యాలయం సూచన



**న్యూఢిల్లీ :** ఏ క్షణమైనా ఇరాన్‌పై అమెరికా దాడులు చేయవచ్చునన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో ఆ దేశంలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు అక్కడి మన ఎంబసి తాజాగా అడ్వయిజరీ జారీచేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. 'ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దష్ట్యా జనవరి ఐదో తేదీన భారత ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వయిరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. భారత పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించండి. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత ఎంబసితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండండి' అని ఇరాన్‌లోని భారత ఎంబసి తన అడ్వయిజరీలో పేర్కొన్నది. తాజా పరిణామాల సమాచారం కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని సూచించింది. భారతీయులంతా పాస్‌పోర్ట్‌లు, ఐడి కార్డులతో సహా తమ ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను తమవద్ద సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పింది. ఈ విషయంలో ఎలాంటి సాయం కోసమైనా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొంది. 'ఇప్పటివరకు ఎంబసి వద్ద మీ పేర్లు నమోదు చేసుకోకపోతే వెంటనే రిజిస్టర్ చేయించుకోవాలి' అని భారత ఎంబసి తన అడ్వయిజరీలో పేర్కొంది. ఇరాన్‌అమెరికా దేశాల మధ్య అణు చర్చలు ఇప్పటికీ కొలిక్కి రాలేదు. ఈ చర్చలు విఫలమైతే ఇరాన్‌పై దాడికి వెనుకాడబోమని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇప్పటికే అమెరికా వివిధ విమాన వాహక నౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్‌లను పశ్చిమాసియాలో మోహరించింది. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌లో మరోసారి ఆందోళనలు చెలరేగాయి. వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ పరిణామాలతో ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, ఇరాన్‌లో తొలిదశ అల్లర్లలోనే 7,105 మంది ప్రాణాలు కోల్పోయారని అమెరికాకు చెందిన ఒక మానవ హక్కుల సంఘం తెలిపింది.

### ఢిల్లీలో బాంబు బెదిరింపుల కలకలం

# భద్రత కట్టుదిట్టం

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోటతో పాటు ఢిల్లీ శాసనసభ, వివిధ పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఈ సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు, బాంబు స్క్వాడ్, భద్రతా బలగాలు రంగంలోకి దిగి విస్తతంగా తనిఖీలు నిర్వహించాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం కొన్ని అనుమానాస్పద కాల్స్ రావడంతో ఎర్రకోట, అసెంబ్లీ, పాఠశాలల వద్ద అత్యవసర భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సంఘటనతో కొంతసేపు ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. దేశానికి చారిత్రక, సాంస్కతిక ప్రతీకగా నిలిచిన ఎర్రకోటకు బాంబు బెదిరింపు రావడం భద్రతా సంస్థలకు పెద్ద సవాల్‌గా మారింది. వెంటనే ఎర్రకోట పరిసర ప్రాంతాలను పోలీసులు పూర్తిగా కట్టుదిట్టం చేశారు. బాంబు స్క్వాడ్ బందాలు, డాగ్ స్క్వాడ్ సాయంతో తనిఖీలు నిర్వహించారు. ప్రధాన ప్రవేశ ద్వారాలు, సందర్శకుల ప్రాంతాలు, భద్రతా సున్నిత ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎర్రకోటలో పనిచేస్తున్న సిబ్బంది, సందర్శకులను తాత్కాలికంగా బయటకు పంపించి పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు గుర్తించలేదని స్పష్టం చేశారు. దీంతో




ఇది కేవలం ఫేక్ కాల్ అయ్యే అవకాశముందని అధికారులు అనుమానిస్తున్నారు. ఢిల్లీ అసెంబ్లీకి కూడా బాంబు బెదిరింపు కాల్ రావడంతో అక్కడా భద్రతను పెంచారు. పరిసర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, భద్రతా సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణంలోని ప్రతి వాహనం, కార్యాలయ గదులు, పార్కింగ్ ప్రాంతాలను ప్రత్యేక పరికరాలతో తనిఖీ చేసినట్లు సమాచారం. అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేసి, భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేశారు. అయితే ఈ తనిఖీల్లోనూ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేదా పేలుడు పదార్థాలు గుర్తించలేదని పోలీసులు వెల్లడించారు. ఉదయం ఢిల్లీ లోని పలు పాఠశాలలకు కూడా బాంబు బెదిరింపు కాల్స్ రావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. స్కూల్ యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల భద్రత దష్ట్యా కొన్నిచోట్ల తరగతులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. కొన్నిచోట్ల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నప్పటికీ.. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తనిఖీల అనంతరం స్కూల్ ప్రాంగణాల్లోనూ ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని అధికారులు ధ్రువీకరించారు. ఈ బాంబు బెదిరింపు కాల్స్ చేసిన వ్యక్తులను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం రంగంలోకి దిగింది. ఫోన్ నంబర్, లొకేషన్, కాల్స్ రికార్డులను పోలీసులు పరిశీలిస్తున్నారు. సాధారణంగా ఇలాంటి కాల్స్ ద్వారా ప్రజల్లో భయాందోళనలు సష్టించడం, భద్రతా వ్యవస్థను పరీక్షించడం వంటి ఉద్దేశాలు ఉండవచ్చని ఇంటెలిజెన్స్ అధికారులు చెబుతున్నారు. దర్యాప్తు పూర్తయ్యాక అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ సంఘటన నేపథ్యంలో పోలీసులు ప్రజలకు ముఖ్య సూచనలు చేశారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దని, అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని సూచించారు.

# సాయం కోరి మోసం

## రూ.7 కోట్ల సైబర్ నేరంలో ఇరుక్కున్న ఇంజినీరింగ్ విద్యార్థి



**న్యూఢిల్లీ :** ఈజీ మనీకి అలవాటు పడిన ఆశిశ్ అనే ఓ విద్యార్థి తన స్నేహితుడైన ఇంజినీరింగ్ విద్యార్థికి అబద్ధం చెప్పి సాయం కోరాడు. అతడిని నమ్మి సాయం చేసిన ఇంజినీరింగ్ విద్యార్థి రూ.7 కోట్ల సైబర్ నేరంలో ఇరుక్కున్నాడు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ ఘటన తాజాగా చోటుచేసుకుంది. ఈ ఘటనపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఆశిష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఎలా జరిగిందో బయటపడింది. వివరాల్లోకి వెళ్తే.. బెంగళూరులోని ఓ ప్రముఖ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న 19 ఏళ్ల విద్యార్థికి నవంబర్‌లో అతడి స్నేహితుడు ఆశిష్ ఫోన్ చేశాడు. తన బ్యాంకు ఖాతాలో తగినంత బ్యాలెన్స్ మెయింటెయిన్ చేయకపోవడం వల్ల తన ఖాతా బ్లాక్ అయ్యిందని, కొద్దిరోజులపాటు వినియోగించుకోవడానికి ఒక బ్యాంకు ఖాతా ఇవ్వాలని కోరాడు. ఏడాదిగా పరిచయం ఉండడంతో.. ఇంజినీరింగ్ విద్యార్థి తన కర్ణాటక గ్రామీణ బ్యాంక్ పాస్‌బుక్, ఎటిఎం కార్డ్ నెట్ బ్యాంకింగ్ వివరాలు, ఖాతాకు లింక్ చేసి ఉన్న ఎయిర్‌టెల్ సిమ్ కార్డ్ వివరాలను స్నేహితుడికి పంపించాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 20న విద్యార్థిని సంప్రదించిన కర్ణాటక గ్రామీణ బ్యాంక్ అధికారులు అతడి ఖాతా నుంచి అక్రమ లావాదేవీలు జరిగినట్లు తెలుపడంతో విస్తుపోయాడు. షెల్ కంపెనీ పేరుతో కేవలం రెండు రోజుల్లోనే సైబర్ నేరగాళ్లు విద్యార్థి ఖాతా నుంచి రూ.7 కోట్లను వివిధ ఖాతాలకు మళ్లించినట్లు వెల్లడించారు. దాంతో ఇంజినీరింగ్ విద్యార్థి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన పోలీసులు బాధితుడి స్నేహితుడు ఆశిష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా విషయం బయటకు వచ్చింది. ఇంజినీరింగ్ విద్యార్థి దగ్గర తీసుకున్న ఖాతా వివరాలను ఆశిష్ విదేశాల్లోని సైబర్ నేరగాళ్లకు విక్రయించినట్లు తెలిపాడు. దాంతో పోలీసులు వెంటనే సదరు ఖాతాను బ్లాక్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# 'ఇండియా' కన్వీనర్‌గా స్టాలిన్ అత్యంత అర్హుడు

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మణిశంకర్ అయ్యర్



**చెన్నై:** డిఎంకె అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ ఇండియా ఐక్య సంఘటనకు కన్వీనర్‌గా ఉండటానికి 'అత్య ంత అర్హుడు' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ సోమవారం అన్నారు. కాగా స్టాలిన్ పేరును అయ్యర్ అనేక సార్లు సూచించడం కాంగ్రెస్ వర్గాల నుంచి ఆగ్రహాన్ని రేకెత్తించింది. అయితే స్టాలిన్‌ను ఇండియా ఐక్య సంఘటన జా తీయ కన్వీనర్‌గా లేదా అధ్యక్షుడిగా చూడటం కా ంగ్రెస్‌కే మేలు చేస్తుందని కాంగ్రెస్ అనుభవజ్ఞుడు అన్నారు. 'ప్రస్తుత పరిస్థితులలో 2029 లక్ష్యంగా 'ఇండియా'కు నాయకత్వం వహించడానికి ఎం .కె.స్టాలిన్ కంటే మరెవరూ తగిన వారు కాదు' అని చెన్నైలో ఉన్న అయ్యర్ ఫోన్‌లో పీఐటీకి తెలిపారు. స్టాలిన్ పేరును సూచించడానికి గల కారణాలను ఆయన వివరిస్తూ, బలమైన ఇండియా ఐ క్య సంఘటన మాత్రమే 2029 సార్వత్రిక ఎన్నిక ల్లో విజయాన్ని నిర్ధారించగలదని, అది లేకుండా రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కాలేరని అన్నారు. స్టాలిన్ మాత్రమే జాతీయ స్థాయిలో కూటమిని బ లో పేతం చేయగలడని, రాబోయే ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఆయన కుమారుడు ఉదయనిధి, అతని సహచరులు రాష్ట్ర ప్రభుత్వాన్ని నడపగలడని ఆయన అన్నారు. కాంగ్రెస్ నిస్సందేహంగా 'ఇండియా'లో ఆధిపత్య భాగస్వామి అయినందున... ఆధిపత్య భాగస్వామి కంటే చిన్న భాగస్వామి కూటమి ఐక్యతకు మంచి హామీ అని అయ్యర్ నొక్కి చెప్పారు. స్టాలిన్ భారత కూటమికి నాయకత్వం వహించడానికి మద్దతు ఇవ్వడానికి గల కారణాలను మరింత వివరిస్తూ, డిఎంకె చాలా సంవత్సరాలుగా కాంగ్రెస్‌కు అత్యంత విశ్వసనీయ భాగస్వామి అని, స్టాలిన్ ఏకాభిప్రాయాన్ని ఎలా సష్టించాలో తెలిసిన అసాధారణ నిర్వాహకుడిగా తనను తాను నిరూపించుకున్నాడని అయ్యర్ అన్నారు. స్టాలిన్ 'నిష్కళంకమైన లౌకిక ప్రమాణాలు' ను కూడా అయ్యర్ తన సూచనకు ఒక కారణంగా పేర్కొన్నారు. ప్రజలకు ముఖ్యమైన అంశాలను గుర్తించే స్టాలిన్ సామర్థ్యం ఆయనను ఇండియా ఐక్య సంఘటన కన్వీనర్ పదవికి స్పష్టమైన ఎంపికగా మారుస్తుందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 1962 చైనా పరాజయం తర్వాత కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టడానికి, దాని పునరుద్ధరణను నిర్ధారించడానికి భారతదేశ మొదటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ... కె.కామరాజ్ వైపు ఎలా మొగ్గు చూపారో, స్టాలిన్ '21వ శతాబ్దపు కామరాజర్' కాగలడని... ఇండియా బ్లాక్‌ను విజయపథంలో నడిపించగలడని చెప్పడానికి అయ్యర్ ఉదహరించారు. ఇదిలాఉండగా కాంగ్రెస్‌తో సంబంధాలు దెబ్బతిన్న అయితే అయ్యర్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ దూరంగా ఉంది. కొన్ని సంవత్సరాలుగా ఆయనకు పార్టీతో ఎటువంటి సంబంధం లేదని, ఆయన పూర్తిగా తన వ్యక్తిగత హోదాలోనే మాట్లాడుతారని, రాస్తున్నారని పేర్కొంది. గత వారం అయ్యర్ తన పార్టీ సహచరులపై మాటలతో విరుచుకుపడ్డారు. తిరువనంతపురం ఎంపీ శశి థరూర్‌ను 'సూత్రప్రాయం లేని కెరీర్‌వాది' అని, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాల ఇంఛార్జ్) కె.సి.వేణుగోపాల్‌ను 'రౌడి' అని అయ్యర్ వరుసగా విమర్శిస్తూ, పార్టీ అనుభవజ్ఞుడైన రమేష్ చెన్నితలపై విమర్శలు గుప్పించారు.

# కీలకమైన ఆర్థిక సేవలపై దృష్టి పెట్టండి

- నిర్లక్ష్యంగా బీమా,రుణాలు అంటగడితే సహించం
- బ్యాంకులపై ధ్వజమెత్తిన మంత్రి సీతారామన్
- జులై 1 నుండి మిస్–సెల్లింగ్‌పై మార్గదర్శకాలు అమలు

**న్యూఢిల్లీ:** బ్యాంకులు ఖాతాదారులకు సంబంధించిన కీలక ఆర్థిక సేవలను నిర్లక్ష్యం చేయడంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బ్యాంకులు ఖాతాదారులకు కీలకమైన రోజువారీ ఆర్థిక సేవలను సజావుగా సక్రమంగా అందించకుండా, అర్హులు, అనర్హులు అనే తేడాలు మరచిపోయి, ఎవరికి పడితేవారికి తప్పుడు సలహాలతో బీమా,బలవంతపు రుణాలు అంటగట్టడం వంటి చర్యలకు ఎగబడుతున్నాయని విమర్శించారు. ఖాతాదారులను బ్యాంకులు ఒత్తిడి చేయడం మానుకోవాలన్నారు. బ్యాంకులు అటు ఖాతాదారుల సేవలు, ఇటు బీమా, రుణ ఉత్పత్తుల విక్రయాలు అంటూ రెండు పడవలపై కాళ్ళువేసి నడుస్తున్నాయంటూ నిశిత విమర్శలు చేశారు. సోమవారం ఆమె న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ బ్యాంకులు కోర్ బ్యాంకింగ్ సేవలపై ప్రధానంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఖతాదారుల బలం, అవసరం గుర్తించి వ్యాపార సేవలు నడిపించాలని హితవు చెప్పారు. అటు రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా–ఇటు బీమా నియంత్రణ అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డిఎఐ) మధ్య బ్యాంకులు కొట్టుమిట్టాడుతున్నాయని, తమకు అనుకూలమైన పద్ధతుల్లో ఎవరికి పడితే వారికి యోగ్యత, అవసరాలు చూడకుండా ఆర్థిక ఉత్పత్తులను అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పార్లమెంటులో బడ్జెట్ తర్వాత రిజర్వుబ్యాంకు సెంట్రల్ బోర్డును ఉద్దేశించి లాంఛనంగా ఆమె ప్రసంగించారు. ఆ తర్వాత పాత్రికేయులతో మాట్లాడారు. అవసరం ఉన్నాలేకపోయినా, యోగ్యతలు చూడకుండా ప్రతిఒక్కరినీ పిలిచి బీమా తదితర ఆర్థిక ఉత్పత్తులను అంటగట్టే ప్రయత్నం చేయకుండా (మిస్–సెల్లింగ్) ఉండేందుకు వీలుగా ఫిబ్రవరి 11వ తేదీన రిజర్వుబ్యాంకు కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. బ్యాంకులు మిస్–సెల్లింగ్ చేయడంవల్ల లేదా సేవలవల్ల ఒకవేళ ఖాతాదారులు నష్టపోతే బ్యాంకులు ఆ యావత్ సొమ్మును తిరిగి చెల్లించాలని, ఖాతాదారులకు పరిహారం ఇవ్వాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. ఐతే ఈ మిస్–సెల్లింగ్ కూడా ఆమోదిత నిబంధనలకు అనుగుణంగా జరిగాల్సి ఉంటుంది. జూలై ఒకటో తేదీ నుండి ఈ మిస్–సెల్లింగ్‌కు సంబంధించిన రిజర్వుబ్యాంకు మార్గదర్శకాలు అమలులోకి వస్తాయి. ''రిజర్వు బ్యాంకు కొత్త మార్గదర్శకాలతో ముందుకు వచ్చింది, అందుకు వారిని అభినందిస్తున్నాను, నాకు చాలా సంతోషంగా ఉంది, ఈ విధమైన మిస్–సెల్లింగ్‌ను ఎట్టిపరిస్థితుల్లో సహించకూడదు, ఈ సందేశం బ్యాంకులు అన్నింటికీ చేరాలి, మిస్–సెల్లింగ్‌కు అవకాశం ఇవ్వకూడదు, దీనివల్ల ఖాతాదారులుఖాతాదారులు గాయపడకూడదు, వారిని బాధపెట్టకూడదు'' అన్నారు. మిస్–సెల్లింగ్ అనే పదానికి బ్యాంకులు మరింత మంచి నిర్వచనం సానుకూల దృక్పథంతో ఇవ్వాలన్నారు.




# ఉగ్రవాద నిరోధానికి 'ప్రహార్'

## ప్రభుత్వం విధానం ఆవిష్కరణ



**న్యూఢిల్లీ:** దేశంలోని మొట్టమొదటి ఉగ్రవాద నిరోధక విధానం 'ప్రహార్'ను ప్రభుత్వం సోమవారం ఆవిష్కరించింది. ఇందులో ' ఏ మాత్రం ఉపేక్షించలేని', నిఘా ఆధారంగా ఉగ్రవాద హింసను నిరోధించడం, అంతరాయం కలిగించటం వంటి బహుళ దొంతరల వ్యూహాన్ని రూపొందించారు. ఉగ్రవాదులు, వారి ఆర్థిక సహాయం అందించేవారు, మద్దతుదారులకు నిధులు, ఆయుధాలు, సురక్షిత ప్రదేశాలను పొందకుండా నిరోధించడం లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశం లేదా విదేశాల నుండి వెలువడే ఉగ్రవాద ముప్పులను ఎదుర్కోవడానికి హోం మంత్రిత్వ శాఖ ఆవిష్కరించిన విధానం ఏడు కీలక స్తంభాలపై ఆధారపడి ఉంటుంది. 'భారతదేశం పొరుగు ప్రాంతంలో అప్పుడప్పుడు అస్థిరత చరిత్ర ఉంది. ఇది తరచుగా అరాచక ప్రదేశాలకు దారితీసింది. అంతేకాకుండా, ఈ ప్రాంతంలోని కొన్ని దేశాలు కొన్ని సార్లు ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధాన సాధనంగా ఉపయోగించుకున్నా'' అని పత్రం పాకిస్తాన్ పేరు ప్రస్తావించకుండా పేర్కొంది. భారతదేశం నిరంతరం ఉగ్రవాద బాధితులకు అండగా నిలుస్తుందని , ప్రపంచంలో హింసకు ఎటువంటి సమర్థన ఉండదనే నమ్మకంలో స్థిరంగా ఉందని తెలియజేసింది. స్లీపర్ సెల్స్ ద్వారా దేశంలో హింసను ప్రేరేపించడానికి ప్రయత్నిస్తున్న అల్‌ఖైదా ,ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐసిస్) వంటి ప్రపంచ ఉగ్రవాద గ్రూపుల లక్ష్యం భారతదేశమని విధానపత్రం పేర్కొంది. విదేశీ గడ్డపై కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాదులు భారతదేశంలో హింసను ప్రోత్సహించడానికి కుట్రలు పన్నారని, పంజాబ్, జమ్మూ కశ్మీర్లలో ఉగ్రవాద సంబంధిత కార్యకలాపాలు, దాడులను సులభతరం చేయడానికి డ్రోన్లు వంటి తాజా సాంకేతిక పరిజ్ఞానాలను హ్యాండ్లర్లు ఉపయోగిస్తున్నారని పాలసీ పేర్కొంది. కేంద్ర సంస్థలు, రాష్ట్ర పోలీసు దళాల మధ్య మల్టీ ఏజెన్సీ సెంటర్, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి)లోని జాయింట్ టాస్క్ ఫోర్స్ ఆన్ ఇంటెలిజెన్స్ ద్వారా సన్నిహిత భాగస్వామ్యాలు ఏర్పడ్డాయని పత్రం పేర్కొంది.

# 'లంచం, అవినీతే సిఎం అసలైన స్నేహితులు'

## స్టాలిన్‌పై విజయ్ ఫైర్



**చెన్నై :** తమిళనాడు రాజకీయాల్లో ఎన్నికల వేడి పెరుగుతున్న వేళ, రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్ అధికార పార్టీ డిఎంకెను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పిస్తూ, ఆయన అసలైన స్నేహితులు లంచం, అవినీతి, స్వార్థ రాజకీయాలేనని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వెల్లూరులో సోమవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన విజయ్, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రచారం పూర్తిగా నాటకమని అన్నారు. 'రాష్ట్రాన్ని సూపర్ స్టార్ స్టేట్ చేశామని చెబుతున్నారు. కానీ ప్రజల జీవన స్థాయిలో మార్పు ఎక్కడుంది?' అంటూ ప్రశ్నించారు. తమిళనాడు గతంలో నిజమైన అభివృద్ధిని చూసిందంటే అది కామరాజ్, అన్నాదురై, ఎంజిఆర్ వంటి మహానేతల కాలంలోనేనని గుర్తు చేశారు. ఆ రోజుల్లో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగేదని, ఇప్పుడు మాత్రం ప్రచారం, రాజకీయ లాభాలే ముఖ్యమైపోయాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని ఉల్టా మోడల్ గవర్నమెంట్, స్టాండ్ అప్ కామెడి ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని, చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయని విజయ్ పేర్కొన్నారు. 'ఈసారి అందరూ కలిసి నన్నే లక్ష్యంగా చేసుకున్నారు. అయినా ప్రజలే నా బలం' అన్నారు. అసలు పోరు తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టివికె) డిఎంకె మధ్యేనని స్పష్టం చేశారు.

**ప్రజల హక్కును ఎవరూ లాక్కోలేరు!**

'తమిళనాడు అంటే విజయ్ విజయ్ అంటే తమిళనాడు' అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేసిన ఆయన, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని చెప్పారు. స్టాలిన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని, పేదల సమస్యలు అలాగే ఉన్నాయని ఆరోపించారు. టివికె అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు వెళ్లి ప్రజలను స్వయంగా కలుస్తానని హామీ ఇచ్చారు. ప్రతి పౌరుడి సమస్యను వినిపించి పరిష్కారం చూపుతానన్నారు. ప్రజల ఓటు హక్కు పవిత్రమని, ఎవరూ దాన్ని లాక్కోలేరని స్పష్టం చేశారు. తమ పార్టీ ఎన్నికల గుర్తు విజల్‌కు ఓటు వేయాలని కార్యకర్తలు, అభిమానులను కోరారు. 'మా ఓటు, మా హక్కు' అంటూ నినాదాలు చేశారు.

# టిఎంసి అగ్రనేత ముకుల్‌రాయ్ కన్నుమూత



**కోల్‌కతా:** కేంద్ర రైల్వేశాఖ మాజీ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుడు ముకుల్ రాయ్ కన్నుమూశారు. కోల్‌కతా ఆసుపత్రులో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచారు. ముకుల్ రాయ్ వయస్సు 71 సంవత్సరాలు. అనారోగ్య కారణాలతో గత రెండేళ్లుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోమాలో ఉన్న తన తండ్రి గుండెపోటుతో కన్నుమూసినట్టు ముకుల్ రాయ్ కుమారుడు సుభాన్షు రాయ్ తెలిపారు. టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత నమ్మకస్థుడుగా, టిఎంసిలో రెండో శక్తివంతమైన నేతగా ముకుల్ రాయ్ పేరు పొందారు. బెంగాల్‌లో టిఎంసిని విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు. బెంగాల్ రాజకీయ చాణక్యుడిగా ఆయనను పిలిచేవారు. ముకుల్‌రాయ్ మృతివార్త తెలియగానే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలు పార్టీల నేతలు తీవ్ర సంతాపం తెలియజేశారు. ముకుల్‌రాయ్ రాజకీయంగా తన చిరకాల సన్నిహితుడని, రాజకీయ పోరాటాలను ఎదుర్కొన్న ధీశాలి అని మమతాబెనర్జీ అభివర్ణించారు. టిఎంసి ఆవిర్భావం నుంచి తన జీవితాన్ని పార్టీకే అంకితం చేశారని, కేంద్ర మంత్రిగానూ సేవలందించారని గుర్తు చేసుకున్నారు. బెంగాల్ రాజకీయాల్లో ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన ముకుల్ రాయ్ మృతితో బెంగాల్ రాజకీయ చరిత్రలో ఒక శకం ముగిసిందని టిఎంసి నేత అభిషేక్ బెనర్జీ అన్నారు. ముకుల్ రాయ్ కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. ముకుల్ రాయ్ మృతి తనను విషాదంలో ముంచిందని బిజెపి నేత సువేందు అధికారి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ముకుల్‌రాయ్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

**ముకుల్‌రాయ్ జర్నీ..**

ముకుల్ రాయ్ యువజన కాంగ్రెస్ నేతగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో మూడు దశాబ్దాల లెఫ్ట్ ఫ్రంట్ పాలనకు చరమగీతం పాడి, టిఎంసిని అధికారంలోకి తీసుకురావడంలో కీలక భూమిక వహించారు. 2009–2014 మధ్య కేంద్రంలోని యుపిఎ ప్రభుత్వంలో రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ ఆరేళ్ల పాటు టిఎంసి సస్పెండ చేయడంతో 2017 అక్టోబర్‌లో ఆయన తన రాజ్యసభ సభ్యత్వానికి, టిఎంసి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసారు. అదే ఏడాది బిజెపిలో చేరి జాతీయ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2021లో జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి టిక్కెట్‌పై గెలిచారు. అయితే ఆ తర్వాత టిఎంసి గూటికి తిరిగొచ్చారు.

**మోదీ సంతాపం**

కేంద్ర మాజీ మంత్రి ముకుల్ రాయ్ మృతికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. రాజకీయ అనుభవం, సమాజసేవ పరంగా ఆయన గుర్తుండిపోతారని అన్నారు. ముకుల్ రాయ్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని కోరుకున్నారు.

### అర్ధనగ్న నిరసన ప్రదర్శన కేసులో

# మరో ముగ్గురు కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టు

## బిఎన్‌ఎస్ చట్టాలకింద కేసులు బనాయించిన పోలీసులు

**న్యూఢిల్లీ:** ఇటీవల ముగిసిన ఎ.ఐ. గ్లోబల్ ఇంపాక్ట్ సదస్సులో అర్ధనగ్నంగా నిరసన ప్రదర్శన చేసిన కేసులో పోలీసులు మరో ముగ్గురు యువజన కాంగ్రెస్ (ఐవైసి) కార్యకర్తలను అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో అరెస్టయినవారిసంఖ్య ఏడుకు చేరుకుంది. వీరిపై నేరపూరిత కుట్ర, ప్రభుత్వసేవకులు విధులు నిర్వహించకుండా ఆటంకం కలిగించడం,అవిధేయత,చట్టవిరుద్ధంగా గుమిగూడటం వంటి ఆరోపణలపై కేసులు బనాయించారు. అంతేకాకుండా సమూహాలమధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించేవిధంగా, జాతీయ సమగ్రతకు హానికలిగించే ప్రకటనలు చేసినందుకు వీరిపై పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. గత వారం ఢిల్లీ భారత్ మండపంలో జరిగిన ఎ.ఐ సమ్మిట్‌లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రవేశించి అర్ధనగ్నంగా నిరసన ప్రదర్శన జరిపారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం, ఎప్‌స్టిన్ ఫైల్స్ వివాదంలో ప్రధానమంత్రి రాజీపడ్డారు...అని టీ–షర్టులపై ముద్రించి ఉన్న నినాదాలను ఐవైసి కార్యకర్తలు ప్రదర్శించారు. నినాదాలు చేశారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్రంగా స్పందిస్తూ కాంగ్రెస్‌పార్టీ దేశం పరువు తీసిందని విమర్శించారు. మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో జితేంద్ర యాదవ్, రాజ్‌గుజ్జార్, అజయ్ కుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తర ప్రదేశ్ ఇండియన్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రితిక్ అలియాస్ మోంతీ శుక్లాను లలిత్‌పూర్ నుండి అరెస్టు చేసి తీసుకువెళ్ళారు. ఐవైసి అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను కూడా పోలీసులు ప్రశ్నిస్తున్నారు. అరెస్టు చేసినవారిపై బిఎన్‌ఎస్ సెక్షన్ 196ను కూడా చేర్చి కేసులు పెట్టారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు వివిధ వర్గాలకు చెందిన సమూహాలమధ్య శత్రుత్వం ప్రోత్సహించే చర్యలకు ఒడిగట్టారంటూ బిఎన్‌ఎస్ సెక్షన్ కింద కేసులు బనాయించారు. 197 సెక్షన్ కింద జాతీయ సమగ్రతకు భంగం కలిగించారనే పేరుతో కేసులు మోపారు. వీరిపై నేరం రుజువైతే ఈ చట్టాల కింద కనీసం మూడు సంవత్సరాల వరకూ జైలుశిక్షను పొడిగించే అవకాశం ఉంటుంది.

కృత్రిమ మేధ సదస్సు ఎగ్జిబిషన్ హాలులో ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నాటకీయంగా చొక్కాలు తీసేసి నిరసన ప్రదర్శన జరిపారు. ఎ.ఐ ఎగ్జిబిషన్‌లో చైనా మేధోహక్కులు హరించి మన స్వదేశీ ఆవిష్కరణలుగా పేర్కొంటూ ఉత్తర ప్రదేశ్‌లోని ఒక యూనివర్సిటీ చైనా డాగ్ రోబోను ప్రదర్శించడంతో దేశం పరువు పోయిందని రాహుల్ గాంధీ విమర్శించారు. అదేవిధంగా సదస్సులో



అనేక నిర్వహణా లోపాలను కూడా ఆయన తప్పుపట్టారు. దీంతో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎ.ఐ సదస్సు ఎగ్జిబిషన్ హాలులో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలియజేశారు. అదేరోజున ఢిల్లీ పోలీసులు నలుగురు ఐవైసి కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈ కేసులో విస్తారమైన కుట్రకోణం ఏదైనా ఉందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఐవైసి కార్యకర్తల చర్య భారత్‌కు సిగ్గుచేటుగా మారిందని, భారత్ ప్రతిష్ట ప్రపంచవేదికపై దిగజారిందని బిజెపి నాయకులు విమర్శించారు. ఐతే తాము శాంతియుత పద్ధతులలో నిరసన తెలియజేశామని ఐవైసి కార్యకర్తలు తమ చర్యను సమర్థించుకున్నారు. ఈ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ఐవైసి కార్యకర్తలు ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకుని క్యూర్ కోడ్ సంపాదించారని పోలీసులు ఆరోపించారు.

# తమిళనాడులో 97.37 లక్షల ఓట్ల తొలగింపు

## మొత్తం 5.67 కోట్ల మంది ఓటర్లు

**చెన్నై:** తమిళనాడు రాష్ట్రంలో 5.67 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఆ రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ ఈ విషయాన్ని తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 97.37 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు ఆమె వెల్లడించారు. సర్ ప్రక్రియ చేపట్టడానికి ముందు తమిళనాడులో సుమారు 6.41 కోట్ల మంది ఓటర్లు ఉండేవార్నారు. ఈసారి కొత్తగా 18 నుంచి 19 ఏళ్ల వయసు ఉన్న సుమారు 7.40 లక్షల మంది కొత్త ఓటర్లు చేరినట్లు సిఇఒ తెలిపారు. ఈ రోజు నుంచి ఓటర్ల జాబితా అప్‌డేట్ ప్రక్రియ ప్రతి రోజు జరుగుతుందని ఆమె వెల్లడించారు. తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఓటర్లలో 2,77,38,925 కోట్ల మంది పురుషులు, 2,89,60,838 కోట్ల మంది మహిళలు, 7,617 వేల మంది థార్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.



# ట్రంప్‌ను ఎదుర్కొనేందుకు లులా 'యూనియన్' మంత్రం

ప్రపంచదేశాలపై ఎడాపెడా దిగుమతి సుంకాలు విధించే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారం రాజ్యాంగ రీత్యా చెల్లుబాటుకాదని సుప్రీంకోర్టు 6–3తో తీర్పు చెప్పినప్పటికీ ఆయన ధిక్కారధోరణి మారలేదు. మరో చట్టంలోని మరో క్లాజును ఉపయోగించి 150 రోజులు అమలులో ఉండే విధంగా అన్ని దేశాలపై సార్వత్రికంగా 10శాతం సుంకం విధించి, ఆ మరునాడే దాన్ని 15శాతానికి పెంచారు. ఈ గందరగోళం, అస్పష్టత నేపథ్యంలో తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి తుదిరూపమిచ్చేందుకు సోమవారం(ఫిబ్రవరి 23) నుంచి వాషింగ్టన్‌లో మూడు రోజులు జరగాల్సిన వాణిజ్య ప్రతినిధి బృందాల చర్చలను భారత్ వాయిదా వేసుకోవటం హర్షించదగింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఖరారైందని, సంతకాలే తరువాయి అని ట్రంప్ ప్రకటించటం తన ఆధిపత్య ధోరణిని మరోసారి ప్రదర్శించినట్లయింది. తాత్కాలిక వాణిజ్య ఒప్పందం చట్రం కుదిరినట్లు తొలుత ప్రకటించింది కూడా ఆయనే.

ఇదిలా వుండగా, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వ తన నాలుగు రోజుల భారత్ పర్యటన ముగింపు సందర్భంగా ఆదివారం నాడు న్యూఢిల్లీలో విలేకరుల ప్రశ్నలకు సమాధానమిస్తూ, కార్మికవర్గ నేతగా ప్రపంచ దేశాలకు విలువైన సూచన చేశారు. 1980వ దశకంలో బ్రెజిల్ వర్కర్స్ పార్టీని స్థాపించక మునుపు ఆయన ట్రేడ్ యూనియనిస్టు. సుప్రీం కోర్టు తీర్పు దరిమిలా అమెరికాలో జరుగుతున్న పరిణామాలను లులా ప్రస్తావించకుండానే, ఈ సమస్యపై అమెరికా అన్ని దేశాలను "సమానంగా పరిగణిస్తుందని" ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో సుంకాల నుంచి బాధలు పడుతున్న దేశాలు "సంప్రదింపుల కూటములు"గా ఏర్పడాలని సలహాయిస్తూ, తన ట్రేడ్ యూనియనిస్టు అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. ఒక చిన్న దేశం పెద్ద దేశంతో సంప్రదింపులు జరిపితే ఆ ఒప్పందం ఎల్లప్పుడూ చిన్నదేశానికి హానికరంగా ఉంటుందన్నారు. ఇది ట్రేడ్ యూనియన్, కార్మికోద్యమం నుంచి నేర్చుకున్న అనుభవమని చెప్పారు. "యజమానితో చర్చలు జరపాలంటే కార్మికులందరూ కలసికట్టుగా వచ్చి కంపెనీ విధానాన్ని ఎదుర్కోవాలి. వారు వ్యక్తిగతంగా చర్చలు జరిపితే అందరూ నష్టపోతారు" అని అధ్యక్షుడు లులా డ సిల్వ చెప్పారు. దీన్ని అంతర్జాతీయ వాణిజ్యానికి వర్తింపజేస్తూ, దక్షిణార్ధగోళ దేశాలు, ఇతరులు ప్రపంచ అగ్రరాజ్యాలతో సంప్రదింపులు జరిపేటప్పుడు "కలిసికట్టుగా వ్యవహరించాలి" అన్నారు. పెట్టుబడిదారులకు గులాములు గా వ్యవహరిస్తూ ట్రేడ్ యూనియన్‌లను, కార్మికోద్యమాన్ని అణచివేసే నేతలు ఈ సలహాలోని విలువను గ్రహిస్తే దేశ ప్రజలకు మేలు. కార్మికుల హక్కులు హరిస్తూ మోదీ తెచ్చిన లేబర్‌కోడ్‌లు ఈ సందర్భంగా ప్రస్తావనార్హం.

వచ్చేవారం వాషింగ్టన్ పర్యటనకు వెళ్లనున్న బ్రెజిల్ అధ్యక్షుడు, "మేము కొత్త ప్రచ్ఛన్నయుద్ధాన్ని కోరుకోవటం లేదు. ఏ ఇతర దేశంలోనూ జోక్యం చేసుకోవాలని మేము కోరుకోవటం లేదు. అన్ని దేశాలను సమానంగా పరిగణించాలని మేము కోరుకుంటున్నాం" అని అధ్యక్షుడు ట్రంప్‌కు చెబుతానని విలేకరుల ప్రశ్నకు జవాబుగా చెప్పారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా తదితర దేశాలు సభ్యులుగా ఉన్న 'బ్రిక్స్' సంస్థకు మొన్నటివరకు లులా అధ్యక్షుడు. ప్రస్తుతం ఆ స్థానం రొటేషన్ ప్రకారం భారత్‌కు వచ్చింది. సొంత కరెన్సీలతో బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం నిర్వహించే అవకాశాలను పరిశీలించాలన్న బ్రిక్స్ నిర్ణయం డాలర్ ప్రపంచాధిపత్యానికి ప్రమాదంగా పరిగణించిన ట్రంప్ బ్రిక్స్ దేశాలపై సుంకాల యుద్ధ ప్రారంభించాడు. అత్యధికంగా 50శాతం సుంకాలకు గురైన దేశాలు బ్రెజిల్, భారత్. బ్రిక్స్‌లో సభ్యత్వం, ఇరాన్‌తో వాణిజ్యం, రష్యానుంచి ఆయిలు దిగుమతి – ఇలా ఏదోక పేరుతో ఈ రెండు దేశాలపై సుంకాల దాడి చేశారు. ఇందులో కనిపించేదేమిటి? తమతో వాణిజ్యం కోరుకునే దేశాలు తమ స్వతంత్ర నిర్ణయాధికారాన్ని విడనాడి అమెరికా విదేశాంగ విధాన లక్ష్యాలను సమర్థించాలన్నమాట! అంటే బ్లాక్‌మెయిలు ఎత్తుగడల ద్వారా, వేధింపుల ద్వారా ప్రపంచంపై తమ అగ్రరాజ్యాధిపత్యాన్ని నెలకొల్పటానికి ట్రంప్ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాడు. ఈ బెదిరింపుల ద్వారానే భూగర్భంలోని అరుదైన లోహాలను సొంతం చేసుకుని, చైనా ఆధిపత్యాన్ని దెబ్బతీయటానికి ట్రంప్ ఇతర దేశాలపై ఒత్తిడితెస్తూ సుంకాలను అస్త్రంగా ప్రయోగిస్తున్నాడు. చైనా, రష్యా మాత్రమే ట్రంప్ ఒత్తిళ్లను తట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, అగ్రరాజ్యంతో చర్చల్లో "గ్లోబల్ సౌత్ దేశాల యూనియనైజేషన్" సలహా స్వాగతించదగింది.

ఐరాస భద్రతామండలిలో భారత్, బ్రెజిల్, ఇంకా జర్మనీ, మెక్సికో, నైజీరియా, ఈజిప్టు ఎందుకు శాశ్వత సభ్యులుగా ఉండకూడదు అన్న లులా ప్రశ్నకు ఏదీ సమాధానం? ప్రాధేయపడటం కన్నా 'కలసికట్టుగా' పోరాడటం లక్ష్యసాధనకు బాట వేస్తుంది.



## కొనుగోలు దారులారా.. జాగ్రత్త!

**హాస్యాస్పదమైన సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా 'ఆటలు ఆడాలనుకునే' ఏ దేశమైనా సరే.. ముఖ్యంగా అమెరికాను సంవత్సరాలుగా, దశాబ్దాలుగా 'కొల్లగొట్టిన' దేశాలు ఇటీవల అంగీకరించిన దానికంటే చాలా అధిక, భయంకరమైన సుంకాన్ని ఎదుర్కొంటాయి... కొనుగోలుదారులారా.. జాగ్రత్త! (బయర్ బివేర్)'. ఈ విషయం పట్ల మీరు సావధానంగా విన్నందుకు మీకు ధన్యవాదాలు.**

- ట్రూత్ సోషల్ మీడియాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోస్ట్




# జిఎస్‌టి అమలుతో పెరిగిన దేశ ఆదాయం!

1855లో భారత దేశంలోనే అతి పురాతనమైన విభాగం సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ ఏర్పడింది. భారత రెవెన్యూ, ఆర్థిక శాఖల పరిధిలో పని చేస్తున్న సెంట్రల్ ఎక్సైజ్ లేదా సెంట్రల్ జిఎస్టీ శాఖ ఎక్సైజ్ డ్యూటీ, సర్వీస్ టాక్స్, కస్టమ్స్ డ్యూటీ, నార్కొటిక్స్ డ్యూటీ, జీఎస్టీ లాంటి పన్నులను సక్రమంగా వసూలు చేయడంలో ప్రధాన భూమికను నిర్వహిస్తూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను కూడా అరికట్టడంలో తన వంతు కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నది.

**సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవం:** 24 ఫిబ్రవరి 1944న సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సాల్ట్ చట్టం 1944 ఏర్పడిన శుభ సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 24 ఫిబ్రవరిన దేశవ్యాప్తంగా సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. ఈ వేదికగా సామాన్య ప్రజలకు సెంట్రల్ ఎక్సైజ్ శాఖ పట్ల కనీస అవగాహన కల్పించడంతో పాటు సదస్సులు, కార్యశాలలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యాలయాల్లో పోటీలు, అవార్డుల ప్రదానం లాంటివి నిర్వహించడం జరుగుతుంది. సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో నిష్ఠతో సేవలందించిన సిబ్బందిని గుర్తించి సన్మానాలు కూడా చేయడం అభినందనీయం.

**జిఎస్టీ అమలు:** వస్తు ఉత్పత్తి పరిశ్రమల వ్యాపార లావాదేవీల్లో అవకతవకలను అరికట్టడానికి, పారదర్శకత పెంచడానికి, సత్సంప్రదాయాలను నెలకొల్పడానికి, సంబంధిత చట్టాలను పటిష్టంగా అమలు చేయడానికి సెంట్రల్ ఎక్సైజ్ శాఖ కృషి చేస్తున్నది. ఈ శాఖలో కస్టమ్స్ ఆక్ట్1962, కస్టమ్స్ ట్రాఫిక్ ఆక్ట్1975, సెంట్రల్ ఎక్సైజ్ ఆక్ట్1944, సర్వీస్ ఆక్ట్ లాంటి చట్టాలను గట్టిగా అమలు చేయడంలో సెంట్రల్ ఎక్సైజ్ పాత్ర చాలా పెద్దది. ప్రస్తుతం అమలు అవుతున్న జిఎస్టీ అమలు 01 జూలై 2017 నుంచి అమలులోకి వచ్చింది. పన్నుల వసూళ్లు సమర్థవంతంగా జరిగితే ప్రభుత్వ ఆదాయం పెరిగి పేదరిక నిర్మూలనతో పాటు దేశాభివృద్ధి సుసాధ్యం అవుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలు తమ తమ విధులను సక్రమంగా నిర్వహించిన నాడు దేశ ఆదాయం భారీగా పెరగడం, వాటితో దేశ సుస్థిరాభివృద్ధి సుసాధ్యం కావడం జరుగుతుందని గమనించి అవినీతికి తావులేని ప్రభుత్వ యంత్రాంగాలు విధి నిర్వహణలో నిమగ్నం అయినపుడు నీతివంతమైన పాలన, పౌర సమాజం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతుంది.

# "బస్ కా పయ్యా నహీ చలేగా"



ఎస్.బాబు, అధ్యక్షులు
టిజిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

తెలంగాణ అంటేనే పోరాటాల పురిటిగడ్డ. ఉద్యమాల ఉగ్గుపాలు తాగి పోరాడి అమరులైన నెత్తుటి నేల. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించి 4,500 మంది ప్రాణత్యాగం చేసిన విప్లవభూమి. 1969 లో తొలిదశ తెలంగాణ ఉద్యమంలో 369 మంది విద్యార్థులు, యువకులు పోలీసు కాల్పుల్లో అమరులైన మరుభూమి. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సుమారు 1200 మంది ప్రాణత్యాగం చేశారు.

2019 లో జరిగిన ఆర్టీసి సమ్మెలో 34 మంది కార్మికులు ఆత్మ బలిదానం చేసుకున్నారు. ఆనాటి కార్మికుల ఆశలు నేటివరకు నెరవేరలేదు. ఆనాడు టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టీసి ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది. మాజీ ముఖ్యమంత్రి ఒక్క నోటి మాటతో ట్రేడ యూనియన్లపై బ్రహ్మాస్త్రాన్ని సంధించారు. ఆనాడు మౌనమే నా భాష అంటూ నిశ్శబ్దంగా ఉన్న కేసీఆర్ కుటుంబం నేడు ఆర్టీసి కార్మికుల సమస్యలపై చిలుక పలుకులు పలుకుతున్నారు. ఆనాడు ఎందుకు గళమెత్తలేకపోయారు? తండ్రి తీసుకున్న నిర్ణయాన్ని కేటీఆర్, కవితలు ఎందుకు వ్యతిరేకించలేకపోయారు? ట్రేడ యూనియన్లపై ఉక్కుపాదం మోపినప్పుడు ఈరోజు సన్నాయి నొక్కులు నొక్కుతున్న హరీష్ రావు ఏమయ్యారు? 34 మంది ఆత్మ బలిదానాలు చేసుకుంటే ఈ నాయకులెవరూ కనీసం ఆ కుటుంబాలను పరామర్శించలేదు. ఇప్పుడేమో శ్రీరంగనీతులు వల్లిస్తున్నారు.

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఆర్టీసి కార్మికులకు నాటి ఎన్నికల మేనిఫెస్టోలో 6 హామీలిచ్చారు. వాటిని అమలు చేయటానికి పిల్లిమొగ్గలేస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామంటూ ఊహల పల్లకీలో ఊరేగించారు. అది విన్న కార్మికులందరూ ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు దాటినా విలీనం ఊసే లేదు. ఇప్పటికీ కార్మికులు ఊహల పల్లకిలోనే ఊరేగుతున్నారు. ఎన్ని మెమోరాండంలు ఇచ్చినా, ఎన్నిసార్లు మంత్రులను కలిసినా, ఎన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వంలో చలనం లేదు.

2024 మే మాసంలో జెఎసి సమ్మె చేయటానికి సమాయత్తమైనప్పుడు ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. రవాణా శాఖామాత్యులు ఆ టీమ్ కి నాయకత్వం వహించారు. అజ్మీరీ కలాకండ లాంటి తియ్యని మాటలు మాట్లాడారు. ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జాతీయ సమైక్యత దెబ్బతినే పరిస్థితి ఉన్నదని, పాకిస్తాన్ బూచిని చూపించి సమ్మెను వాయిదా వేసుకోవాలని కోరారు. రెండేళ్ళయినా వారింకా ముఖ్యమంత్రితో మాట్లాడుతూనే ఉన్నారు. అందుకే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు మాట్లాడారు. 2017 వేతన సవరణ కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది. కాని అలవెన్సులు పెంచలేదు. వేతన సవరణ ఎరియర్సు ఇవ్వలేదు.

రిటైరైన ఉద్యోగులకు వేతన సవరణ బకాయిలు ఇవ్వలేదు, వారికి సెటిల్మెంట్స్ చెల్లించలేదు. అతి కష్టం మీద 2013 వేతన సవరణకు సంబంధించిన బాండ్ల పైసలు వాయిదా పద్ధతుల్లో విడుదల చేశారు. దానికే ఎంతో ఆపసోపాలు పడ్డారు. రైతులన్నా, ప్రజలన్నా ఆర్టీసి కార్మికులకు వ్యతిరేకం కాదు. ఆర్టీసి కార్మికులపై ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోంది. ప్రజలకు ఉచిత విద్యుత్తు ఇస్తారు, ఉచిత గ్యాస్ ఇస్తారు, రైతుబంధు డబ్బు అకౌంట్లో వేస్తారు. మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తారు, సన్నబియ్యం ఇస్తారు, నగదు బదిలీ చేస్తారు, పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు కట్టిస్తారు, కానీ నిరుపేదలైన ఆర్టీసి కార్మికుల కడుపు నింపరు. ఈ వివక్ష ఎందుకని ఆర్టీసి కార్మికులు "ఛలో సెక్రటేరియట్"అంటూ గొంతెత్తుతున్నారు.

5 సంవత్సరాలు గడిచినా 2021 వేతన సవరణ ఇవ్వరు. ఆర్టీసికి బడ్జెట్ ప్రొవిజన్ పెట్టరు. ఆర్థిక అంశాలు అడగొద్దని ముఖ్యమంత్రి చాగంటి వారిలా ప్రవచనాలు చెప్తారు. తనను కోసినా రక్తం వస్తుందే తప్ప, డబ్బు రాలదంటూ బీద అరుపులు అరుస్తుంటారు. కాని ఆర్టీసి మేనేజ్మెంట్ కార్మికులను కోసి రక్త మాంసాలు రుచి చూస్తుంటే ఈ ప్రభుత్వం గుడ్లప్పగించి చూస్తుందే తప్ప, దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. అందుకే "ఛలో సెక్రటేరియట్" ఉద్యమం. ముఖ్యమంత్రి ఆర్టీసిలో ట్రేడ యూనియన్లు ఉండాల్సిందే, 40,000 మంది కార్మికులు పని చేసే చోట సమస్యలు వస్తే ఎవరికి చెప్పుకుంటారు? అందువలన ట్రేడ యూనియన్లను రెస్టోర్ చేస్తామంటారు. కాని రెండేళ్ళయినా ఇంతవరకు రెస్టోర్ చేయలేదు. ఇకముందు చేస్తారో లేదో అని కార్మిక సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించటానికి ప్రభుత్వానికైనా, యాజమాన్యానికైనా ఆర్థిక ఇబ్బందులేమీ లేవు. అయినా ఇంగువ కట్టిన గుడ్డ ముడి విప్పరు. యాజమాన్యం వేధింపులు, పనిభారాలు తట్టుకోలేక కార్మికుల గుండె చప్పుడు బస్సులో మరియు స్టీరింగులపై ఆగిపోతోంది. కుటుంబాలు ఛిద్రమైపోతున్నాయి. నమ్మి ఓటేసిన కార్మికులు నిర్జీవమై నిటలేక్షుడి నివాసమైన స్మశానంలో దహించుకుపోతున్నారు. అయినా ఈ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయడం లేదు. కాని అధిష్ఠానం ఢిల్లీకి పిలిస్తే గాలి మోటర్ లో వాయువేగంతో చేరుకుని తమ ప్రభుభక్తిని చాటుకుంటారు. వినాయకుడికి ఎలుక వాహనం ఉంది. అది స్వామివారి స్వంతం. అది హైర్ వెహికల్‌లో, ఎలక్ట్రికల్ వెహికల్‌లో కాదు. అలాగే దేవతలందరికీ వారి వారి స్వంత వాహనాలు ఉన్నాయి. అంతకంటే అందమైన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రజానీకం ప్రయాణించటానికి ప్రభుత్వం ఆర్టీసికి ఇస్తోంది. ఇవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్వంత వాహనాలు కావు. అలాగే ఆర్టీసికి కూడా స్వంతం కాదు. మేనక విశ్వామిత్రుడి దగ్గరకు వచ్చి తపోభంగం కలిగించి, బిడ్డను కని వెళ్ళినట్లుగా, ఎలక్ట్రిక్ బస్సులు కూడా ఆర్టీసికి వచ్చి 12 ఏళ్ళ సర్వీసు ఇచ్చి మేనక వెళ్ళినట్లే వాటి యజమానుల వద్దకు వెళ్ళిపోతాయి. మేనకలా వెళ్ళి రాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ బస్సులను కొని ఆర్టీసికి ఇవ్వాలని జెఎసి డిమాండ చేస్తోంది. అలా చేస్తే ప్రభుత్వరంగ సంస్థలు బలపడతాయి. కాని ఈ ప్రభుత్వాలు అలా చేయవు. ఎందుకంటే వారికి ప్రైవేట్ రంగమే మేనక లాంటిది.

ప్రభుత్వరంగ సంస్థలు వారికి పరిచారికలు. సహజంగానే ప్రభుత్వాలు మేనక వైపు మొగ్గుచూపుతాయి. గానాబజానాలు, మేజువాణీలు, షడసోపేతమైన భోజన తాంబూలాలు దొరుకుతాయి. పరిచారికల్లాంటి ఆర్టీసి సంస్థల్లో ఏముంటుంది? మట్టివాసన, గ్రీజు కంపు, డొక్కు బస్సులు.

ఆర్టీసిలో ఉన్న ట్రేడ యూనియన్లలో ఐక్యత లేదు. ఇది ప్రభుత్వ, యాజమాన్యాలకు మంచి అవకాశంగా మారింది. కార్మికులు కూడా "ఛలో సెక్రటేరియట్" కార్యక్రమానికి రావాలంటే భయభ్రాంతులవుతున్నారు. తమ డ్యూటీ డీవియేట్ అవుతుందేమో, మేనేజిమెంట్ తమని బదిలీ చేస్తుందేమో, ఛార్జిషీట్ ఇచ్చి సస్పెండ చేస్తారేమో, మనం ఉద్యమం చేయకుండా సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు, కమ్యూనిస్ట్ పార్టీలు మన తరపున పోరాడాలి కదా? అనే భావనలో చాలామంది కార్మికులున్నారు. అది తప్పు అని నా భావన. ఇది కార్మికుల డిఎన్ఏ కూడా కాదు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని, ఎదురు చూసే కంటే మన సమస్యలపై మనం ధైర్యంగా తెగించి పోరాడాలి. మన పోరాటాన్ని చూసి సెంట్రల్ ట్రేడ్ యూనియన్లైనా, రాజకీయ పార్టీలైనా మన కండగా ఉండి దాన్ని ప్రజాపోరాటంగా మారుస్తాయి. మేనక విశ్వామిత్రుడి తపస్సు భంగపరచటానికి ఎంతో శ్రమించింది. ఫలితం శకుంతల రూపంలో వచ్చింది.

పోరాటం లేని ఫలితాన్ని కార్మికులు ఎలా ఆశిస్తారు? తుపాకీ తూటాలకు తరగని తెగువ మనది. ఇప్పటికైనా లేవండి. సమస్యలపై విజృంభించండి. ఉరికొయ్యలు, చెరసాలలు ఉద్యమాన్ని ఆపలేవంటూ ధైర్యంగా మడమ తిప్పని పోరాటం చేస్తే ఫలితం కార్మికులను వరిస్తుంది.

**(నేడు ఆర్‌టిసి కార్మికుల చలో సెక్రటేరియట్)**

# పాత కల్పితాలతో కలిసిన కొత్త సద్గుణాలు!

'వందే మాతరం'కు మళ్లీ అధికారిక ప్రాధాన్యం కల్పించిన నేపథ్యంలో, బకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ రచించిన 'ఆనందమఠ్' నవల ఆ గీతానికి ఉన్న పలు చారిత్రక పొరలను స్పష్టంగా చూపిస్తుంది. సాహిత్య రచనలు ఆధునిక రాజకీయాల్లో ఎలా పునర్వ్యాఖ్యానానికి గురవుతున్నాయోనన్న అంశంపైనే ఇప్పుడు చర్చ సాగుతోంది. ఈ ఏడాది 2026 ఏప్రిల్–మేలో జరగనున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ముందు, కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ జనవరి 28న ఒక ఆదేశం జారీ చేసింది. ప్రభుత్వ కార్యక్రమాలన్నిటిలో 'వందే మాతరం' అసలు ఆరు చరణాలు ఆలపించాలని, ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొంది. 'వందేమాతరం' 1950 జనవరి 24న రాజ్యాంగ సభ తీర్మానంతో జాతీయ గేయం హోదాను సంతరించుకుంది. అయితే దీనిని జాతీయ గీతం 'జన గణ మన'కు ముందు పాడాలనే ఆదేశాన్ని రాజ్యాంగ సభ స్పష్టంగా పేర్కోలేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్థూలంగా చూస్తే 1875లో బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ రచించిన 'వందే మాతరం' గీతానికి 150 సంవత్సరాల సంబరాల సందర్భంగా గౌరవం ఇవ్వడంగా కనిపిస్తుంది. ఈ గీతం ఆయన 1882లో ప్రచురించిన 'ఆనందమఠ్' నవలలో భావనంద అనే పాత్ర ద్వారా ప్రాచుర్యం పొందింది. ఒక కల్పితం అనేది వాస్తవాలను మార్చగలదనే విషయాన్ని ఇక్కడ గమనించాలి.




నిజానికి, నవలలో భావనంద అనే పాత్ర చేత ఈ గీతాన్ని ఆలపింప చేయడం ఆసక్తికరమైన అంశం. భావనంద ప్రధాన పాత్ర మహేంద్రుడి భార్య కళ్యాణిపై ప్రేమ పెంచుకుంటాడు. తన పాపానికి ప్రాయశ్చిత్తంగా శత్రువులతో పోరాడుతూ మరణిస్తాడు. నవలలో బెంగాల్‌ను మీర్ జాఫర్ అనే ద్రోహి ఆధీనంలో ఉన్న ప్రాంతంగా చూపిస్తారు. అతనిని దుర్మార్గుడైన ముసల్మానుగా పేర్కొంటారు. అంతేకాదు, ముస్లింలు అందరూ చెడ్డవారేనన్న ముద్ర వేస్తారు. గతాన్ని ఆధారంగా చేసుకొని, ప్రస్తుత పరిస్థితులపై నిర్ణయాలు ప్రకటించడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. ఎందుకంటే, కాలానుగుణంగా సిద్ధాంతాలు, అవగాహనలు మారుతాయి. అయినప్పటికీ, బంకిమ్ చంద్ర నేటి కాలంలో జీవించి, ఇలాంటి ఇస్లాం వ్యతిరేక అభిప్రాయాలు వ్యక్తం చేసి ఉంటే, ఆయనను ఏ రాజకీయ పార్టీ గౌరవిస్తుందనేది ప్రశ్న. 'ఆనందమఠ్' అనువాదం చేసిన నరేశ్ చంద్ర సేన్ ప్రకారం, ఆ నవల్లో ఇస్లాం పట్ల విద్వేష భావం స్పష్టంగా కనిపిస్తుంది. ఇది, ఎన్నికల సమయంలో అక్రమ వలసదారుల అంశాన్ని అజెండాగా మారుస్తున్న బిజెపి వంటి పార్టీలకు అనుకూలమైన అంశంగా కనిపించవచ్చు. నవలలో ఒక చోట, 'మన ముసల్మాన్ రాజు మనల్ని ఎలా రక్షిస్తున్నాడు? మన మతం పోయింది. మన కులం, గౌరవం, కుటుంబ పవిత్రత అన్నీ పోయాయి. ఈ మద్యం తాగిన పొడవైన గడ్డాలవారిని తరిమివేయకపోతే, హిందువుకు తన మతాన్ని రక్షించుకోవడం అసాధ్యం' అనే వ్యాఖ్యానాలు కనిపిస్తాయి.

నవల చివరి భాగంలో భావనంద తాను ఓడించిన ఆంగ్ల కెప్టెన్‌తో 'ఇంగ్లీషువారు మా శత్రువులు కాదు. మీరు ముసల్మాన్లకు మిత్రులుగా ఎందుకు వచ్చారు? ఇప్పటికి మీరు నా ఖైదీ. మేము ఇంగ్లీషువారికి శుభాకాంక్షలు తెలుపుతున్నాము... మేము మీ మిత్రులమే' అంటాడు. బిజెపిలోని కొంత మంది నాయకులకు అంతర్గతంగా ఆంగ్లాభిమానం ఎక్కువగా ఉందనే విమర్శలు ఉన్న కారణంగా, సహజంగానే ఇలాంటి మాటలు బిజెపిని కొంత ఇబ్బంది పెట్టవచ్చు. ఆనందమఠ్' చివరిలో మీర్ జాఫర్ సైన్యంతో 'సంతానులు' విజయం సాధించిన తర్వాత ఒక సన్యాసి గురువు ప్రత్యక్షమై, విప్లవాన్ని వాయిదా వేయాలని చెబుతాడు.' ఇంగ్లీషువారు భౌతిక శాస్త్రాల్లో గొప్పవారు, అలాగే వారు సమర్థ ఉపాధ్యాయులు. అందువల్ల ఇంగ్లీషువారిని మన సార్వభౌములుగా మార్చుకోవాలి. ఇంగ్లీషు విద్య ద్వారా భౌతిక శాస్త్రాల జ్ఞానం పొందినప్పుడు మన ప్రజలు ఆధ్యాత్మిక సత్యాలను గ్రహించగలుగుతారు. అప్పుడు సత్యమత ప్రచారానికి ఎలాంటి అడ్డంకులు ఉండవు. ఆ దశ వచ్చే వరకు ఇంగ్లీషు పాలనకు ఎలాంటి అంతరాయం ఉండదు. ఇంగ్లీషువారితో యుద్ధం చేయడం మానేసి నన్ను అనుసరించండి. ఇప్పుడు శత్రువు ఎక్కడున్నాడు? ఎవరూ లేరు. ఇంగ్లీషువారిని స్నేహపూర్వక శక్తిగా అంగీకరించాలి. వాస్తవానికి ఇంగ్లీషువారితో పోరాడి విజయం సాధించే శక్తి ఎవరికీ లేదు' అంటాడు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. బంకిమ్ చంద్ర మేజిస్ట్రేట్‌గా పనిచేసిన బ్రిటిష్ ప్రభుత్వ ఉద్యోగి. 1891లో 'రాయ్ బహదూర్' బిరుదు, 1894లో 'కంపానియన్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్' గౌరవం పొందారు. అందువల్ల ఆయన దేశభక్తి పూర్తిగా పారదర్శకమా? అనే అనుమానాలు తలెత్తవచ్చు.

ప్రస్తుతం ప్రాధాన్యత కొంతమేర తగ్గినట్టు కనిపిస్తున్న మన జాతీయ గీతం 'జన గణ మన'ను ఉదారవాదులు తరచు కింగ్ జార్జ్ Vకి ఆపాదిస్తుంటారు. ఆయనను శ్లాఘిస్తూ రాసిన గీతంగా పేర్కొంటూ ఉంటారు. అయితే 'జన గణ మన' రచయిత రబీంద్రనాథ్ ఠాగూర్, సుమారు తొమ్మిది దశాబ్దాల క్రితమే, 1937లో తన స్నేహితుడు పులిన్ బిహారి సేన్‌కు రాసిన లేఖలో ఆ ఆరోపణను ఖండించారు. రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఆంగ్లేయులతో సత్సంబంధాలు ఉండేవి. అదే నేరమైతే, బంకిమ్ చంద్రకు కూడా అదే సూత్రం వర్తించాలి కదా? జాతీయ గీతం 'జన గణ మన'ను మసకబరిచే ప్రయత్నం ఎంత వరకు సమంజసం? కాగా, 'వందే మాతరం' పూర్తి రూపంలో మొత్తం ఆరు చరణాలు ఉంటాయి. మొదటి రెండు చరణాలు భారతదేశ సహజ సౌందర్యాన్ని కీర్తిస్తుండగా, మిగతా నాలుగు రచణాలు దుర్గ, లక్ష్మీ, సరస్వతి వంటి హిందూ దేవతలను స్తుతిస్తాయి. లౌకిక దేశంలో ఇతర మతాల వారికి ఈ దేవతా స్తోత్రాలు వినిపించాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతుంది. మొత్తానికి, 'వందే మాతరం'ను ఈ విధంగా ప్రోత్సహించడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శకులు భావిస్తున్నారు. బహుళ సంస్కృతులు, మతాలు కలగలిసిన దేశంలో దేవతలను రాజకీయాలతో కలుపుతూ, దేశభక్తిని అధికార రాజకీయాల చివరి మజిలీగా మార్చే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పాలక పార్టీ 'వందే మాతరం' గేయాన్ని ప్రోత్సహిస్తున్న తీరు రాజకీయ గణకాలు.. గణాంకాల నేపథ్యంగానే కనిపిస్తున్నది. బహుళ సాంస్కృతిక దేశంలో దేవతలను రాజకీయాలతో మేళవించడం ద్వారా దేశభక్తిని అధికార వర్గాల చివరి ఆశ్రయంగా మార్చే ప్రమాదం ఉంది. భారత రాజ్యాంగ స్ఫూర్తికి... లౌకిక వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వ తీరు గొడ్డలిపెట్టు.

సిపి సురేంద్రన్
(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో)

# ఉపాధ్యాయుల సందేహాలకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

లేఖ

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఎంతో దోహదం చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో మండలస్థాయిలో తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ), విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశా లను నిర్వహించి సీనియర్ ఉపాధ్యాయుల సలహాలు, సూచనల ద్వారా విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలు సాధించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు,మండల డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, జిల్లా విద్యాశాఖాధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. పాఠశాలలు ప్రారంభం అయిన జూన్ నుండి ఫిబ్రవరి వరకు దాదాపు 9 స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. దాదాపు ఒక్కో సమావేశానికి 33 వేల రూపాయలు కేటాయిస్తున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అభ్యసనాభివృద్ధి(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రొగ్రాం) ఎల్.ఐ.పిలో భాగంగా ప్రాథమిక స్థాయి (బేస్ లైన్ టెస్ట్), మాధ్యమిక స్థాయి (మిడిల్ లైన్ టెస్ట్), అంత్య పరీక్ష (ఎండ్ లైన్‌టెస్ట్)లను నిర్వహించి ఆరు నుండి తొమ్మిదో తరగతుల విద్యార్థుల స్థాయి తెలుసుకొని సులభంగా వారి స్థాయికి తగినట్టు బోధన చేయడానికి అవకాశాలు ఉన్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యాశాఖ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేయడం వల్ల, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం ఎప్పుడులేని విధంగా వేసవి సెలవు ల్లో పంపిణీ చేయడం, అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట ప్రభు త్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో మరమ్మతుల కోసం నిధులను మంజూరు చేయడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలలో ఉచితంగా కంప్యూటర్‌లను పంపిణీ చేయడం, ఉచిత కరెంటు, ఇంటర్నెట్ ఇవ్వడం వలన ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలు ప్రయివేటు, కార్పోరేట్ పాఠశాలల మాదిరిగా తీర్చిదిద్ది ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంచడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మార్చి నెల 14వ తేదీనుండి జరుగనున్న పదవతరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీఈ) ఆధ్వర్యంలో టి.శాట్ లైవ్ కార్యక్రమాలలో అన్ని సబ్జెక్టులలో విషయ నిపుణుల చేత సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్యం గా తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ప్రథమ భాష తెలుగు, ద్వితీయ భాష తెలుగు పదవ తరగతి వార్షిక పరీక్షలను రాయనున్న పదవ తరగతి విద్యార్థులకు తెలంగాణ ఎస్సీ ఈఆర్టీఈ తెలుగు కోర్స్ డైరెక్టర్ మహ్మద్ యాసిన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తెలుగు భాషలో నిష్ణాతులైన పదవ తరగతి పాఠ్య పుస్తకాల రూపకల్పనలో పాల్గొన్న కవులను, రచయితలను, పదవ తరగతి విషయ నిపుణుల చేత విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలపై చక్కని అవగాహన కల్పించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల పరిధిలో వచ్చే అన్ని పాఠశాల ఉపాధ్యాయులు ఒక్కచోట చేరి చర్చించుకోవాలి. సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉపయోగపడుతున్నాయి. ఈ సమావేశా ల్లో ప్రతి ఉపాధ్యాయులు పాల్గొని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి తోడ్పాటు అందించాలి.

డాక్టర్ ఎస్. విజయ భాస్కర్



## 'సిఎం కప్' సబ్ జూనియర్ ఫుట్‌బాల్ విజేత మేడ్చల్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** గచ్చిబౌలిలో నిర్వహించిన సిఎం కప్ స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో మేడ్చల్ జిల్లా జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. ఫిబ్రవరి 20 నుండి 23 వరకు గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు జిల్లాల జట్లు పోటీపడ్డాయి. మేడ్చల్ జిల్లా జట్టు ఆటగాళ్లు ప్రారంభం నుంచే దూకుడుగా ఆడి ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం ప్రదర్శించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు.విజేత జట్టును అధికారులు, కోచ్‌లు, క్రీడా ప్రియులు అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్రం తరపున జాతీయ స్థాయి పోటీల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.



## హెల్మెట్ వినియోగంపై అవగాహన

**పజాపక్షం/చర్లపల్లి:** తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' క్యాంపెయిన్ 2026 ఫేస్2 కార్యక్రమంలో భాగంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇసిఐఎల్ సర్కిల్ వద్ద హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుషాయిగూడ ఎస్ఐ విజయ్, సిబ్బంది హాజరై ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. రైడర్ మాత్రమే కాకుండా పిలియన్ రైడర్ కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలనే చట్టపరమైన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 60 నుండి 70 మంది వాహనదారులకు ప్రత్యక్షంగా హెల్మెట్ వాడుకపై సరైన పద్ధతిని చూపించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో కుషాయిగూడ పోలీసులు తమ కట్టుబాటును తెలిపారు.



## ప్రజా సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ గ్రామంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 60 అడుగుల రోడ్ విస్తరణ పనులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆకుల సతీష్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కుత్బుల్లాపూర్ గ్రామమని, జనాభా పెరుగుదలతో పాటు వాహన రద్దీ కూడా పెరిగింది. అయితే రోడ్డు విస్తరణ పనులు సంవత్సరాలుగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే కొంతమంది భూస్వాములకు పరిహారం చెల్లింపులు జరిగినప్పటికీ, ఇంకా పలువురు అర్హులైన భూస్వాములకు పరిహారం అందలేదన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా పెండింగ్‌లో ఉన్న భూస్వాముల జాబితాను గుర్తించి, తక్షణం పరిహారం చెల్లింపులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నల్ల జైశంకర్‌గౌడ్, పులి బలరాం, అరుణ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, కంది శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



## బాక్స్ డ్రైవ్ నిర్మాణ పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ సత్తిరెడ్డి నగర్‌లో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రైవ్ నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు ఈ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సత్తిరెడ్డినగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, వినయ్ కుమార్, శాస్త్రి, మహేష్‌కుమార్, సునీల్, అశోక్ కుమార్, బల్వంత్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నా చెరువును సుందరీకరించాలి

### బిఆర్ఎస్ ఎల్పీ విప్ కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్:** ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా ఎన్నా చెరువుని సుందరీకరించాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అధికారులను ఆదేశించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్లలోని ఎన్నా చెరువు కంచె నిర్మాణ పనులను ఎమ్మెల్యే వివేక్ పరిశీలించారు. చెరువు చుట్టూ పర్యటించి సుందరీకరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ చెరువు చుట్టూ రోడ్డుని అభివృద్ధి చేసి, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. చెరువులో ఎగువ ప్రాంతాల నుండి వచ్చే మురుగు నీటిని కలవకుండా ప్రత్యామ్నాయ మార్గాలను తీసుకోవాలని చెప్పారు. ఎన్నా చెరువుని సుందరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించేలా అభివృద్ధి చేయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఇఇ రామకృష్ణ, డిఇ వీరారెడ్డి, ఎఇఇ నరేష్ పాల్గొన్నారు.

### పరువుకు భయపడి మౌనంగా ఉండొద్దు..

# ధైర్యంగా షీ టీమ్‌కు ఫిర్యాదు చేయండి

### హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెళ్లి ముసుగులో యువతులను మోసగిస్తూ, బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్య లు తీసుకుంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ ఎక్స్ వేదికగా హెచ్చరించారు. కేవలం ప్రేమ వ్యవహారాల్లోనే కాకుండా, పెద్ద లు కుదిర్చిన సంబంధాల మాటున కూడా నిశ్చితార్థం తర్వాత యువతులకు మాయమాటలు చెప్పి లొంగదీసుకోవడం, ఆపై అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న ఘటనలపై ఇటీవల హైదరాబాద్ షీ టీమ్స్ కు ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యువతులు, వారి తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**మోసం సాగుతోందిలా..**

ముందుగా పక్కా ప్రణాళికతో, సంప్రదాయబద్ధంగా పెళ్లి చూపులు, ఆపై ఘనంగా నిశ్చితార్థం చేసుకుంటున్నారు. 'ఇక పెళ్లి ఖాయమైంది కదా' అనే చనువుతో యువతులకు దగ్గరవుతున్నారు. 'ఎలాగూ పెళ్ళే కదా.. ఇప్పుడైతే ఏంటి?' అని మాయమాటలు చెబుతూ, ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తూ ఒత్తిడితో శారీరకంగా లోబరుచుకుంటున్నారు. తీరా కోరిక తీరాక అసలు రంగు బయటపెడుతున్నారు. పెళ్లి పీటలు ఎక్కాలంటే తమకు భారీగా డబ్బు కావాలని, అదనపు కట్నం ఇస్తేనే తాళి కడతామని డిమాండ్ చేస్తున్నారు.

లేదంటే పెళ్లి రద్దు చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. నిశ్చితార్థం జరిగిపోవడం, బంధుమిత్రులందరి కీ తెలిసిపోవడంతో.. ఇప్పుడు పెళ్లి ఆగిపోతే సమాజంలో పరువు పోతుందన్న భయంతో చాలామంది యువతులు, వారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీన్నే ఆసరాగా చేసుకుంటున్న నయవంచకులు మరింతగా వేధింపులకు గురిచేస్తున్నారు. 'పరువు పోతుందన్న భయంతో మౌనంగా ఉంటే..జీవితాంతం నరకం అనుభవించాల్సి వస్తుంది. కాబట్టి ఎవరూ భయపడకుండా ధైర్యంగా ముందుకు రావాలి' అని సిపి స్పష్టం చేశారు.

**ఇవి గుర్తుంచుకోండి..**

పెద్దలు కుదిర్చిన సంబంధమే కదా అని గుడ్డిగా నమ్మొద్దు. అబ్బాయి ప్రవర్తన, స్నేహితులు, అలవాట్లపై పెళ్లికి ముందే క్షుణ్ణంగా ఆరా తీయాలి. నిశ్చితార్థం జరిగినప్పటికీ, పెళ్లి పీటలు ఎక్కేవరకు అప్రమత్తంగానే ఉండాలి.

పెళ్లికి ముందే ఏకాంతంగా కలవడానికి, శారీరక సంబంధానికి ఒత్తిడి చేస్తే కచ్చితంగా అనుమానించాలి. వారి ప్రయత్నాలను మొహమాటం లేకుండా తిరస్కరించాలి.

**డబ్బు డిమాండ్ చేసినా, బ్లాక్ మెయిల్ చేసినా భయపడొద్దు**

మోసగాళ్ల చేతిలో చిక్కుకుంటే సంకోచించకుండా పోలీసులను ఆశ్రయించండి. బాధితుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతాం. ఇలాంటి బెదిరింపులు ఎదురైతే వెంటనే హైదరాబాద్ షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 94906 16555కు గానీ, డయల్ 100కు గానీ కాల్ చేసి ఫిర్యాదు చేయాలి.



## ఢిల్లీ డిఫెన్స్ మద్యం బాటిళ్ల పట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎపి సంపర్క్ క్రాంతి రైల్లో ఢిల్లీకి చెందిన మద్యం బాటిళ్లను తీసుక వస్తున్నారనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ బి టీమ్ సిఐ బిక్షారెడ్డి, ఎస్ఐ బాలరాజు సిబ్బందితో పాటు ఆర్‌పిఎఫ్, జిఆర్‌పిఎఫ్ పోలీసులు కలిసి కాచిగూడ రైల్లో తనిఖీలు నిర్వహించారు.
ఢిల్లీలో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్న ఎపికి చెందిన శివ అనే వ్యక్తి ఈ మద్యం బాటిళ్లను హైదరాబాద్‌కు తీసుకు వస్తున్నానట్లు గుర్తించారు. నిందితుడి వద్ద రూ.1.40 లక్షల విలువైన 70 ఢిల్లీ డిఫెన్స్ మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లను, నిందితుడు శివను కాచిగూడ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సిఐ బిక్షా రెడ్డి తెలిపారు

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య

**ప్రజాపక్షం/వికారాబాద్:** మున్సిపల్ జరుగుతున్న పారిశుద్ధ్య పనులను తెల్లవారు జామున4.30గంలకు చైర్‌పర్సన్ అనన్య ఆకస్మాత్తుగా పట్టణంలోని ప్రధాన రహదారితో పాటుగా వివిధ కాలనీలలో పర్యటించి జరుగుతున్న పనులను పరిశీలిస్తూ కార్మికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వికారాబాద్ పట్టణం పరిశుభ్రంగా ఉండాలి అన్ని ప్రాంతాలను శుభ్రంగా ఉంచే బాధ్యత కార్మికుల



పైన ఉన్నదన్నారు. మీకు కావలసిన సదుపాయాలు, సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటాను, మీకు పని ప్రదేశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను అదేశాలు జారిచేస్తామన్నారు. అదే సమయంలో మీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి సక్రమంగా విధులకు హాజరై పురపాలక సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ కోరారు.

## ప్రజావాణిలో 150 అర్జీలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 150 అర్జీలను దరఖాస్తుదారులు అధికారులకు సమర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, జిల్లాలా అధికారి జి చంద్రావతి, డిఆర్ఒ హరిప్రియతో కల్సి అర్జీలను స్వీకరించా రు. అనంతరం వారితో పాటు ఉన్న వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులను అర్జీలను సత్వరమే పరిష్కరించాలని వారు ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీల కు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించలేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.

**మల్కాజిగిరి జిహెచ్‌ఎంసి కమిషనరేట్‌లో...**

మల్కాజిగిరి నగర పాలిక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వివిధ విభాగాధిపతులతో కల్సి ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణ విభాగానికి సంబంధించి 13, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 09, పారిశుధ్యానికి ఒకటి, వీధి దీపాలకు సంబంధించి ఒకటి, ఎంటమాలజీ విభాగానికి సంబంధించి ఒకటి ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించాలి

### మల్కాజిగిరి జిహెచ్‌ఎంసి అడిషనల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే మర్రి వినతి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కోరారు. సోమవారం ఆయన జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి అడిషనల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కల్సి పలు అవసరమైన పనులను వివరించారు. ఎఐసి రోడ్ల నిర్మాణం, సిఆర్‌ఎంపి కింద రోడ్ల నిర్మాణం, మచ్చ బొల్లారం డివిజన్‌లోని ఏడు కాలనీలకు సంబంధించి ట్రంక్ మెయిన్ నిర్మాణం, చెరువుల ఆధునీకరణ, పరిరక్షణ చర్య లు, పల్లవి విల్లా అపార్ట్‌మెంట్ వాసులకు మేలు కలిగే విధంగా ఆర్‌కె పురం ఫ్లైఓవర్ నిర్మాణానికి రీ అలైన్‌మెంట్, డిఫెన్స్ భూమిలో నివసిస్తున్న 16 మంది పేద కుటుంబీకులకు డబుల్ బెడ్ రూంల కేటాయింపు, అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు పూర్తి చేయటం, మచ్చ బొల్లారం డివిజన్‌లోని హిందూ స్మశాన వాటిక ను పరిరక్షించి అక్కడ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును తొలగిస్తూ మౌలిక వసతులను కల్పించటం, జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులను నియమించటం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత, జగదీష్‌గౌడ్, బిఆర్ఎస్ శ్రేణులు అనీల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కరణ్‌కోట్‌లో వ్యక్తి దారుణ హత్య

**ప్రజాపక్షం/తాండూరు:** కరణ్ కోట్ గ్రామం లో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన సోమవారం జరిగింది. కరణ్‌కోట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాండూరు మండ ల పరిధి కరణ్‌కోట్ గ్రామానికి చెందిన దప్పు సాయిలు (45)పై అదే గ్రామానికి చెందిన బైండ్ల బాలప్ప కత్తి తో దాడిచేసి దారుణ హత్య చేశారు. కరణ్ లేబర్ కాలనిలో దప్పు సాయిలు టెంట్ హౌజ్ నిర్వహిస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. కరణ్‌కోట్ గ్రామంలో



హత్య జరిగినట్లు తెలుసుకున్న కరణ్‌కోట్ పోలీసు లు అక్కడి చేరుకుని నిందితుడైన బైండ్ల బాల్లప్ప ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతుడి దప్పు సాయిలు మృతదేహాన్ని పోస్టు మార్టు నిమిత్తం తాండూరులోని జిల్లా ఆసుపత్రికి తరలించిట్లు తెలిపారు. నిందితుడుని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ అనంతరం వివరాలను తెలియ జేస్తామని తెలిపారు.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/వికారాబాద్:** ఇంటర్ పరీక్షల కు సర్వం సిద్ధం చేసినట్లుఇంటర్ మీడియ ట్ నోడల్ అధికారి శంకర్ తెలిపారు. ఈ నెల 25నుండి ఇంటర్ పబ్లిక్ థియరీ పరీక్షలునిర్వహిస్తామని జిల్లా అధికారి తెలిపా రు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 25 నుండి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పిబ్రవరి 26 నుండి ఇంటర్ పబ్లిక్ థీయరి పరీక్షలు తెలంగాణ ఇంటర్ బోర్డు ప్రకటించిన షెడ్యుల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 6708 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1686మంది ఇంటర్ ద్వితీయ జనరల్ విద్యార్థులు 6549, ఒకేషనల్ విద్యార్థులు 1457 మంది ఈ పరీక్షలు హాజరు కానున్నరు. మొదటి సంవత్సర విద్యార్థులు మొత్తం 8394 మంది, ద్వితీయ సంవత్సరంలోమొత్తం 8006మంది హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా 28 థియరీ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్ష కేంద్రాల్లో త్రాగునీరుతో పాటు మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. పరీక్షలు ఉదయం 8గంటల నుండి పరీక్ష కేంద్రానికి చేరుకునేలా విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు.
తెలంగాణ రాష్ట రోడ్డు రవాణా సంస్థ పరీక్ష సమయంలో బస్సుల ను ఏర్పాటు చేస్తుందన్నారు. విద్యార్థులను ఉదయం 9.05నిమిషాలకు వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. సీసీకెమెరాలను తెలంగాణ ఇంటబోర్డు కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయడం జరిగిందన్నారు.

## ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల విద్యార్థులకు సంబంధించి ఉపకార వేతనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటి కోసం ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు సంబంధించిన దరఖాస్తులు తమ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి టి.ఝాన్సి రాణి సూచించారు. సంబంధిత ధృవీకరణ పత్రాలను జతపరచాల్సి ఉంటుందన్నారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పద్ధతి కింద నమోదు చేసుకొన్న విద్యార్థుల ధరఖాస్తులను వారి ఆధార్ నంబర్ లింక్ ఉన్న బ్యాంక్ ఖాతా వివరాలను www.npci.org.in ద్వారా పొందుపరచాలని తెలిపారు.



## ఫ్లాట్ల కబ్జాలను అరికట్టాలి

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట్ రాజీవ్ గృహ కల్పలో జరుగుతున్న ఫ్లాట్ల కబ్జాలను అరికట్టాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం అన్నారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో సిపిఐ నేతలు నిజాంపేట్ రాజీవ్ గృహ కల్పలో జరుగుతున్న అవినీతి, కబ్జాలను అరికట్టాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు ఏసురత్నం, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ నిజాంపేట్ రాజీవ్ గృహ కల్పలో సుమారు 50 ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని కొందరు కబ్జా చేసి పబ్బం గడుపుకుంటున్నారని వివరించారు. రాజీవ్ గృహకల్పలోని యాభై ఫ్లాట్లను నిరుపేదలకు అందించాలని కోరారు. రాజీవ్ గృహకల్పకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో ప్రజల సౌకర్యార్థం స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బక్క మల్లేష్, పొన్నకంటి దస్తగిరి పాల్గొన్నారు.



## క్రీడల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని ఎస్ఎస్ఆర్ పాఠశాల 4వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని స్వాగతోపన్యాసంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ జాం రవి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని చెప్పారు. చిన్నారుల ప్రతిభను గుర్తించి వారిని ఆయా రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు నీరజ్‌గౌడ్, అజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, స్కూల్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, డైరక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ రాధిక, అధ్యాపకులు, చిన్నారులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## లేబర్ అడ్డాలో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/కుత్బుల్లాలపూర్ :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సోమవారం కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని అస్బెస్టాస్ కాలనీ లేబర్ అడ్డా వద్ద కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి పరమేశ్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు యాదగిరి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట స్థాయి పోలీస్ క్రీడల్లో వికారాబాద్‌కు 15పతకాలు : ఎస్‌పి స్నేహమెహ్రా

**ప్రజాపక్షం/వికారాబాద్:** రాష్ట స్థాయిలో క్రీడల్లో వికారాబాద్ పోలీస్‌లు 15పతకాలుస్వాధీనం చేసుకున్న క్రీడకరులనుఅభినందించారు. సైబరాబాద్ వేదికగా నిర్వహించిన 4వ తెలంగాణ రాష్ట పోలీస్‌గేమ్స్ స్పోర్ట్స్ మీట్ 2026లో చార్మినార్ జోన్ తరపున పాల్గొని ,అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన వారిని అభినందించారు. ముఖ్యంగా అథ్లెటిక్స్ విభాగంలో కె.స్వాతి హజంప్ లో బంగారం పతకం సాధించిన జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. విజేతలను ఉద్దేశించి ఎస్పి మాట్లాడుతూ నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణలో బీజీగా ఉంటు విధి నిర్వహణలో ఎంతో ఒత్తిడి ఎదుర్కుంటున్నాప్పటికి క్రీడల పట్ల మక్కువతో సమయం కేటాయించిపతకాలు సాదించడం నిజంగా గర్వకారణం అన్నారుపోలీస్ అధికరులు వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు క్రీడకారులుగా పోటీ పాటి గేలువడం గోప్పవిషయం అన్నారు.

## పారిశుద్ధ్య పనులు పరిశీలించిన కమిషనర్

**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి సర్కిల్ పరిధిలోని పారిశుద్ధ్య పనులను సిఎంసి, కమిషనర్ జి.సృజన పరిశీలించారు. కొంపల్లి సర్కిల్ పరిధిలో విస్తృత పర్యటన నిర్వహించి పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా నగరంలో పరిశుభ్రత ప్రమాణాలను మెరుగుపరచాలని ఎస్ డబ్ల్యు ఎం అధికారులకు ఆదేశాలు జారీ చేసి, దుకాణ యజమానులు తప్పనిసరిగా చెత్త బుట్టల ను ఏర్పాటు చేసుకుని తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణా రెడ్డి అధికారులతో కలిసి శ్రీనివాస్ కాలనీ, జయభేరి కాలనీ ప్రాంతాలను సందర్శించారు. ఇంటింటికీ, దుకాణాల వద్దకు వెళ్లి ప్రజలకు, వ్యాపారులకు చెత్తను వేరు చేయడం నిర్ణీత సమయంలో వచ్చే ఎస్ఎటి వాహనంలోనే వేయాలని, రోడ్లపై లేదా ఖాళీ ప్రదేశాలలో పారవేయకూడదని సూచించారు. పారిశుద్ధ్య నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. నగర పరిశుభ్రతలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇఇ తిరుపతి, ఎఇఇ కృప, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** చేవెళ్ల గుడిసెల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, శంకర్‌పల్లిలో గుడిసెలు వేసుకున్న పేదవారందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ చేవెళ్ల నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ చేవెళ్ల సర్వే నెంబరు 75లోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూములు 2022 లో నియోజకవర్గంలోని నిరుపేదలందరూ కలిసి సిపిఐ జెండా పట్టుకొని గుడిసెలు వేసుకుని నాలుగు సంవత్సరాలు అయినా నేటికీ పట్టాలు ఇవ్వలేదని, వారందరికీ ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, నివాసం ఉండే గుడిసెల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా శంకర్‌పల్లి మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 500 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు. కానీ వారికి నేటికీ స్థలాలు చూపించలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకోవడం కాదు, చిత్తశుద్ధి ఉంటే చేవెళ్ల పట్టణంలో పేదలు గుడిసెలు వేసుకొని నాలుగు సంవత్సరాలుగా ఇంటి స్థలం సర్టిఫికెట్ కోసం ఎదురు చూస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోకిలా పొన్నగుట్ట తండాలో గిరిజన రైతుల భూములను ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్న ప్రభుత్వం వారికి కేటాయించాల్సిన 800 గజాల స్థలాన్ని ఇవ్వకుండా, వీరి పేరుతో ఉన్న భూమికి సంబంధం లేని వ్యక్తులకు ఎంజాయ్మెంట్ సర్వేలో వారి పేర్లను చేర్చి అసలైన గిరిజన రైతులకు అన్యాయం చేయడం తగదని, తక్షణమే ఒరిజినల్ రైతుల పేర్లను జాబితాలో చేర్చి ఎనిమిది వందల గజాల స్థలాన్ని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు, సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, ధర్నాకు అధ్యక్షత వహించిన సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.రామస్వామి మాట్లాడుతూ పేదలకు న్యాయం జరిగే వరకు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్నిహెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభలింగం, వడ్ల సత్యనారాయణ, బాతరాజు నరసింహ, సిపిఐ చేవెళ్ల మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి శ్రీనివాస్, శంకర్‌పల్లి మండల కార్యదర్శి పి.సుధీర్, జిల్లా సమితి సభ్యులు మంజుల, సుధాకర్‌గౌడ్, సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పసిబిడ్డ మరణానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు

బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య డిమాండ్

**ప్రజాపక్షం/కొందుర్గు:** పసిబిడ్డ మరణానికి కారకులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ప్రభుత్వాన్ని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా జరిగిన ఘర్షణలో పసిపాప మృతి చెందడం విషాదకరమన్నారు. ఈ సంఘటనపై పోలీసులు, ప్రభుత్వం నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

## మెరుగైన వైద్యం అందించాలి



**ప్రజాపక్షం/యాచారం :** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలని యాచారం గ్రామ సర్పంచ్ మస్కు అనిత శరణం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సిహెచ్‌సి ఆసుపత్రిని అకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో వసతుల గురించి, రోగుల పరిస్థితి వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలు ప్రవేటు ఆసుపత్రికి వెళ్ళి వైద్యం చేయించుకునే స్థోమత లేక ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారు వారికి వైద్యం అందించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండేంట్ డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శాంతికుమారి, వార్డు సభ్యులు సాజీద్ బాయి, జోగు అంజయ్య, కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షులు మస్కు నర్సింహ్మ, నాయకులు మస్కు రమేశ్, చింతుల్ల సాయిలు పాల్గొన్నారు.

**వీధికుక్కల దాడిలో నలుగురికి గాయాలు....** మండల కేంద్రంలో వీధికుక్కల దాడిలో నలుగురికి గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. వీధికుక్కల దాడిలో గాయపడిని చిన్నారిని స్థానిక ఆస్పత్రిలో సర్పంచ్ పరామర్శించారు. వైద్యాధికారులు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## సిసి రోడ్డు పరిశీలన



**ప్రజాపక్షం/కేశంపేట:** షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు మండలంలోని లేమామిడి గ్రామంలో రాజ్యాంగ స్తూపం నుంచి నిర్ధవెళ్ళి వెళ్లే రోడ్డు, బర్కం కృష్ణయ్య ఇంటి వరకు ఎఇ హేమంత్ సిసి రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో కిషన్, బి.రమేష్, ఏసోబ్, బెండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి వైపు అడుగులు

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానించిన జెఎసి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్‌లను తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు సన్మానించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో తాలుకా జెఎసి చైర్మన్ ఎం.జనార్ధన్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, గ్రంథాలయ వైస్ చైర్మెన్ నక్క బాల్‌రాజ్ యాదవ్, బాదేపల్లి సిద్ధార్థ, అర్జునప్ప, టెలిఫోన్ వెంకటయ్య, హెల్త్ ఎడ్యుకేటన్ జె.శ్రీనివాసులు, గోర్ల రాము, అర్టీసి అర్జున్‌కుమార్, వీరమల్లు బాలస్వామి, ఎర్ర నర్సింలు, భీష్వ కృష్ణయ్య, మందారం నరింహులు, రాజేష్‌లు పాల్గొన్నారు.

## ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** నిరుపేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సదున్వియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని గ్రామ సర్పంచ్ మంద యాదమ్మ సూచించారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మంఖాల శేఖర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి రవి, నాయకులు శివశంకర్, రాజు యాదగిరి, మహేందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ది అరాచక పాలన : బిజెపి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** కాంగ్రెస్ ప్రభుత్వానిది అరాచక పాలన అని తుర్కయంజాల్ బిజెపి అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి నివాసంపై కాంగ్రెస్ గూండాలు జరిపిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. సోమవారం బిజెపి తుర్కయాంజల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో తుర్కయాంజల్ కూడలిలో సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి, నిరసన తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపెల్లి ప్రతాప్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయించడం పిరికిపంద చర్య అని మండిపడ్డారు. ఎమ్మెల్యేకు మద్దతు తెలపడానికి వెళ్తున్న బిజెపి నాయకులను హౌస్ అరెస్టులు చేయడం కాంగ్రెస్ భయానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా కాటిపల్లి వెంకటరమణారెడ్డికి అండగా నిలబడతామన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కొత్త రాంరెడ్డి, కరాడి అనిల్, కొంద్రు పురుషోత్తం కందడ బల్దేవ్‌రెడ్డి, సురేష్, రవీందర్‌రెడ్డి, దాస్, జ్ఞానేశ్వర్ , భిక్షపతి, మధు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధ

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని, వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె శ్రీనివాస్ అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి డిఆర్ఒ సంగీతతో కలిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా అధికారులు పని చేయాలని, ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని తెలిపారు. ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్‌ను సోమవారం ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం జిల్లాలోని మహిళా ఉద్యోగులకు మార్చి నెల 4న హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఆటలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి మహిళలకు ప్రత్యేక అనుమతి ఇప్పించాలని, మార్చి 7న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడానికి అనుమతినివ్వాలని కలెక్టర్‌ను డిఆర్ఒ ద్వారా వినతి పత్రాన్ని సమర్పించారని రంగారెడ్డి జిల్లా టిజిఒ కమిటీ ఆధ్వర్యంలో కోరారు. కార్యక్రమంలో టిజిఒ నాయకులు శాంతిశ్రీ, రేవతి, అలివేలు, మహేశ్వరి, సైదమ్మ, బాలేశ్వరి, డా.నరేందర్, మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్ డివిజన్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి : కొప్పుల



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** పాత మన్సూరాబాద్ డివిజన్ అభివృద్ధికి నిధులు ఇచ్చి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కోరారు. సోమవారం తార్నాక పాత హెచ్‌ఎండిఎ కార్యాలయంలో మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కొప్పుల నర్సింహ్మారెడ్డి కలిసి పూల మొక్కను అందజేసి వారికి శుభాభివందనాలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ మన్సూరాబాద్ సహారా ఎస్టేట్స్ రోడ్డు నుండి కామినేని హాస్పిటల్ వెళ్లే మార్గం రద్దీగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఉప్పల్, నాగోల్, ఎల్బీనగర్ జంక్షన్ ఇంప్రూవ్మెంట్‌తో పాటు 100 ఫీట్ల రోడ్డును నిర్మించే ప్రయత్నం చేయాలని కోరారు. హయత్ నగర్ బొమ్మల గుడి రోడ్ నుండి డబల్ బెడ్ రూమ్ వర్క్ ఉన్న దాదాపు 20 కాలనీలకు అనుసంధానంగా ఉండే రోడ్డు పనులు, పాతమన్సూరాబాద్ డివిజన్‌లోని పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరారు.

## పంట పొలాల్లో అడవి పశువుల బెడద

నివారించాలని ప్రజావాణిలో బండలేమూర్ గ్రామస్తుల వినతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా బండలేమురు గ్రామంలో అడవి పశువులు ఎక్కువై రైతుల పంట పొలాలను నాశనం చేస్తున్నాయని, వాటిని తక్షణమే అక్కడ నుంచి తరలించాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జరిగి ప్రజావాణిలో బండలేమూర్ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పోచమోని కృష్ణ మాట్లాడుతూ గ్రామం పరిసర ప్రాంతంలో పశువుల బెడద ఎక్కువైందని, దీని కారణంగా రైతులు పంటలను పండించుకునే పరిస్థితి లేకుండా అయిందన్నారు. గ్రామంలోని అనేక మంది రైతులు తమ పంట పొలాల్లో పశువుల బెడదతో పంటలు వేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పది సంవత్సరాలుగా పంటలు వేసుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పశువుల బెడద నుండి పంటలను కాపాడుకోవడానికి రాత్రనకా పగలనకా కాపు కాసిన రక్షణ లేకుండా పోతుందన్నారు. తమ పొలాల్లో పంటలు వేయకుండా బీడులుగా మారి ప్రభుత్వం నుంచి వచ్చే రైతు భరోసా పథకం కూడా వర్తించడం లేదన్నారు. రైతు భరోసా అందకపోయినా కనీసం పంట పండించుకొని పూట గడుపుకుందామన్న పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పశువులను తరలించాలని పలుమార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. యాసింగులో కొద్దిపాటి వరి నాట్లను వేసుకోవడం జరిగిందని, వేసిన కొద్ది రోజుల్లోనే వరిచేలను పశువులు మేసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పశువులను ఇక్కడినుండి తరలించి ఇతర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వ అధికారులు తరలించని యెడల రైతులు తరలించుకోవడానికి అనుమతి ఇస్తే వాటిని తరలిస్తామన్నారు. కార్యక్రమంలో బండలేమూర్ మాజీ వార్డ్ మెంబర్ జాపాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ

బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్నీ ఖూనీ చేసిందని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ఒక్క కౌన్సిలర్ గెలిచినా అమన్‌గల్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చైర్మన్ అయ్యారని విమర్శించారు. సోమవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో బిజెపి, కాంగ్రెస్ పార్టీల నేతలు పెద్ద ఎత్తున సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. మునిసిపల్ ఎన్నికల్లో బిజెపి నుంచి పోటీ చేసిన వాసుదేవ్ కన్నా, శ్రీకాంత్ రెడ్డి, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన సయ్యద్ అఫ్సర్, బుల్కాపూర్ బిజెపి నాయకులు రాంమోహన్‌రెడ్డి, బుల్కాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ తదితరులు పెద్ద ఎత్తున తమ అనుచరులతో సబితారెడ్డి సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు వేసి బిఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించిన అనంతరం జరిగిన సభలో సబితా ఇంద్రారెడ్డి మాట్లాడారు. శంకర్‌పల్లి మునిసిపల్ లో కేవలం వేయి ఓట్ల తేడా మాత్రమే ఉందన్నారు. ఇబ్రహీంపట్నంలో స్పష్టమైన మెజారిటీ ఉన్న బిఆర్‌ఎస్ అభ్యర్థి చైర్మన్‌గా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. పరిగిలో ఇదే విధంగా చేశారన్నారు. జిల్లాలో అధికార పార్టీకి చెందిన 54 మంది కౌన్సిలర్‌లు గెలిస్తే 47 మంది బిఆర్‌ఎస్ తరుపున గెలిచారని, మరో 15 చోట్ల స్వల్ప తేడాతో బిఆర్‌ఎస్ అభ్యర్థులు ఓటమి చెందారన్నారు. పార్టీ శ్రేణుల పోరాట పటిమకు సబితారెడ్డి అభినందనలు తెలిపారు. రానున్న ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, సర్పంచ్ లను సన్మానించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీలు వి.సత్యనారాయణ, డి.గోవర్ధన్ రెడ్డి, ఎం.చిన్న నర్సింలు, మాజీ జడ్పీటీసీ నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు రాజు నాయక్, మాణిక్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సర్పంచ్‌లు రాఘవేందర్‌రెడ్డి, నివేదిత ఇంద్ర సేన రెడ్డి, పాపారావు, అర్చన ప్రభూ గౌడ్, మల్లికార్జున్, మాజీ సర్పంచ్ బి.శ్రీధర్, సత్యనారాయణ, సుధాకర్, శంకర్ నాయక్, శ్రీకాంత్, హన్మంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కౌన్సిలర్‌లు ఉషాకిరణ్ విజయ్, బానూరి కృష్ణ, నాయకులు ముంతాజ్, శ్రీనివాస్‌గౌడ్, వి మహేష్, వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్, రాజ్‌కుమార్, శ్రీనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

## వేగం కన్నా సురక్షిత ప్రయాణం ముఖ్యం

ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ ట్రాఫిక్ డిసిపి శివమ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రహదారులపై వాహనాలను సురక్షితంగా నడిపి క్షేమంగా గమ్యం చేరుకునేందుకు కృషి చేయాలని ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ ట్రాఫిక్ డిసిపి శివమ్ (ఉపాధ్యాయ ఐపిఎస్) అన్నారు. సోమవారం షాద్‌నగర్‌లో రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్, అభయ్ సారథి కార్యక్రమాన్ని ట్రాఫిక్ పోలీస్, లా అండ్ ఆర్డర్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి చూపుపై ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా మహేశ్వరం ట్రాఫిక్ ఏసిపి చంద్రశేఖర్, షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ, ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్, పట్టణ సిఐ విజయ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిపి శివమ్ మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం ముఖ్యమని భావించి వాహనాలను జాగ్రత్తగా నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో టోల్గేట్ ఇన్‌చార్జి ఇబ్రహీం, ట్రాఫిక్ పోలీసులు, రాజకీయ పార్టీల నేతలు శ్రీనివాస్, సురేష్, రామకృష్ణతోపాటు డ్రైవర్లు పాల్గొన్నారు.




## యాచారం చేరిన బౌద్ధ భిక్షువుల పాదయాత్ర



**ప్రజాపక్షం/యాచారం :** బౌద్ధ బిక్షువుల దమ్మ పాదయాత్ర సోమవారం యాచారానికి చేరింది. బుద్ధ భగవానుని పవిత్ర అస్థికలతో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పాదయాత్ర కర్నాటకలోని గుల్బర్గా సిద్ధార్థ విహార్ నుండి తెలంగాణ బుద్ధవనం నాగార్జున సాగర్ వరకు 450 కిలో మీటర్ల వరకు పాదయాత్ర సాగుతుంది. ఫిబ్రవరి 2 న ప్రారంభం అయింది, మార్చి 3న పాదయాత్ర ముగుస్తుంది. యాచారం వచ్చిన బౌద్ధ భిక్షువులకు బహుజనులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో యాచారం గ్రామ సర్పంచ్ అనిత శరణం, కాశిమల్ల యాదయ్య, సువర్ణ, బుగ్గయ్య, వార్డు సభ్యులు సాజిద్,మస్కు రమేశ్, యాదయ్య పాల్గొన్నారు.

## పల్లె ప్రగతికి మొదటి ప్రాధాన్యం : ఎమ్మెల్యే శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పల్లె ప్రగతికి మొదటి ప్రాధాన్య ఇవ్వడంతోపాటు ప్రభుత్వం నుంచి రూ.10కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడంతోపాటు సిసిరోడ్లకు మోక్షం కల్పించడంతోపాటు మహిళా సమాఖ్య, అంగన్‌వాడీ, కమ్యూనిటి హాళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టి గ్రామాలను కలిపించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు పాఠశాల ల మరమ్మత్తులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలోని తొమ్మిదవ వార్డును అభివృద్ధి చేసేందుకు రూ.7కోట్ల నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో బిజెపి కౌన్సిలర్ ప్యాట అశోక్ ఎమ్మెల్యేను కలిసి వార్డులో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పార్టీలకు అతీతంగా తొమ్మిదవ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. చైరన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మెన్ అందె మోహన్‌లను మర్యాపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు బాబర్‌ఖాన్, బసవేశ్వర్, రఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, బాల్‌రాజ్ గౌడ్, జాకారం శేఖర్ పాల్గొన్నారు.



### పకడ్బందీగా పంట వివరాల నమోదు

పంట నమోదులో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పకడ్బంధీగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారులు వాలంటీర్ల సహాయంతో గ్రామాల్లోకి వెళ్ళి పంటల నమోదు చేయాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని, ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌తో రైతులకు ఇబ్బందులు రాకుం డా చూసుకోవాలన్నారు. యూరియా కొరత లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఎడిఎ రమాదేవి, ఫరూఖ్‌నగర్ వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్‌తోపాటు వివిధ మండలా అధికారులు పాల్గొన్నారు.

# భారీ ఓటమితో మైనస్‌లో టీమిండియా..

## సెమీస్ బెర్తుపై ఉత్కంఠ !





లీగ్ దశలో ఓటమెరుగని భారత జట్టు కీలకమైన సూపర్–8లో మాత్రం ఘోరంగా విఫలమైంది. దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్ జోరుకు కళ్లెం వేసి.. మధ్యలో పట్టు సడలించి.. ఆఖర్లో పంజా విసిరిన టీమిండియా.. ఛేదనలో మాత్రం తేలిపోయింది. 188 పరుగుల లక్ష్యాన్ని ఉఫ్ మనిపిస్తుందనుకుంటే.. సమిష్టి వైఫల్యంతో సఫారీలకు సరెండరైంది. ఊహించని విధంగా సూర్యకుమార్ యాదవ్ సేన పోరాడకుండానే మ్యాచ్‌ను అప్పగించేసిందనే బాధ అభిమానులను వెంటాడుతోంది. 76 పరుగుల తేడాతో ఓడిన కారణం గా నెట్ రన్‌రేట్ మైనస్‌లో ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్ సెమీస్ చేరడంపై సందిగ్ధం నెలకొంది. గ్రూప్–ఎ నుంచి టాపర్‌గా సూపర్–8లో అడుగుపెట్టిన భారత జట్టును నేలకు దించింది దక్షిణాఫ్రికా. ప్రస్తుతం భారత్ నెట్‌కన్ రేట్ మైనస్(3.800)లో ఉంది. చివరి రెండు మ్యాచుల్లో భారీ తేడాతో భారత్ గెలిస్తేనే సెమీస్ అవకాశాలుంటాయి. ఫిబ్రవరి 26న చిదంబరం స్టేడియంలో జింబాబ్వేతో.. మార్చి 1న వెస్టిండీస్‌తో సూర్యకుమార్ సేన తలపడనుంది. ఈ రెండు జట్లను ఓడిస్తే నాలుగు పాయింట్లతో టీమిండియా రేసులో ఉంటుంది. కానీ, లీగ్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంకను ఓడించిన జింబాబ్వేను తక్కువ అంచనా వేయడానికి లేదు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ కెప్టెన్ సికిందర్ రజా.. పేసర్లు ముజరబని, ఎవాన్స్, స్పిన్నర్ గ్రీవ్స్ సూపర్ ఫామ్లో ఉన్నారు. సెమీస్‌పై కన్నేసిన ఆఫ్రికా జట్టును ఓడించడం అసాధ్యమని చెప్పలేం కానీ.. సమిష్టిగా రాణిస్తేనే అది సాధ్యమవుతుంది.

అలానే.. వెస్టిండీస్ సైతం సమిష్టిగా రాణిస్తూ మాతో కష్టమే అని హెచ్చరికలు పంపుతోంది. షాయ్ హోప్ సారథ్యంలో ప్రమాదకరంగా పరిణమిస్తున్న విండీస్.. మూడో కప్ వేటలో పక్కాగా ఆడుతోంది. లీగ్ దశలో ఇంగ్లాండ్‌ను ఓడించిన కరీబియన్ జట్టుపై భారత్‌పై మెరుగైన రికార్డే ఉంది. సో.. కచ్చితంగా ఓడిస్తేనే టీమిండియాకు సెమీస్ అవకాశాలుంటాయి. రెండుకు రెండు గెలవడమే కాకుండా దక్షిణాఫ్రికా తదుపరి మ్యాచ్‌ల ఫలితాలు కూడా కీలకం కానున్నాయి. జింబాబ్వే, వెస్టిండీస్‌తో సఫారీ టీమ్ ఓడాలి. అప్పుడు సూర్యకుమార్ సేన సెమీస్ బెర్తుకు దగ్గరవుతుంది. ఒకవేళ.. సఫారీ టీమ్ రెండు మ్యాచుల్లోనూ గెలిస్తే.. గ్రూప్–ఎ నుంచి రెండో స్థానం కోసం జింబాబ్వే, విండీస్, భారత్ మధ్య తీవ్ర పోటీ నెలకొంటుంది.

### బెడిసికొట్టిన సుందర్ ప్రయోగం!

డిఫెండింగ్ ఛాంపియన్‌గా టి–20 వరల్డ్ కప్ బరిలో నిలిచిన భారత జట్టు అంచనాలకు తగ్గట్టే లీగ్ దశను అజేయంగా ముగించింది. నాకౌట్‌లోనూ దక్షిణాఫ్రికాను చిత్తు చేస్తుందని అందరూ అనుకున్నారు. ఎందుకంటే.. ప్రపంచ కప్‌లో సఫారీలపై 52 విజయాల రికార్డు ఉంది. కానీ, అహ్మదాబాద్‌లో భారత క్రికెటర్ల ఆటలయ తప్పింది. అక్షర్ పటేల్‌ను తప్పించి తుది జట్టులోకి సుందర్‌ను తీసుకోవడం బెడిసికొట్టగా.. తొలి ఓవర్‌లోనే ఇషాన్ కిషన్ డకౌటవ్వడం.. ఆపై యాన్సెన్ తొలి బంతికే తిలక్ వర్మను వెనక్కి పంపడంతో భారత్ ఒత్తిడిలో పడింది. 6, 4తో టచ్‌లోకి వచ్చినట్టే కనిపించిన అభిషేక్ శర్మ సైతం పవర్ ప్లేలోనే వెనుదిరిగాడు. చూస్తుండగానే మూడు వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యాలు బ్యాట్ ఝులిపించి ప్రొటీస్ బౌలర్లపై పైచేయి సాధించలేదు.

## వాంఖడేలో హిట్‌మైర్ తుఫాన్..

### 107 రన్స్‌తో గెలుపొందిన వెస్టిండీస్!



లీగ్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి మేటిజట్లను ఓడించిన జింబాబ్వే వాంఖడే మైదానంలో వెస్టిండీస్ హిట్టర్లను నిలువరించలేక.. ఆపై స్పిన్నర్లను ఎదుర్కోలేక చిత్తుగా ఓడింది. షిమ్రన్ హెట్మైర్(85), రొవ్మన్ పావెల్(59) విధ్వంసంతో కరీబియన్ టీమ్ రికార్డు స్కోర్ కొట్టడంతో డీలా పడిన జింబాబ్వే.. భారీ ఛేదనలో పవర్ ప్లేలోనే తడబడింది. గుడకేశ్ మోతీ(4–28) తిప్పేసి కోలుకోలేని దెబ్బకొట్టాడు. మేయర్స్(28), సికిందర్ రజా(27) మినహా అందరూ చేతులెత్తేయగా ఆఖర్లో ఎవాన్స్(43) మెరుపులతో పరుగుల అంతరం తగ్గించాడు. 107 పరుగుల భారీ విజయంతో గ్రూప్ ఏలో సెమీస్ రేసులోకి దూసుకెళ్లింది కరీబియన్ జట్టు.

## యువతరంగం

# ప్రణాళిక ఉంటే.. యుపిఎస్‌సి సాధ్యమే




సరైన ప్రణాళిక ఉంటే, యుపిఎస్‌సి సాధించడం అసాధ్యమేమీ కాదు. అయితే, యుపిఎస్‌సి ప్రిలిమ్స్‌కు సిద్ధమవడం అనేది కేవలం సిలబస్ పూర్తిచేయడమే కాదనేది గుర్తుంచుకోవాలి. అది ఒక క్రమశిక్షణాత్మక ప్రయాణం. ఈ ప్రయాణంలో ప్రతి వారం స్పష్టత పెరగాలి. ప్రతి నెల జ్ఞాపకశక్తి పదునుపడాలి, 180 రోజుల చివరికి అనిశ్చితి స్థిరమైన ఆత్మవిశ్వాసంగా మారాలి. ప్రణాళిక గట్టి కావాలి, కానీ గట్టిగా బిగుసుకుపోయినట్టుగా ఉండకూడదు. అది అభ్యాస వేగానికి అనుగుణంగా మారాలి. పునర్విమర్శలతో బలపడాలి. సాధనతో లోతు సంపాదించాలి. ఎక్కువ గంటలు చదవడం లక్ష్యం కాదు... గమ్యాన్ని చేరుకునే విధంగా చదవడం, అభ్యాసానికి విశ్లేషణ జోడించడం, ముందుచూపుతో పునర్విమర్శ చేయడం అసలు లక్ష్యం. ఎంచుకున్న ఈ 180 రోజుల ప్రణాళికను మూడు దశలుగా అర్థం చేసుకోవచ్చు. మొదటి 60 రోజులను తదుపరి తయారీకి పునాదులు వేసుకునేందుకు కేటాయించుకోవాలి. తదుపరి 60 రోజులు వివిధ అధ్యాయాలను లోతుగా పరిశీలించి, అర్థం చేసుకోవాలి. చివరి 60 రోజులు పరీక్షానుభవ సాధన, ఖచ్చితమైన పునర్విమర్శకు వినియోగించుకోవాలి. ఈ నిర్మాణం సహజమైన అభ్యాస వక్రాన్ని ప్రతిబింబిస్తుంది. మొదట విషయాలు విస్తృతంగా కనిపిస్తాయి. మధ్యలో అవి నిర్వహణయోగ్యంగా మారతాయి. చివరికి పరిచయంతో కూడిన ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. మొదటి దశలో స్పష్టత, స్థిరత్వం అత్యంత ముఖ్యమైనవి. పూర్వ సంవత్సర ప్రశ్నపత్రాలను



పరిశీలించడం ద్వారా స్వీయస్థాయిని అంచనా వేయాలి. ఏ అంశాల్లో బలం ఉంది, ఏ అంశాల్లో లోపం ఉంది అన్నది ప్రారంభంలోనే తెలుసుకోవాలి. పాలిటీ, ఆర్థిక శాస్త్రం, చరిత్ర, భూగోళ శాస్త్రం వంటి ప్రధాన అంశాలు పునాదిగా నిలుస్తాయి. పరిమిత వనరులను ఎంచుకొని వాటినే క్రమబద్ధంగా అనుసరించడం మంచిది. ప్రతిరోజూ చదివిన విషయాన్ని చిన్న పేరాగ్రాఫ్ రూపంలో గుర్తుచేసుకోవడం జ్ఞాపకశక్తిని చురుకుగా ఉంచుతుంది. ఇదే యాక్టివ్ రీకాల్ పద్ధతి. అదే సమయంలో ప్రస్తుత వ్యవహారాలను రోజూ ఒక గంట సమయంతో అనుసరించడం అవసరం. ఎడిటోరియల్స్ చదవడం, చిన్న నోట్లు తయారు చేయడం తదుపరి దశల్లో ఎంపికల తొలగింపులో సహాయపడుతుంది. రెండో దశలో విషయ పరిజ్ఞానం లోతు, అనుసంధానం ముఖ్యం. పర్యావరణం, విజ్ఞాన సాంకేతికం, కళా సంస్కృతి వంటి అంశాలు ప్రస్తుత పరిణామాలతో కలిపి అధ్యయనం చేయాలి. పాలిటీ చదివేటప్పుడు పర్యావరణ చట్టాలను రాజ్యాంగ మార్గదర్శక సూత్రాలతో అనుసంధానించడం, ఆర్థిక అంశాలను ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిణామాలతో కలపడం, ఆధునిక చరిత్రను స్వాతంత్ర్యానంతర పరిపాలనా మార్పులతో అనుసంధానించడం వంటి పద్ధతులు జ్ఞాపకశక్తిని బలపరుస్తాయి. ఈ దశలో విభాగాల వారీగా మాక్ పరీక్షలు ప్రారంభించాలి. మార్కులకంటే విశ్లేషణ ముఖ్యం. తప్పిదం ఎందుకు జరిగింది అన్నది గుర్తించడం తదుపరి మెరుగుదలకు దారి తీస్తుంది. ఇదే సమయంలో సీశాట్‌ను నిర్లక్ష్యం చేయకూడదు. వారానికి ఒకసారి రీజనింగ్ లేదా రీడింగ్ కంప్రెహెన్షన్ సాధన చేయడం సరిపోతుంది.

మూడో దశలో అభ్యాసం ప్రదర్శనగా మారాలి. పూర్తి స్థాయి మాక్ పరీక్షలు పరీక్షా వాతావరణంలోనే రాయాలి. సమయపాలన, ఒత్తిడి నిర్వహణ, ఎప్పుడు ప్రశ్న వదిలేయాలి, ఎప్పుడు అంచనా వేయాలి వంటి అంశాలు ఇక్కడ నేర్చుకోవాలి. ప్రతి మాదరి పరీక్ష తర్వాత విశ్లేషణ అత్యవసరం. పొరపాట్లను గుర్తించి, సంబంధిత అంశాలను పునర్విమర్శ చేయాలి. సంక్షిప్త నోట్స్, మ్యాప్స్, వంటి సాధనాలు వేగవంతమైన పునర్విమర్శకు ఉపయోగపడతాయి. ఈ దశలో ఖచ్చితత్వం ఆశయాల కంటే ముఖ్యమైనది. చాలా మంది కరెంట్ ఈవెంట్స్ అత్యవసరమని అనుకుంటే, ఏరోజుకు ఆరోజు అంశాలను చదువుకోవడంలోనే నిమగ్నమవుతారు. కానీ, నిపుణుల సూచనలను అనుసరించి, కరెంట్ అఫైర్స్ విషయంలో అధిక భారం మోసుకోవడం అవసరం లేదు. రోజువారీ ఎడిటోరియల్స్, వారానికి ఒకసారి అంశాల ఆధారిత సమీక్ష, నెలవారీ సమగ్రికరణ సరిపోతుంది. ప్రతి ప్రస్తుత అంశాన్ని స్థిర సిలబస్ అంశంతో అనుసంధానిస్తే గుర్తుంచుకోవడం సులభమవుతుంది. సీశాట్‌కు ప్రశాంతమైన, స్థిరమైన సాధన అవసరం. పేపర్ క్రమాన్ని ముందుగానే నిర్ణయించి ప్రతి పూర్తి మాక్‌లో అదే క్రమాన్ని అనుసరించడం మంచిది. వ్యక్తిగత మెరుగుదల కోసం విశ్లేషణ ఆధారిత పరీక్షా సిరీస్‌లు, పనితీరును బేరీజు వేసే డాష్‌బోర్డ్‌లు వంటివి లక్ష్యిత సాధనతో లోపాలను గుర్తించడంలో సహాయపడతాయి. అలాగే ఆల్ ఇండియా టెస్ట్ సిరీస్‌లు పోటీ వాతావరణాన్ని అనుభవించడానికి , జాతీయ స్థాయి బెంచ్‌మార్కింగ్ కోసం ఉపయోగపడతాయి. బోధన, పరీక్ష, విశ్లేషణ, మార్గదర్శకత్వం అనే నాలుగు అంశాలు సమన్వయంతో ఉంటే సిద్ధత మరింత సమగ్రంగా ఉంటుంది. ఈ 180 రోజుల ప్రణాళికలో అత్యంత కీలకమైనవిగా పరీక్ష.. విశ్లేషణ.. పునర్విమర్శనలను గుర్తుంచుకోవాలి. విశ్లేషణ మనం చేసిన తప్పులను గుర్తించి, లోపాలను చూపిస్తుంది. పునర్విమర్శ ఆ లోపాలను బలాలుగా మార్చుతుంది. ఈ చక్రం పునరావృతమైతే ఖచ్చితత్వం, ఆత్మవిశ్వాసం రెండూ పెరుగుతాయి.

అభ్యాసంలో దాగి ఉన్న ప్రమాదాల్లో ఒకటి అమలు చేయని ప్రణాళిక. అతి పెద్ద టైమ్ టేబుల్‌లు రూపొందించి వాటిని పాటించలేకపోవడం సాధారణం. వాస్తవికమైన ప్రణాళిక, మానసిక అలసటను పరిగణనలోకి తీసుకోవడం అవసరం. అధిక నోట్స్ తయారు చేసి చివరి నెలలో వాటిని పూర్తి చేయలేకపోవడం మరో పొరపాటు. సంక్షిప్త నోట్లు ఉత్తమం. అలాగే సీశాట్‌ను చివరి దశ వరకు వదిలేయడం ప్రమాదకరం. చివరి 30 రోజులు కొత్త విషయాల కోసం కాదు... స్థిరమైన 180 రోజుల ప్రణాళిక, క్రమబద్ధమైన మాక్ పరీక్షలు, అంశాల అనుసంధానం, సమతుల్య ప్రస్తుత వ్యవహారాల అధ్యయనం తదితరాలు పరీక్షను మాత్రమే కాక, పరీక్షను అధిగమించడానికి అవసరమైన మనోభావా న్ని కూడా నిర్మిస్తాయి. వచ్చే ఆరునెలలు సిద్ధతను మలుపుతిప్పగలవు. సరైన పద్ధతి ఆత్మవిశ్వాసాన్ని నిర్ధారిస్తుంది. సరైన అలవాట్లు స్పష్టతను పెంచుతాయి. నిరంతర అమలు ఫలితాన్ని నిర్వచిస్తుంది. ఆల్ ది బెస్ట్.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటం

### ఎఐటియుసి సిద్దిపేట జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్
### సమస్యల పరిష్కారానికి లేబర్ కమిషనర్‌కు వినతులు


సిద్దిపేట...

**ప్రజాపక్షం/సిద్దిపేట :** భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి నిరంరతం పోరాటం చేస్తుందని ఎఐటియుసి సిద్దిపేట జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ అన్నారు. జిల్లాలో నెలకొన్న భవన నిర్మాణ కార్మికుల పలురకాల సమస్యలపై ఆందోళన నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్, హౌజింగ్ పిడిలకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌సరెన్స్‌ను ప్రైవేటు కంపెనీలకు ఇచ్చే ఆలోచన విరమించుకోవాలన్నారు. సెస్సు 2శాతానికి పెంచాలని. సహజ మరణం 5లక్షలకు పెంచాలని, ప్రసూతి సహాయం రూ.లక్షకు పెంచాలని. జిఒ నెంబర్ 12ను సవరించాలన్నారు. వివాహ కానుక రూ.1లక్షకు పెంచాలని, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న లెబర్ కార్డులకు అప్రూవల్ , రెన్యూవల్ అప్‌డేట్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్మిక శాఖలో బిఓసి ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించాలని, కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, సంక్షేమ బోర్డును కార్మిక సంఘాల సభ్యులతో పాలకమండలి నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర నాయకులు అయ్యావారు లక్ష్మణ్, అందే అశోక్. సంఘం జిల్లా అధ్యక్షుడు బెక్కంటి సంపత్. శివలింగ కృష్ణ, ఈరిభూమయ్య, దొంతి కేశవులు, తిరుపతిరాజు, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బిల్డింగ్ అండ్ కన్స్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రఫీలకు వినతిపత్రం అందజేశారు. క్యార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, బిల్డింగ్, కన్స్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కౌన్సిల్ సభ్యులు రేగుల కుమార్, గామినేని సత్యం, పుట్ట మహేష్, రమేష్ పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన సెస్‌ను ప్రయివేటు కంపెనీలకు దోచిపెడుతుందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. సోమవారం ఎఐటియుసి రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్ నగరంలోని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎఎల్‌ఒ నవీన్‌కు వినతి పత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటి సభ్యుడు దుబాస్ రాములు, యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.హనుమాండ్లు, కార్యదర్శి రాజన్న, నాయకులు ఫెరోజ్ అలీ, గంగాధర్, బుడాల రాములు, నీలి శంకర్, నారాయణ, సఖి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**మెట్‌పల్లి :** ఎఐటియుసి రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మెట్‌పల్లిలోని కార్మిక శాఖ అధికారి ఆర్.క్రిష్ణసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎశమేని గణేష్, నాయకులు ఎండి ఉస్మాన్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశమేని గణేష్, సమీర్, ఖాతా వినయ్, మాతంగి శ్రావణ్, చౌదరి శివకుమార్, జనగాం రమేష్, మారంపల్లి రాజశేఖర్, తులసి రాజు పాల్గొన్నారు.

**నిజాంపేట్ :** బిల్డింగ్, కన్స్రక్షన్ వర్కర్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో విన పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దొంతి కేశవులు మెదక్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అయ్యవారి లక్ష్మణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్...


మెట్‌పల్లి...


నిజాంపేట్...



నిజామాబాద్...

# రైతాంగ వ్యతిరేక చర్యలు వీడాలి




### స్వామినాధన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి
### రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాధం డిమాండ్

**ప్రజాపక్షం/పాల్వంచ :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక చర్యలను విడనాడి రైతు సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాధం డిమాండ్ చేశారు. పాల్వంచ పట్టణంలోని సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవనంలో రైతు సంఘం (ఎఐకెఎస్)జిల్లా కౌన్సిల్ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రా నరేంద్ర కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సంధర్భంగా ముత్యాల విశ్వనాధం మాట్లాడుతూ రైతు ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అంటూ గొప్పలు చెపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా అందించలేదన్నారు. దీంతో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసాను అందించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. నిలిపివేసిన సిసిఐ పత్తి కొనుగోళ్ళను పునరుద్దరించి మార్చి చివరి వరకు కొనుగోళ్ళు చేసి రైతులను దళారుల నుండి కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. సన్న దాన్యానికి చెల్లిస్తున్న బోనస్ డబ్బులను రైతుల ఖాతాలో తక్షణమే వేయాలన్నారు. స్వామినాధన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తూ రైతాంగానికి గిట్టుబాటు ధరలను కల్పించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని విమర్శించారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తీసుకొస్తున్నదని ఆరోపించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు పలు విధాలుగా కుట్రలకు తెరలేపుతోందని దీనిలో భాగంగానే జిరాంజి పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. ఉపాధిహామీ పథకానికి గతంలో 80శాతం నిధులు కేంద్రప్రభుత్వం వాటా, 20 నిధులు రాష్ట్ర ప్రభుత్వం వాటా ఉందన్నారు. ప్రస్తుతం 60 శాతం నిధులను మాత్రమే విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై 40శాతం నిధులతో భారం మోపుతోందన్నారు. కేంద్రప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ పథకంలో పాత విధానాన్ని పాటిస్తూ 80 శాతం వాటా విడుదల చేయాలన్నారు. ఆన్‌లైన్ విధానంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులకు సరిపడా యూరియాను నేరుగా అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణ బాద్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సరెడ్డి పుల్లారెడ్డి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ సలిగంటి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరాటి రమేష్, వాడె లక్ష్మి, వైఎస్. గిరి తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీపోస్టుల భర్తీతోనే కార్మికులకు న్యాయం

### ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఎఐసిబిసిడబ్ల్యు జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కె.హరితకు బిల్డింగ్ అండ్ కన్స్టక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం సెస్సు ను 2 శాతానికి పెంచాలని, సహజ మరణం, ప్రసూతి సహాయం, వివాహ కానుకలను లక్షల్లోకి పెంచాలని కోరారు. ఇన్సూరెన్స్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలని, జిఒ నంబర్ 12ను సవరించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ లేబర్ కార్డుల అప్రూవల్, రెన్యువల్ ప్రక్రియను వేగవంతం చేయాలని, సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాల సభ్యులతో పాలక మండలిని ఏర్పాటు చేయాలని భోగే ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి సంఘం నాయకులు దివాకర్, తులసిరామ్, మోహన్, ప్రకాష్ పాల్గొన్నారు.

# రాజ్యాంగ విరుద్ధంగా క్యాతనపల్లిలో పాలకుల వికృత క్రీడలు!

### తక్షణమే చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలి
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ డిమాండ్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** క్యాతనపల్లి మున్సిపాలిటీలో రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలను అధికార బలంతో అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ ధ్వజమెత్తారు. మెజార్టీ సభ్యుల బలం చూసి వణికిపోతున్న పాలకపక్షం, ప్రభుత్వ యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని వికృత క్రీడకు తెరలేపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 కె, 243 యు ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్ణీత సమయానికి, పారదర్శకంగా జరగాలని స్పష్టంగా ఉన్నప్పటికీ అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారి చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఫిబ్రవరి 16న పోలీసు జోక్యం పేరుతో ఎన్నికలను అర్థాంతరంగా నిలిపివేయడం, అడుగడుగునా ఆటంకాలు సృష్టించడం వెనుక ముమ్మాటికీ రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. సభలో అనవసరమైన విరామాలు తీసుకుంటూ సభ్యులను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం చేయడం చట్టపరమైన ప్రశ్నలకు దారి తీస్తుందని హెచ్చరించారు. అహ్మదాబాద్ మున్సిపల్ చట్టం–2006 నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను అధికారులు బేఖాతరు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో జాప్యం చేయరాదని, మెజార్టీ పరీక్షను కేవలం సభలోనే నిర్వహించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసినప్పటికీ, ఇక్కడ పాలకుల కనుసన్నల్లో రాజ్యాంగ విరుద్ధమైన చర్యలు సాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బయట ఒత్తిళ్లు ఉన్నా, గొడవలు జరుగుతున్నా ఎన్నికలను వాయిదా వేయడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఇటీవల బాల్క సుమన్‌పై పెట్టిన కేసులు, పీటీ వారెంట్లు జారీ చేయడం వంటివి కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యలేనని శంకర్ అభివర్ణించారు. అణచివేతతో ఉద్యమ గొంతుకలను నొక్కలేరని, ఇలాంటి బెదిరింపులకు భయపడకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. క్యాతనపల్లి ప్రజల ఆశయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అనుమానాలకు తావులేకుండా తక్షణమే ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ ఎన్నికను వీడియో రికార్డింగ్ సమక్షంలో తక్షణమే నిర్వహించాలని, మెజార్టీ బల నిరూపణను కేవలం సభలోనే చేపట్టాలని, ఫిబ్రవరి 16న జరిగిన పోలీసుల అతిజోక్యంపై ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరపాలని, సభ్యులపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే వరకు, క్యాతనపల్లిలో పాలకుల అరాచకాలను ఎండగట్టే వరకు సిపిఐ విశ్రమించదని కలవేన శంకర్ స్పష్టం చేశారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్:** వనపర్తి పట్టణం రెండో వార్డుకు చెందిన బలరాం రమేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సోమవారం వారి ఇంటి వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారని వారిని ఆదుకోవాలని వారు ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఎలాంటి అవసరం ఉన్న తాను అండగా ఉండాలని కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి ... పరామర్శ**

గత 20 సంవత్సరాలుగా వనపర్తి మార్కెట్ యార్డులో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పెబ్బేరు మండలం జానంపల్లి గ్రామానికి చెందిన పరుశురాం ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. సోమవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వనపర్తి మార్చ్యురిలో ఉన్న మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరమైన ఆర్థిక సహాయ సహకారాలు అందేలా చూస్తారని ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 29 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 29 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

### జిల్లా ఎస్పీ డి.జానకి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** జిల్లా ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడం పోలీస్ శాఖ ముఖ్య బాధ్యత అని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులను ఎస్పీ స్వయంగా కలుసుకుని వారి సమస్యలను క్షుణ్ణంగా విని స్పందించారు. ఈ సందర్భంగా మొత్తం 19 ఫిర్యాదులు స్వీకరించగా, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా పరిగణించి సంబంధిత అధికారులకు వెంటనే పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కొన్ని అంశాలపై ఎస్పీ స్వయంగా సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు పోలీసు శాఖపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టడం అత్యంత ముఖ్యమని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం లేదా నిర్లక్ష్యం సహించబడదని తెలిపారు. ప్రతి ఫిర్యాదు దారునికి గౌరవప్రదంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం మరియు బాధ్యతాయుత వైఖరి పాటించాలని అధికారులకు సూచించారు.

## ఫీజుల పేరుతో హాల్‌టికెట్స్ ఆపొద్దు

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు వెంటనే హాల్ టికెట్లు జారీ చేయాలి అఖిల భారత విద్యార్థి సమైక్య ఎఐఎస్ఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఫీజులు చెల్లించలేని సాకుతో విద్యార్థులకు మానసిక ఆందోళనలకు గురి చేస్తే హాల్ టికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. పరీక్ష సమయంలో విద్యార్థులపై ఒత్తిడి పెంచడంతో వారి భవిష్యత్తు దెబ్బ తింటుంది అన్నారు. ఇంటర్ బోర్డు విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ కళాశాలపై తనిఖీ చేయాలని విద్యార్థుల ఫిర్యాదులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. యజమాన్యాలు వారి పద్ధతులు మార్చుకోకుంటే ఏఐఎస్ఎఫ్ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## మహిళల శిక్షణ విజయవంతం

**ప్రజాపక్షం/ఊట్కూర్ :** ఊట్కూర్‌లో యాక్సెస్ లైవ్లీహుడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు కింద మహిళల కోసం ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 18 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించబడింది. మహిళా అభివృద్ధి మరియు స్వయం ఉపాధి అవకాశాల పెంపుదల లక్ష్యంగా నిర్వహించిన ఈ శిక్షణలో పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ, ఎంఎస్ఎంఇ పథకాలు, లోన్ల అర్హతలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలు బ్యాంకుల పాత్రపై అవగాహన కల్పించారు. చిన్న వ్యాపారాలను ప్రారంభించి అభివృద్ధి చేసుకునే విధానాలపై సమగ్ర మార్గదర్శనం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ మంజునాథ్, పర్యవేక్షణలో క్లస్టర్ మేనేజర్ హరిలత, సమన్వయంతో జరిగింది. మహిళా సభ్యులు ఉత్సాహంగా పాల్గొని చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు



**ప్రజాపక్షం/గద్వాల్ :** పోలీస్ సేవలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం పని చేస్తోందని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించినర 'గ్రీవెన్స్ డే' (ప్రజావాణి) కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని బాధితుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఆర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. మొత్తం 10 ఫిర్యాదులు అందగా, వాటిపై స్పందించిన ఎస్పీ అక్కడికక్కడే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు చట్టపరంగా త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. గ్రీవెన్స్‌డేలో వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిగతులను నిరంతరం సమీక్షిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

# పదోతరగతి పరీక్షలకు సమగ్ర ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** మార్చి 14నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించేందుకు అన్నిశాఖల సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో విద్య, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, తపాల, విద్యుత్ ,ఆర్టిసి, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఈ సంవత్సరం తొలిసారిగా ప్రతి పరీక్షకు మధ్య నాలుగురోజుల వ్యవధి ఉండటం విద్యార్థులకు మంచి అవకాశమని పేర్కొన్నారు. ఈ విరామాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులకు అవసరమైన విద్యా మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. పదోతరగతి పరీక్షలు మార్చి 14నుండి ఏప్రిల్ 16వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30గంటల నుండి మధ్యాహ్నం 12.30గంటలవరకు పరీక్షలు జరగనున్నాయని వెల్లడించారు. మొత్తం 10,683మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, అందులో 5,264మంది బాలురు, 5,394 మంది బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలోని 257 ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, ఇతర మాధ్యమాల పాఠశాలల విద్యార్థులు ఈపరీక్షలకు హాజరవుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, డిఎస్‌పి శ్రీనివాసులు, డిఇఓ రమేష్‌కుమార్, డిపిఓ శ్రీరాములు, డిఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్, ఏసి రాజశేఖర్‌రావు, మున్సిపల్ కమీషనర్లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో 50 ఫిర్యాదులు :**

నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయంతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆర్జీలు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 50 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరిండెంట్లు, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆటోడ్రైవర్ కార్మికులను ఆదుకోవాలి



### ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఆటోడ్రైవర్ కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆదుకోవాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో ఎఐటియూసి ఆటో యూనియన్ జెండాను సింగోటం గ్రామసర్పంచ్ ఈదన్నగౌడ్ ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ఎఐటియూసి ఆవిర్భవించిందన్నారు. హక్కులను సాధించడానికి ఎంతోమంది ప్రాణాలను అర్పించారన్నారు. సమానపనికి సమాన వేతనం ఆనాడు ఎన్నో కార్మిక చట్టాలను సాధించిపెట్టిన ఘనత ఎఐటియూసిదే అన్నారు. 44కార్మిక చట్టాలను ఆనాడు సాధిస్తే ఈనాడు ఉన్నటువంటి కేంద్రప్రభుత్వం నాలుగుకోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల చట్టాల హక్కులను కాలరాస్తుందన్నారు. ఎఐటియూసి ఆవిర్భవించిన నాటినుండి నేటివరకు పోరాటాలద్వారా కార్మికులకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పిందన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి సింగోటం ఆటోయూనియన్ గ్రామ అధ్యక్షుడు వేణు, గ్రామ మాజీసర్పంచులు ఆర్.ఇందిరమ్మ, లాలి, కృష్ణ, ఉపసర్పంచ్ సాయికృష్ణగౌడ్, ఆటోడ్రైవర్ యూనియన్ నాయకులు మోహన్‌గౌడ్, ఈశ్వర్, గోవర్ధన్‌గౌడ్, శేఖర్, శివప్రసాద్, రాములు, నర్సింహ్మా, మంజుల,భారతి, చంద్రకళ పాల్గొన్నారు.

# సిసి రోడ్లు, డ్రైనేజీలు, హైమాస్ట్ లైట్లకు శ్రీకారం

### ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి (శేరిగూడెం) గ్రామపంచాయితీలో రూ.50 లక్షల ముడా నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీలు, హైమాస్ట్ లైట్ల నిర్మాణ పనులకు సోమవారం జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సీసీ రోడ్లు అండర్ డ్రైనేజీల నిర్మాణం ద్వారా గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపడటంతో పాటు ప్రజలకు రాకపోకలు సౌకర్యవంతంగా మారుతాయని అన్నారు. అలాగే హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వల్ల రాత్రి వేళల్లో ప్రజలకు భద్రత మరియు సౌకర్యం పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులను దశలవారీగా చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమాజంలో నేటికీ మహిళలపై వేధింపులు ఆగడం లేదు



### అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ

**ప్రజాపక్షం/గద్వాల రూరల్:** మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు ఉద్దేశించిన లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు నర్సింగరావుతో పాటు ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013లో వచ్చినప్పటికీ సమాజంలో నేటికీ మహిళలపై వేధింపులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపుల బారిన పడిన బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసినప్పుడే వేధింపులకు పాల్పడిన వారికి శిక్షలు పడతాయన్నారు. జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు ఉద్దేశించిన చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన ఉండాలన్నారు. మహిళలపై లైంగిక వేధింపులను సమూలంగా నిర్మూలించేందుకు కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం చట్టంపై రూపొందించిన గోడ పత్రికలను ముఖ్య అతిథులు పలువురు జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ సునంద, ఇతర జిల్లా అధికారులు, వివిధ మండలాల తహసీల్దార్లు, వివిధ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రసవత్తరంగా కొనసాగిన ఫైనల్ మ్యాచ్

### విజేతలకు బహుమతుల ప్రదానం




**ప్రజాపక్షం/మక్తల్ :** నాలుగు రోజుల పాటు జరిగిన సెకండ్ ఎడిషన్ సీఎం కప్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఫైనల్లో పురుషుల విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టుపై వనపర్తి జిల్లా 20 పాయింట్ల తేడాతో గెలుపొందగా, మహిళల విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టుపై జోగులాంబ గద్వాల జిల్ల జట్టు 5 పాయింట్ల తేడాతో గెలుపొందింది. ఇరు జట్ల మధ్య అడుతున్న తీరును మంత్రి శ్రీహరి స్వయంగా వీక్షించారు. విజేతలకు శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు మక్తల్ లో కబడ్డీ పోటీలు జరిగాయన్నారు. 33 జిల్లాల నుండి సుమారు 1200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. మక్తల్ ప్రాంతానికి కబడ్డీకి అవినాభావ సంబంధం ఉందని తెలియజేశారు. కబడ్డీ పోటీలను విజయవంతం చేసిన అధికారులను ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ ఓ శెట్టి వెంకటేష్, మాజీ ఎంపీపీ బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ గౌడ్, మాజీ జడ్పీటీసీ జి.లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బి.గణేష్ కుమార్, జి.నీలప్ప, మున్సిపల్ కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, అలుకూరి పావని, నాయకులు రాజప్ప గూడ, ఆనంద్ గౌడ్ బోయ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పిఎంశ్రీ పాఠశాలల్లో లోపాల సవరణకు తక్షణ చర్యలు

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ జిల్లాలో అమలవుతున్న పీఎం శ్రీ పాఠశాలల పనితీరుపై కేంద్ర నోడల్ అధికారి, ప్రత్యేక పరిశీలకురాలు ఫరీదా మహమూద్ నాయక్ సోమవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సమక్షంలో కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో జిల్లాలోని 26 పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ పీఎం శ్రీ పాఠశాలల్లో అమలవుతున్న అన్ని కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, మౌలిక సదుపాయాల, విద్య బోధన అభివృద్ధికి, ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పరిశీలకురాలు సూచించిన కొన్ని విషయాలపై కూడా తక్షణ చర్యలు తీసుకొని సవరిస్తామని అన్నారు. సమీక్షకు ముందు అకాడమిక్ మానిటరింగ్ అధికారి డి.శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పీఎం పథకం కింద అమలవుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పీఎం శ్రీ పాఠశాలల్లో ఉత్తమ పద్ధతులు అమలు చేస్తూ ఆదర్శవంతమైన విద్యాసంస్థలుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర పరిశీలకురాలు ఫరీదా మహ్మూద్ నాయక్ మాట్లాడుతూ, తన సందర్శనలో కొన్ని పాఠశాలల్లలో లోపాలను గుర్తించానని అన్నారు. కొన్ని పాఠశాలల్లో సరైన మరుగుదొడ్లు, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు లేవని, చేతులు కడుక్కునే విధానం కచ్చితంగా అమలు కావడం లేదని, బాలికల మరుగుదొడ్లలో డస్‌బిన్లు లేవని సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం అమలు తర్వాత వచ్చిన మార్పుల గురించి ప్రశ్నించగా, ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని, అభ్యాసంపై ఆసక్తి, ఉత్సాహం పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ, కేంద్ర పరిశీలకురాలు సూచించిన లోపాలను గమనించి తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఈఓ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర సమన్వయ అధికారి, ఏ.డి జనార్ధన్ రావు, రాష్ట్ర సీఎంఓ సచ్చిదానంద రెడ్డి, ఏఎంఓ డి. శ్రీనివాస్, జి.సి.డి.ఓ అస్రా ఖాద్రి పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగింపు

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న ఆక్రమణలను అధికారులు సోమవారం తొలగించారు. మండలంలోని పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న ప్రభుత్వ భూమిపై కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి హద్దులు ఏర్పాటు చేసుకోవడంతో పాటు, మరికొందరు తాత్కాలిక షెడ్డులు నిర్మించుకున్నారు. ఈ విషయంపై గ్రామస్తుల నుండి వచ్చిన ఫిర్యాదుల మేరకు తహసీల్దార్ వరలక్ష్మి తక్షణ చర్యలు చేపట్టారు. గ్రామంలోని సర్వే నెంబర్ 721కు చెందిన ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా హద్దులు ఏర్పాటు చేసి షెడ్డులు నిర్మించుకోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో, సంబంధిత అధికారుల దృష్టిలో సమస్యను తీసుకువెళ్లినప్పటికి సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ గ్రామస్తులు పార్టీలకతీతంగా రెండు రోజుల క్రితం ఆ భూమిలో రాళ్లు పాతి హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ వరలక్ష్మి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రభుత్వ భూమిని ఎవరైనా అక్రమంగా అక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జెసిబి సహాయంతో అక్కడ నిర్మించిన అక్రమ షెడ్డులను తొలగించడంతో పాటు, గ్రామస్తులు ఏర్పాటు చేసిన రాళ్ల హద్దులను గ్రామపంచాయితీ సిబ్బంది ద్వారా తొలగించారు. ప్రభుత్వ భూమిపై ఎలాంటి ఆక్రమణలు సహించబోమని, భవిష్యత్తులో కూడా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వరలక్ష్మి స్పష్టం చేశారు.

## తల్లిదండ్రుల పోషణ వారసుల బాధ్యత



### జిల్లా ఎస్పీ సునీత రెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి:** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ పిల్లలపై వారసుల బాధ్యతని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విస్మరించినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సునీతరెడ్డి హెచ్చరించారు. ప్రతి సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి 16 మంది ఫిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ సునీతరెడ్డి ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తక్షణమే సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో మొత్తం 16 ఫిర్యాదులు ఉన్నాయి.

## శ్రీకృష్ణభగవాన్ విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవం విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని పదర మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలని అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్రప్రధాన కార్యదర్శి బైకాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. సోమవారం కల్వకుర్తి పట్టణకేంద్రంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26న అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండల కేంద్రంలో శ్రీకృష్ణభగవాన్ విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేయుచున్న యాదవ ఆత్మబంధువులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, ఎమ్మెల్సీ అనిల్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్‌లతోపాటు యాదవ మహాసభ ప్రతినిధులకు శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి దేవరకొండ చౌరస్తా వద్ద ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల నుండి యాదవ బంధుమిత్రులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు ఈడమోని లాల్‌యాదవ్, కల్వకుర్తి , వంగూర్ మండలాల యాదవ మహాసభ అధ్యక్షులు రుక్కయ్య యాదవ్, ఈడమోని తిరుపతయ్య,యాదవ మహాసభ యువజన సంఘం అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జిల్లాప్రధాన కార్యదర్శి ఎల్.తిరుపతయ్యయాదవ్, అధ్యక్షులు పుల్లయ్యయాదవ్, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘం నాయకుడి బెదిరింపులు

### సదరు వ్యక్తిపై కలెక్టర్, ఎస్పీకి, ఫిర్యాదు

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులను టార్గెట్ చేస్తూ బ్లాక్ మెయిల్‌లకు పాల్పడుతూ, డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తి పై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసిన దళిత విద్యార్థి సంఘాలు మాదిగ జాయింట్ యాక్షన్ కమిటీ వనపర్తి జిల్లా నాయకులు, సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. విద్యార్థి సంఘాల పేరుతో చలామణి అవుతూ వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాదిగ విద్యార్థి జేఏసీ నాయకులు జానుంపల్లి కిరణ్ మాట్లాడుతూ పవన్ కుమార్ అనే వ్యక్తి (పిడిఎస్‌యు) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చలామణి అవుతున్న ఇతనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వనపర్తి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలను చిన్నచిన్న తప్పులు చూపిస్తూ డబ్బులు డిమాండు చేస్తున్నట్లు వారు జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీ తెలిపారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండలం కున్సి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న 68 మంది విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి ట్రస్ట్ మక్తల్ శాఖ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా శాఖ కన్వీనర్ బి.భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థులు రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశాభవం వ్యక్తం చేశారు. పరీక్ష సమయంలో సమయపాలన పాటించడం, ప్రశ్నపత్రాన్ని జాగ్రత్తగా పూర్తిగా చదవడం, సమాధానాలను స్పష్టంగా, శ్రద్ధతో రాయడం వంటి కీలక సూచనలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల తరపున సత్యసాయి సేవా సమితి ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపధ్యాయులు సంతోషి, రిటైర్డ్ పోస్టుమాస్టర్ శ్రీరాములు, ఉపాధ్యాయ బృందం నరేందర్, ఖాసీం అలీ, నర్సిములు, సత్యనారాయణ రెడ్డి, స్వాతి, గీత, సౌమ్య, నాగేష్, రాధిక, ఆరీఫ్, సుదర్శన్ పాల్గొన్నారు.





## నిధులు మంజూరు చేయిస్తా

### కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం కోదాడ మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి తెలిపారు. సోమవారం కోదాడ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్‌గా కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్‌పర్సన్‌గా దేవరపల్లి మల్లేశ్వరిలు పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారిని అభినందించి మాట్లాడారు. చైర్మన్, వైస్ చైర్మన్, పాలక వర్గ సభ్యులు సమన్వయంతో పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటిగా కోదాడలో నిలుపాలన్నారు. ఆదర్శవంతంగా పనిచేసి పదవులకు వన్నె తేవాలన్నారు. పట్టణ అభివృద్ధిలో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. ప్రతి సమస్యను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని చెప్పారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం చేయూత



**ప్రజాపక్షం/కోదాడ :** కర్ల రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో చేయూత అందిస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హామీ ఇచ్చారు. సోమవారం కర్ల రాజేష్ తల్లి లలితమ్మను కలెక్టర్ కోదాడలోని ఆమె నివాసంలో కలిసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించిన నియామక పత్రం కూడా సిద్ధమైందని, మరో రెండు మూడు రోజుల్లోనే లలితమ్మకు నియామక పత్రాన్ని కూడా అందజేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల బెనిఫిట్స్‌ను ఆ కుటుంబానికి వర్తింపజేసి, అన్ని విధాలా అండగా ఉంటామని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ సూర్యనారాయణ, డిఎస్‌పి శ్రీనివాస రెడ్డి, జిల్లా ఎస్‌సి సంక్షేమ అధికారిణి దయానంద రాణి, తహశీల్దార్ వాజీద్ అలీ, యాతాకుల రాజన్న మాదిగ, ఏపూరి రాజు మాదిగ, కొండపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** భవిష్యత్తులో క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని పతకాలు గెలిచి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరుతేవాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ 4వ రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీల్లో సూర్యాపేట జిల్లా పోలీస్ క్రీడాకారులు యాదాద్రి జోన్ తరపున కబడ్డీ, వాలీబాల్, బ్యాట్మెంటెన్, కోకో, అథ్లెటిక్స్ క్రీడల్లో పాల్గొని గెలుపొందారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు నుండి ప్రాతినిధ్యం వహించిన బహుమతులు పొందిన పోలీసు క్రీడాకారులు జిల్లా ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించి మాట్లాడుతూ క్రీడలలో ప్రతిభ చూపడం ద్వారా సర్వీస్ నందు ఇంక్రిమెంట్లు నమోదు అవుతాయని, అలాగే ప్రమోషన్ విషయంలో ముందుండే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు రవీందర్ రెడ్డి, జనార్థన్ రెడ్డి, డిఎస్‌పి నరసింహచారి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ జానయ్య, పోలీసు సంఘం అధ్యక్షులు రామచంద్ర గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** ప్రజల సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి నేరుగా బాధితుల వినతులను స్వీకరించి, వారి సమస్యలను ఓర్పుతో విన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 40 మంది ఫిర్యాదుదారులు తమ వ్యక్తిగత,భూ వివాదాలు, కుటుంబ సమస్యలు,ఆర్థిక మోసాలు,సైబర్ నేరాలు ఇతర ఫిర్యాదులను సమర్పించారు.ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించి తక్షణ విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించిన ఎస్‌పి, ప్రజల సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక ఫాలోఅప్ చేస్తామని తెలిపారు.

## సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా...

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రూ.50లక్షల నిధులతో నాలా కల్వర్టు పనులను చేపడుతున్నామని, త్వరలోనే పనులు చేపట్టి రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. సోమవారం పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో నాలా కల్వర్టు పనులకు 47వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్‌తో కలిసి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వర్టు నిర్మాణం లేకపోవడంతో ముఖ్యంగా స్కూల్, కాలేజీ విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సూర్యాపేట మున్సిపాలిటిలో అభివృద్ధి యజ్ఞం ప్రారంభమైందన్నారు. త్వరితగతిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణపు పనులు పూర్తి చేయిస్తామన్నారు. అనంతరం 47వ వార్డులోని వాసవి కన్యకపరమేశ్వరి గుడి వెనుక వీధిలో సిసి రోడ్డు, సిపిఎం పార్టీ కార్యాలయం వెనుక వీధిలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, కౌన్సిలర్ నాగుల వాసు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# గోవర్ధనగిరిధారిగా లక్ష్మీ నారసింహుడు!



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి పుణ్య క్షేత్రంలో స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు గోవర్ధనగిరి ధారిగా భక్తులకు దర్శనమిచ్చారు. తిరువీధులలో సాగిన ఈ ఊరేగింపు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. ఉదయం ఆలయంలో నిత్యారాధనలు ముగిసిన అనంతరం, శ్రీవారిని గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన కృష్ణుడి రూపంలో అలంకరించారు. నాడు ఇంద్రుడి గర్వాన్ని అణచి, తనను ఆశ్రయించిన గోపబాలకులు, మూగజీవాలను కాపాడిన ఆ పరమాత్మ.. నేడు నరసింహుని రూపంలో భక్త రక్షణ తత్పరతను చాటుతూ భక్తులను అనుగ్రహించారు. శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా వేద పండితులు, అర్చకులు ఈ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జె. భవాని శంకర్, జిల్లా కలెక్టర్ శ్రీ ఎమ్. హనుమంతరావు, అనువంశిక ధర్మకర్త శ్రీ బి. నరసింహామూర్తితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాలలో అత్యంత కీలకమైన ఘట్టాల్లో ఒకటైన 'సింహ వాహన సేవ' ఈరోజు రాత్రి వైభవంగా జరగనుంది. భగవద్గీతలో చెప్పబడినట్లుగా, మృగాలలో శ్రేష్ఠమైన సింహం భగవంతుని స్వరూపం. ధైర్యానికి, శత్రుసంహారానికి ప్రతీక అయిన సింహ వాహనంపై అభయహస్తంతో నరసింహుడు దర్శనమిచ్చారు.'సంసార అరణ్యంలో చిక్కుకున్న భక్తులకు అభయాన్నిచ్చే 'నరసింహ' తత్వానికి ఈ సింహ వాహన సేవ అద్దం పడుతుంది.' రాత్రి నిత్యారాధనల అనంతరం ఈ వేడుకను ప్రారంభించి ఆలయ మాడ వీధుల్లోసింహ వాహనపై స్వామివారిని ఊరేగించారు. సింహ వాహన సేవలో పాల్గొన్న భక్తులు స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## రసాయన ఫార్మా కంపెనీలు భద్రతా ప్రమాణాలు పాటించాలి

### ప్రమాద తీవ్రతను పరిశీలించిన భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి :** విజె సాయి కెమికల్ కంపెనీలో గత శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో సీనియర్ కెమిస్ట్ సజీవ దహనమైన సంఘటన స్థలాన్ని సోమవారం భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి చేరుకొని ప్రమాద తీవ్రతను అగ్నిప్రమాదం జరగడం గల కారణాలను అధికారులను కంపెనీ యజమాని అని అడిగి తెలుసుకున్నారు. వర్మ కంపెనీలో భద్రత ప్రమాణాలకు ఏ చర్యలు తీసుకుంటున్నారు. సర్టిఫికెట్స్ అనుమతులు, కార్మికులకు బీమా వంటి అంశాలను పక్కాగా పాటిం చాలని కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. రసాయనాలు మార్పిడి చేస్తున్నప్పుడు తీసుకోవలసిన సేఫ్టీ మెజర్మెంట్ తప్పకుండా కార్మికులకు ఎప్పటికప్పుడు తెలియజెప్పాలని కార్మికుల ప్రాణాలు బలికాకుండా చర్యలు తీసుకోవాలని కుటుంబాలు రోడ్డు మీద పడకుండా చూసుకోవాలని కోరారు. ప్రమాదం ధాటికి దెబ్బతిన్న భవనా న్ని యంత్రాలను పరిశీలించారు. ప్రమాదంలో మృతి చెందిన ఆపరేటర్ సీనియర్ కెమిస్ట్ దార పవన్ (36)కు ఒప్పందం కుదుర్చుకున్న పరిహా రాన్ని వెంటనే చెల్లించాలని కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు. మండల, భువనగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని రసాయన, ఫార్మా, ఆగ్రో ఇతర పరిశ్రమలు భద్రత ప్రమాణాలు, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డిఎస్పి మధుసూదన్ రెడ్డి, సిఐ రాములు, ఎస్సై భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు మండల అధ్యక్షుడు పాక మల్లేష్, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, పవన దీక్షలు భారతలవ కుమార్ ఉన్నారు.

## 15 రోజుల్లో మాన్యం చల్క ఆరోగ్య కేంద్రం భవన పనులు పూర్తి



### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా కేంద్రంలోని మాన్యం చల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం అయన స్థానిక మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి జైలు సమీపంలో నిర్మాణంలో ఉన్న మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను తనిఖీ చేశారు.మొదటిసారిగా ఈ భవనాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవనం నిర్మిస్తున్న స్థలం,అంచనా వ్యయం, తదితర వివరాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ద్వారా అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 15 రోజుల్లో మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవనం మొత్తాన్ని పరిశీలించారు. డాక్టర్ గదులు, పేషంట్స్ వేచి ఉండే గది,ల్యాబ్, స్టోర్, వివిధ గదులు,వార్డులు,ర్యాంప్,టాయిలెట్ సౌకర్యం,అలాగే నీటి వసతి. పరిసరాలు అన్నింటిని పరిశీలించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి,ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ నేత నరసింహారావు,మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఉన్నారు.

**పాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేయాలి**

వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన పనులను ప్రాధాన్యత క్రమంలో,నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులు,సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అంగన్వాడి కేంద్రాలు, మూత్రశాలలు, అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు,పాఠశాల ప్రహరీ గోడలు,కాంపౌండ్ గోడలు,మూత్ర శాలల నిర్మాణం వంటి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్‌డిఎఫ్,ఎంపీ లాడ్స్ నిధులతో చేపడుతున్న పనులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలని చెప్పారు.



## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 54 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 26, పంచాయతీ శాఖ 7,ఇరిగేషన్ 5, ఎలక్ట్రిసిటీ 3, ఎంప్లాయిమెంట్ టీమ్ 3, వ్యవసాయ 2, ఈఈ డివిజన్ 2, మున్సిపాలిటీ 2, గ్రామీణాభివృద్ధి శాఖ 2, ఎస్సీ కార్పొరేషన్, సంక్షేమ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ జయమ్మ, జెడ్పీ సిఈఓ శోభ రాణి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి పాల్గొన్నారు.

## ఇంటర్, పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** త్వరలో నిర్వహించు ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్మీడియట్, మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. ఇట్టి వార్షిక పరీక్షలకు సంబంధిత శాఖలు అన్ని ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్, వైద్య, సమాచార, పంచాయితీరాజ్, రవాణా, విద్యుత్, ఆర్‌టిసి, ట్రెజరి, పోస్టల్, మున్సిపల్ అధికారులు ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అంశాలపై అధికారులకు దిశానిర్ధేశం చేశారు. పోలీసు బందోబస్తు మధ్య ప్రశ్న, జవాబు పత్రాలు డోర్ క్లోజ్డ్ వాహనాలలో మాత్రమే తరలించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఈఓ అశోక్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి భాను నాయక్, డిపిఓ యాదగిరి, పోలీసు, మున్సిపల్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## భూముల వివరాలు సరి చేయాలని గ్రీవెన్స్ డే కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/డిండి :** డిండి మండలంలోని తవకలాపూర్ రెవిన్యూ గ్రామ పరిధిలోని హాజ్య తండా గ్రామపంచాయతీ మల్య తండా రైతులకు సంబంధించిన భూములు పలు సర్వే నెంబర్‌లలో ఉన్నాయని భూముల నమోదులో తప్పులు జరిగాయని రైతుల భూములు సరిచేయాలని సోమవారం గ్రీవెన్స్ డే లో నలగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌కు తండా రైతులు వినతిపత్రం అందజేశారు.పై సర్వే నంబర్లలో రైతుల పట్టాలు తప్పులు తప్పుగా నమోదు కావడం జరిగిందని,వాస్తవానికి పట్టాదారు ఆధీనంలో ఉన్నప్పటికీ ఉండాల్సిన భూమి కంటే తక్కువగాను లేదంటే మరొకరికి ఎక్కువగాను నమోదు కావడం జరిగిందని ఉన్న భూమి ప్రకారం హద్దులు నిర్ణయించి పట్టా పాస్ పుస్తకాలను సరిచేయాలనీ కోరారు.రైతులకు చెందిన భూములు తమ తాతల నుండి సేద్యం చేస్తున్నావ్ ఇప్పటికి వారి వారసులకి పట్టాలు కాలేదని రెవెన్యూ శాఖ రైతులకు న్యాయం చేయాలని మల్య తండా రైతులు రాత్లావత్ రాందాస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు విన్నవించారు.

# సేవాలాల్ మార్గం ఆచరణీయం





### ఎమ్మెల్యే బత్తుల, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సేవాలాల్ మహారాజ్ సూచించిన మార్గం ప్రతి బంజారా బిడ్డ అనుసరిచాల్సిందేనని మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి, శాసనమండలి సభ్యులు కెతావత్ శంకర్‌నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లు సూచించార. సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎన్‌ఎస్పీ క్యాంప్‌లోని సేవాలాల్ మహారాజ్ భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహా భోగ్‌బండార్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ, వైస్ ఛైర్మన్ నవీన్ శిరీష, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, తహసీల్దార్ జవహర్‌లాల్‌నాయక్, రాగ్యానాయక్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నీతి, నిజాయితీ, ధర్మం వంటి సత్యమార్గాలు బోధించిన సంత్ సేవాలాల్ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.సంత్ సేవలాల్ మహారాజ్ 287 వ జయంతిని పురస్కరించుకొని సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలోఅడిషనల్ ఎస్పి రమేష్, డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ ,తహసిల్దార్ పరశురాం ,కార్పొరేటర్లు దీప్లా నాయక్,నాగార్జున,రవి నాయక్ హాజరయ్యారు.

**సేవాలాల్ పేరు మీద స్మృతి వనం**

**ప్రజాపక్షం/హాలియా:** గిరిజన ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ పేరు మీద త్వరలో మద్దిమడుగు ప్రాంతంలో ఒక స్మృతి వనం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని దానిని త్వరలోనే ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని నల్గొండ పార్లమెంటు సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. సంతు సేవాలాల్ 287వ జయంతి సందర్భంగా సోమవారం హాలియాలోని గిరిజన భవనం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంపీ రఘువీర్ రెడ్డి,ఎమ్మెల్యే జైవీర్ రెడ్డిలు నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో గిరిజన నాయకులు భాస్కర్ నాయక్,మున్సిపల్ చైర్మన్ చింతల చంద్ర రెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



## మతసామరస్యానికి ప్రతీక హజరత్ అబ్బాస్ దర్గా



**ప్రజాపక్షం/చింతపల్లి :** మతసామరస్యానికి ప్రతీక హజరత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉరుసు ఉత్సవాలని భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గత రెండు రోజులు నుండి మండల పరిధిలోని పికె మల్లేపల్లి గ్రామంలో కొనసాగుతున్న 57వ హజరత్ అబ్బాస్ దర్గా ఉరుసు ఉత్సవాలకు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గా ముత్తావల్లి మహమద్ చాంద్‌పాషా, యూసుఫ్ పాషా వారికి ఘన స్వాగతం పలికి పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించారు. తదనంతరం వారు దర్గాను దర్శించుకొని మాట్లాడుతూ కుల మతాలకతీతంగా సామరస్యపూర్వక వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలన్నారు. సమాజంలో భేదాభిప్రాయాలకు తావివ్వకుండా ప్రతీ ఒక్కరూ పరమత సహనం చాటుతూ ఐకమత్యంతో ముందుకెళ్ళాలన్నారు. ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యమని పునరుద్ఘటించారు. దర్గా అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, క్రాంతిరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, వేముల బుచ్చయ్య, వెంకటయ్య, ఘనిపల్లి రాములు, సైదులు, మల్లయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలు మృతి

**ప్రజాపక్షం/యాదాద్రి :** పరిపూర్ణ జీవితం గడిపిన శతాధిక వృద్ధురాలు ఫ్రీడమ్ ఫైటర్ మరణించడంతో గ్రామస్తులు సంతాపం తెలిపారు. రాజాపేట మండలం బేగంపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఫ్రీడమ్ ఫైటర్ వలిమెల లక్ష్మి (106) సోమవారం మృతి చెందారు. ఆమె భర్త హన్మంత్ స్వాతంత్ర సమర యోధుడు. జైలు జీవితం కూడా గడిపారు. లక్ష్మి కి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. 106 సంవత్సరాలకు పైగా జీవించిన వలిమెల లక్ష్మి రజాకార్లతో పోరాటం, బాధలు, బాధ్యతలు, మనుమరాండ్లతో సుఖదుఃఖాలు, మనుమలు, పరిపూర్ణ జీవనం గడిపారని గ్రామస్తులు సంతాపం తెలిపారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
24-02-2026
www.prajapaksham.in

*మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) 2026 డైరీని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు నేతృత్వంలో మా సభ్యులు భట్టిని కలిశారు. ఈ కార్యక్రమంలో విష్ణు, శివబాలాజీ, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.*

రీల్

## 'మా' డైరీని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి



'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) నూతన డైరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు రిలీజ్ చేయించారు. మా సభ్యుల కోసం చేపడుతున్న ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, హెల్త్ చెకప్‌లు, సభ్యుల సంక్షేమం కోసం మా కార్యవర్గం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. సోమవారం ఉదయం ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 'మా' వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి, ట్రెజరర్ శివ బాలాజీతో పాటుగా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ జయవాణి, మలక్‌పేట్ శైలజ, శివ నారాయణ, శశాంక్, హరనాథ్ బాబు, మానిక్, సంపూర్ణేశ్ బాబు, ఎం.ఆర్.సి. వడ్లపట్ల తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క 'మా' నూతన డైరీని ఆవిష్కరించి.. అధ్యక్షుడు మంచు విష్ణు, కార్యవర్గ సభ్యులను అభినందించారు.



## 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాట విడుదల

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మార్చి 26న థియేటర్లలో అడుగుపెట్టనున్న ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'దేఖ్లేంగే సాలా' విశేషంగా ఆకట్టుకుంది. వింటేజ్ పవర్‌స్టార్‌ను ఆవిష్కరించిన ఈ పాట చార్ట్ బస్టర్ గా నిలిచింది.ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి రెండవ గీతంగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' విడుదలైంది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్లోని మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ లో ఈ గీతావిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. పవర్‌స్టార్ ఆరాను ప్రతిబింబించేలా ఈ గీతముంది. నేను మెడ ముట్టుకుంటే, తొడ కొట్టినట్టే అనే లైన్ కేవలం పవర్‌ఫుల్గా వినిపించడమే కాదు.. అది పవర్ స్టార్ ఆరాలోని అసలైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. ఇక ఒక సంజ్ఞ యొక్క ప్రభావాన్ని, ఒక కదలిక యొక్క బరువును మరియు అభిమానుల్లో రేకెత్తించే ఉత్సాహాన్ని అద్భుతంగా చూపిస్తుంది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ మరోసారి తన సంచలనాత్మక, హైవోల్టేజ్ కూర్పుతో అంచనాలను పెంచేశారు. మాస్ ఎనర్జీతో నిండిన ఈ సంగీతం ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తుంది. చంద్రబోస్ రాసిన శక్తివంతమైన సాహిత్యం పవన్ కళ్యాణ్ చరిష్మాను సంపూర్ణంగా ప్రతిబింబిస్తుంది. 'ఆరా ఆఫ్ ఉస్తాద్' గీతావిష్కరణ వేడుకలో దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ. 'ఈ పాటకు' ఆరా ఆఫ్ ఉస్తాద్' అని ఏ ముహూర్తాన పెట్టామో.. ఇక్కడున్న ప్రతి ఒక్కరిలో ఆ ఆరా కనిపిస్తుంది. 'నేను మెడ ముట్టుకుంటే, తొడ కొట్టినట్టే'. సినిమాలో ఒక సన్నివేశంలో ఈ డైలాగ్ వస్తుంది. పవన్ కళ్యాణ్ గారు రెండు దశాబ్దాల నుంచి ఈ మేనరిజమ్ చేస్తున్నారు. దీనికి మాట రూపంలో చెప్తే బాగుంటుంది అనిపించింది. ఆ ఆలోచన నుంచి ఈ డైలాగ్ వచ్చింది. ఆ ఆరాకి ఖచ్చితంగా ఆస్కార్ కలమే కావాలి అనిపించింది. వెంటనే చంద్రబోస్ గారిని కలిసి ఈ పాట గురించి చెప్పాము. కేవలం ఎనిమిది గంటల్లో పాట సిద్ధమైంది అని గేయ రచయిత చంద్రబోస్ అన్నారు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్, ప్రీతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యాక్షన్ నేపథ్యంలో
## డకోయిట్

అడవి శేష్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం డకోయిట్. యాక్షన్ నేపథ్యంలో నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ సాంగ్‌ను ఈనెల 27న విడుదల చేయనున్నారు. రుబారూ అనే పాటను విడుదల చేయనున్నారు. యాక్షన్, తీవ్రవాదులను అధచివేసే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటివరకు అడవిశేష్ చేయని పాత్రను ఇందులో చేస్తున్నారని నిర్మాత సుప్రియ యార్లగడ్డ చెప్పారు. ఒక హాలీవుడ్ సినిమా స్థాయిలో నిర్మించామని చెప్పారు. కామాక్షి భాస్కర్, మ్రుణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నా రు. ఈ సినిమాకు భీమ్స్ సిసి రిలియో సంగీతం అందిస్తున్నా రు.




## మార్చి 6న వస్తున్న 'కాక్రోచ్'




సొంత ఊరు, గంగపుత్రులు, ఒక రొమాంటిక్ క్రైమ్ కథ, గల్ఫ్, వలస వంటి చిత్రాలతో అవార్డులు, ప్రేక్షకుల రివార్డులు అందుకున్న డైరెక్టర్ పి. సునీల్ కుమార్ రెడ్డి రూపొందిస్తున్న తాజా చిత్రం 'కాక్రోచ్'. ఈ చిత్రంలో అభిలాష్ సుంకర, ప్రేమసన్, నవీన్, తీర్థ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. 'కాక్రోచ్' సినిమాను శ్రీ లక్ష్మి పిక్చర్స్ బ్యానర్ పై బి.బాపిరాజు, ముతుకి నాగసత్యనారాయణ నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా మార్చి 6న థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రెస్‌మీట్‌ను హైదరాబాద్ ఫిలించాంబర్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బి.బాపిరాజు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న ఘటనలకు వాస్తవిక రూపంగా ఈ సినిమాను నిర్మించాం. ఈ చిత్ర నిర్మాణ సమయంలో కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నాం. సహజమైన లొకేషన్స్ లో రిస్కీ షూటింగ్ కానీ చేశాము. సెన్సార్ వారు మా మూవీకి 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. మార్చి 6వ తేదీన మా మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం అన్నారు.
డైరెక్టర్ పి.సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... విశాఖ, గాజువాక ప్రాంతంలో ఉండే కొందరు నేరస్తుల నిజ జీవిత ఘటనల ఆధారంగా ఒక వయలెంట్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. వేల కోట్ల రూపాయల మోసాలు చేసేవారిని వదిలేసే ఈ వ్యవస్థ, చిన్న చిన్న దొంగతనాలు చేసేవారి మీద ప్రతాపం చూపిస్తుంటుంది. మురికి కుప్పాలలో ఉన్న నేరస్థుల జీవితాల్లోని అనుభవాలు, ప్రేమలు నాకు చాలా విచిత్రంగా అనిపించాయి. అడ్డరోడ్డు మీద ఉండే వేశ్యకు, ఒక క్రిమినల్‌కు మధ్య జరిగే ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో ఈ చిత్రాన్ని రూపొందించాను. అభిలాష్ సుంకర, ప్రేమసన్, నవీన్, తీర్థ, మీనాక్షి, రామన్, బుగత, అంజి, ప్రదీప్, సముద్రం వెంకటేశ్, మల్లిక, ఎఫ్.ఎమ్. బాబాయ్, తాటికొండ ప్రసాద్, సునీత, రాజు, బాలాజీ, ఎల్ బీ రమణ, నటించారు.

## చిరంజీవికి ఘన సన్మానం

మెగాస్టార్ చిరంజీవి బిగ్గెస్ట్ రీజినల్ బ్లాక్ బస్టర్ 'మన శంకర వర ప్రసాద్ గారు' సెలబ్రేషన్స్ కొనసాగుతున్నాయి. చిత్రం ఘన విజయం సాధించిన సందర్భంగా తాజాగా కె.వి. రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చిరంజీవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, సుష్మిత కొణిదెలతో పాటు కె రాఘవేంద్రరావు, సి. అశ్వనీదత్, అల్లు అరవింద్, సురేష్ బాబు, ఎ.కోదండరామిరెడ్డి, బి గోపాల్, వి వి వినాయక్, బాబీ, బుచ్చిబాబు సానా, బండ్ల గణేష్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు, పలువురు సినీ రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. మన శంకర వర ప్రసాద్ గారు సంక్రాంతి సందర్భంగా థియేటర్లలో అద్భుతాలు సృష్టించి ప్రపంచ వ్యాప్తంగా 400 కోట్లకు పైగా వసూళ్లతో బిగ్గెస్ట్ రీజినల్ హిట్గా నిలిచింది. చిరంజీవి కెరీర్ లో 400 కోట్లు కలెక్ట్ చేసిన తొలి చిత్రంగా చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది.



## ఏప్రిల్‌లో రానున్న అరుణాచల గిరిప్రదక్షిణ




'ఆటగదరా శివా' అం టూ శివతత్వాన్ని ఆవిష్కరించిన ప్రముఖ నటుడు రచయిత దర్శకుడు తనికెళ్ల భరణి సుప్రసిద్ధ మహిమాన్విత పుణ్యక్షేత్రం అరుణాచలం నేపథ్యంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'అరుణాచల గిరి ప్రదక్షిణ' చిత్రం ఫస్ట్ గ్లిమ్ప్స్ విడుదల చేశారు. భీమవరం టాకీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వి.ఎఫ్.ఎక్స్‌లో సిద్ధహస్తుడైన యువ ప్రతిభాశాలి హర్ష. ఎం. దర్శకత్వం వహిస్తుండగా.మ సంగీతద్వయం డా.ఎ.జె.సంధ్య వర్షిణి, డా.వి.ఆర్.ఎ. ప్రదీప్ సంగీతం సమకూర్చుతున్నారు. ఈ చిత్రం కోసం స్వరపరిచిన ఓ గీతానికి చింతల శ్రీనివాస్ సాహిత్యం సమకూర్చగా మధు గాత్రం అందించారు. మదర్ సెంటిమెంట్ తోపాటు బలమైన భావోద్వేగాలతో రూపొందుతున్న 'అరుణాచల గిరి ప్రదక్షిణ' అద్భుత విజయం సాధించాలని తనికెళ్ళ కోరుకున్నారు. షూటింగ్ రెండో షెడ్యూలు అతి త్వరలో ప్రారంభమవుతుందని, ఏప్రిల్ లో ఈ సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత రామసత్యనారాయణ తెలిపార.



## కుమ్మెర ఘటన నిందితులపై చర్యలు తీసుకోవాలి

### డిజిపిని కలిసిన బిసి జెఎసి నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో దాడి ఘటనలో రెండు నెలల పాప మృతికి కారకులైన నిందితులపై చర్యలు తీసుకోవాలని బిసి జెఎసి నేతలు సోమవారం డిజిపి బి.శివధర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ..కుమ్మెర ఘటనలో అగ్రకుల అహంకారంతో బిసి,దళిత కుటుంబంపై అమానుషంగా దాడి చేసి పసికందు మరణానికి కారణమైన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. ఘటనపై హత్య కేసుతో పాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కుల ఆధారిత దాడులు, దురంకార హత్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే కుమ్మెర ఘటన నిందితులకు కఠిన శిక్షలు విధించాలని ఆయన తెలిపారు. బాధితులైన గణేష్, చంద్రకళ కుటుంబానికి ప్రభుత్వం కనీసం రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలని కూడా వారు కోరారు. ఈ కేసులో సంబంధం ఉన్న వారందరిపై రాజకీయ ఒత్తిడులకు లోనుకాకుండా నిష్పక్షపాత విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని డిజిపిని కోరామన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని డిజిపి శివధర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బిసి రజక కుటుంబానికి న్యాయం జరిగే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. త్వరితగతిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. డిజిపిని కలిసిన వారిలో నేతలు గుజ్జకృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా డిజిపిని కలిసి ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## రేపు 'రైల్ పార్శిల్ యాప్' ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే పార్శిల్ సేవలను డిజిటల్ దిశగా విస్తరించేందుకు దక్షిణ మధ్య రైల్వే ముందడుగు వేసింది. రైళ్ల ద్వారా పార్శిల్ పంపించే వినియోగదారులకు ఇంటివద్దకే బుకింగ్, డెలివరీ సౌకర్యం కల్పించే లక్ష్యంతో భారతీయ రైల్వేలలో తొలిసారిగా 'రైల్ పార్శిల్ యాప్'ను పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టనుంది. ఈ యాప్‌ను ఈ నెల 25న సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో ఆవిష్కరించనున్నారు. రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరవుతారు. భారతీయ రైల్వేలో ఈ వినూత్న ప్రాజెక్ట్ అమలు చేస్తున్న తొలి డివిజన్‌గా హైదరాబాద్ డివిజన్ నిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.
'రైల్ పార్శిల్ యాప్' ఫస్ట్ మైల్ (పికప్), మిడ్ మైల్ (రైల్వే రవాణా), లాస్ట్ మైల్ (డెలివరీ) సేవలను ఒకే డిజిటల్ వేదికలో అనుసంధానించే సమగ్ర ప్లాట్‌ఫామ్‌గా పనిచేస్తుంది. ఆన్‌లైన్ బుకింగ్, డిజిటల్ చెల్లింపులు, రియల్ టైమ్ ట్రాకింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. పార్శిల్ హ్యాండ్లింగ్ ప్రతి దశలో వినియోగదారుల మొబైల్‌కు ఆటోమేటెడ్ సందేశాలు చేరే విధంగా వ్యవస్థ రూపుదిద్దుకుంది.అదే కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగళూరుతో అవగాహన ఒప్పందం (ఎంఒయూ)పై సంతకం చేయనున్నారు. ఫ్రైట్ లాజిస్టిక్స్ మార్కెట్‌పై సమగ్ర అధ్యయనం చేసి, జోన్ వ్యాప్తంగా రైల్వే సరుకు రవాణా వాటాను పెంచేందుకు డివిజన్ వారీ వ్యాపార ప్రణాళికలు సిద్ధం చేయడం ఈ భాగస్వామ్య లక్ష్యం. డిజిటల్ సాంకేతికత ఆధారంగా పార్శిల్ సేవలను ఆధునీకరించే ఈ చర్య రైల్వే ఆదాయాన్ని పెంచడంతో పాటు పరిశ్రమలు, వ్యాపారులు, వ్యక్తిగత వినియోగదారులకు ఎండ్ టూ ఎండ్ లాజిస్టిక్స్ పరిష్కారాన్ని అందించనుంది.

## 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతాం

### 'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా తీర్చిదిద్దడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అందుకోసం... నానక్ రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ బీమా దిగ్గజం హార్ట్ ఫోర్డ్ 1.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1200 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన 'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్'ను ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఐటి మాత్రమే కాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, ఏరోస్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, ఫిన్ టెక్, డీప్ టెక్, రిటైల్ తదితర రంగాల్లోనూ హైదరాబాద్‌ను 'గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్'గా మార్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ విస్తరణలో భాగంగా రెండు శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన హార్ట్ ఫోర్డ్ హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం ఇక్కడి ప్రతిభకు, డిజిటల్ ఇంజనీరింగ్‌లో మన నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎఐ, రిస్క్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఆధునిక బీమా రంగంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందన్నారు. నగరంలో ఇప్పటికే 400కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జిసిసి) సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో మారియట్, మెక్‌డొనాల్డ్స్ యూబీఎస్, డాజన్, వాన్‌గార్డ్ ఎలీ లిల్లీ, హెచ్ సిఏ హెల్త్ కేర్, సిటిజన్స్ బ్యాంక్ లాంటి దిగ్గజ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయన్నారు. వీటిని కేవలం బ్యాక్ ఎండ్ ఆపరేషన్స్‌కు మాత్రమే పరిమితం చేయకుండా... గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా మార్చేలా అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. పారదర్శక పాలన, సమర్థవంతమైన నాయకత్వం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సంస్కరణలు, ఆధునిక డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి తదితర అంశాలు హార్ట్ ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా ఎంచుకునేందుకు దోహదపడుతున్నాయన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ కార్యాలయం యూఎస్ లోని హార్ట్ ఫోర్డ్ చికాగో, షార్లెట్, కొలంబస్ లో ఉన్న టెక్నాలజీ కేంద్రాలకు అనుబంధంగా పని చేస్తూ... ఎఐ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ డెవలప్ మెంట్ పై దృష్టి సారిస్తూ 'ఇంజనీరింగ్ ఎక్స్ లెన్స్ హబ్'గా పని చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో హార్ట్ ఫోర్డ్ ప్రెసిడెంట్ మోరిస్ టూకర్, చీఫ్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ ఆఫీసర్ క్లైర్ బర్న్స్ సిఐఒ శేఖర్ పన్నాల, హార్ట్ ఫోర్డ్ ఇండియా ఎండి సూర్య తమ్మిరాజు, సిటిఒ ఇమ్రాన్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



## కిమ్ తిరిగి ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

సైనికులకు ఉన్న అంచలమైన విశ్వాసాన్ని దబ్ల్యుపికె ఉటంకించింది. దాడులు జరిగితే అణు ఆధారిత యుద్ధాన్ని నియంత్రించేందుకు కిమ్ జోంగ్ నాయకత్వ పటిమ, ఆయన శక్తిసామర్థ్యాలు దేశానికి ఎంతో అవసరం అని పార్టీ పేర్కొంది. దేశ సైనికశక్తిని బలోపేతం చేయడంలో కిమ్ పాత్రను ప్రశంసిస్తూ ఆయనను పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకున్నట్లు తెలిపింది. పార్టీ అభివృద్ధి, దేశ శ్రేయస్సుకు ఈ ఎన్నిక అనివార్యమైనదని పార్టీ పేర్కొన్నట్లు యోన్‌హాప్ ఏజన్సీని ఉటంకిస్తూ కెసిఎన్‌ఎ తెలియజేసింది. రాబోయే ఐదు సంవత్సరాలకుగాను ఆర్థిక,రక్షణ,దౌత్య రంగాలలో ఉత్తర కొరియా సంప్రదాయక విధాన దిశామార్గాన్ని నిర్దేశించేందుకు జరుగుతున్న సమావేశాల్లో నాలుగోరోజున కిమ్ ఎన్నిక జరిగింది. ఎలాంటి దురాక్రమణ ముప్పునైనా ఎదుర్కోగల శక్తిసామర్థ్యాలున్న విప్లవ సైనిక దళాన్ని దేశంలో నిర్మించినందుకు కిమ్ జోంగ్ ఉన్‌కు పార్టీ ప్రశంసించింది. అదేవిధంగా అంతర్జాతీయ అంక్షలు, బాహ్యంగా అతిపెద్ద ఒత్తిడి ఎదురవుతున్నప్పటికీ, అణ్వాయుధ దళాలతో కేంద్రీకృతమైన యుద్ధ నిరోధకశక్తి దేశంలో ఎంతోబాగా మెరుగుపడిందని పార్టీ కాంగ్రెస్ ఆయనకు ప్రశంసలు ఇచ్చింది.వర్కర్స్‌పార్టీ ఆఫ్ కొరియా కార్యదర్శి ఇల్‌హ్యాన్ తొలుత మాట్లాడుతూ, దేశ శ్రేయస్సును కోరుతూ, స్థిరమైన అభివృద్ధివైపు అందరినీ నడిపించగల శక్తిసామర్థ్యాలున్న నాయకుడిగా కిమ్‌ను అభివర్ణించారు. సవరించిన పార్టీ నియమ నిబంధనావళిని కూడా మహాసభ ఆమోదించింది. ఈ సవరణలు ఏమిటనే వివరాలు మాత్రం వెల్లడికాలేదు. కిమ్ నాయకత్వాన్ని ఏకీకృతం చేయడంపై మహాసభ దృష్టిసారించింది.

## నిధులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఒక లక్షా 06 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులతో పాటు న్యాయపరమైన చిక్కులు ఏర్పడడంతో పనులు మందగించాయని వివరించారు. అవాంతరాలను అధిగమించి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వరద కాలువల ద్వారా వచ్చే నీటితో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరెల్లి గ్రామంలో 1.41 టి.ఎం.సిల నీటితో ఈ రిజర్వాయర్‌ను నిర్మించాలని ప్రతిపాదించగా అంచనాలు సవరించి 8.23 టిఎంసిల సామర్థ్యానికి పెంచి అదనపు ఆయకట్టు సేద్యంలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని, సవరించిన ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు పెట్టమని ఆయన తెలిపారు. అనేక ఆవాంతరాలతో అర్ధాంతరంగా నిలిచి పోయిన గౌరెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని వైపులా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక పై నిధుల కేటాయింపులలో కుడా ఎటువంటి అలసత్వానికి అవకాశం లేకుండా, ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటు త్వరితగతిన ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు.

**భూసేకరణను వేగవంతం చేయండి: పొన్నం ప్రభాకర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గౌరెల్లి ప్రాజెక్టు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. దేవాదుల,గౌరెల్లి తో సహా నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను పూర్తి చేయాలన్నారు. పట్టణీకరణ వేగవంతంగా పెరుగుతున్నదని, దీంతో భూముల ధరలు కూడా పెరగడంతో రైతులు పెద్ద మొత్తంలో నష్టపరిహారాన్ని కోరుకుంటున్నారని,దీనికి సంబంధించిన విధాన నిర్ణయాలు న్యాయపరంగా తీసుకోవాలని పొన్నం సూచించారు.

## నీళ్లు కలుషితం

(మొదటి పేజీ తరువాయి)



పాదచారులు, వాహనదారులు ఈదుర్వాసనను భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో దుర్వాసన మరింత పెరుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో పేరుకుపోతున్న వ్యర్థాల వల్ల దోమలు, దుర్వాసనతో పాటు అంటువ్యాధుల ముప్పు కూడా పెరుగుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోడ్డుపై ప్రయాణించే మహిళలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని స్థానికుల చెపుతున్నారు. చెరువులో ఎలాంటి వ్యర్థ పదార్థాలు పడవేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. చుట్టూ ఫన్సింగ్ ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు పెట్టాలి అని పలువురు ప్రజలు కో రుతున్నారు. అలాగే చెరువును శుద్ధి చేసి, పరిశుభ్రంగా ఉంచేందుకు సంబందిత అధికారులు వెంటనే స్పందించాలి అని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, నాగులమ్మ చెరువును రక్షించేందుకు తగు చర్యలు చేపట్టకపోతే, ప్రజారోగ్యంపై తీవ్రప్రభావంచూపే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

**అధికారులు స్పందించి చెరువును కాపాడాలి : అంజయ్య**



నాగులమ్మ చెరువులో హోటల్ నిర్వాహకులు ప్లాస్టిక్ కవర్లు, చెడు పదార్థాలు నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. దీనివల్ల చెరువు నీరు పూర్తిగా కలుషితమై దుర్వాసన వస్తోంది. అక్కడి చెత్తను కుక్కలు, పందులు రోడ్డుపైకి తీసుకువస్తున్నాయి. పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి చెరువును కాపాడాలి.

**అవసరమైన చర్యలు తీసుకుంటాం : ఉప సర్పంచ్ నిర్మల వెంకటయ్య గౌడ్**



గత నాగులమ్మ చెరువు పట్టణ కేంద్రంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటంతో చిరు వ్యాపారస్తులు చెత్తను చెరువులో పడేస్తున్నట్టు తెలిసింది. చెరువు నీరు పూర్తిగా కలుషితమవుతుండడం వాస్తవం. అతి త్వరలో డప్పుతో దండోరా వేయించి, వ్యాపారస్తులను హెచ్చరిస్తాం. చెరువు నీరు కలుషితం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com